
Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 140 • గురువారం 31 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+12 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి: శుద్ధ దశమి (పూర్తి) ; నక్షత్రం: మూల తె. 4.53 వరకు, అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: రా. 9.45 నుండి 11.30 వరకు; వర్జ్యం: ఉ. 11.07 నుండి 12.54 వరకు, తదుపరి తె. 3.06 నుండి 4.53 వరకు; దుర్ముహూర్తం: ఉ. 9.59 నుండి 10.50 వరకు, తదుపరి మ. 3.05 నుండి 3.57 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు



ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ క్రీమీలేయర్!


• కింది స్థాయి ఉద్యోగులకు లబ్ధి
• నియామకాల్లో సమతుల్యతకు ఓబీసీ కోటా అమలు
• కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగ నియామకాలకు ఓబీసీ సంపన్న శ్రేణి పరిమితిని వర్తింపజేస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మంత్రుల ➪ 3వ పేజీలో...

టెస్టు క్రికెట్‌లో బంగ్లా కేక!

• ఆస్ట్రేలియాపై 20 పరుగుల తేడాతో విజయం
• ఆసిస్‌పై పసికూనలకిదే తొలి టెస్టు గెలుపు
• 1-0 తేడాతో కంగారూలను చిత్తుచేసిన బంగ్లా జట్టు
• 101 టెస్టులాడిన బంగ్లా... గెలిచింది 10 మ్యాచులే

12



రెవెన్యూ కోర్టులు రద్దు..!



ప్రపంచ బ్యాడ్మింటన్ వెండి పతక విజేత పీవీ సింధును సత్కరిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి కేటీఆర్

రహదారులతోపాటే చెక్ డ్యాంలు

• ప్రభుత్వం వినూత్న ప్రక్రియ • భూగర్భ జలాల పెరుగుదలకు దోహదం • ఆర్ అండ్ బీ శాఖ కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రహదారుల విస్తరణ, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోంది. జాతీయ, రాష్ట్ర రహదారుల విస్తరణకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. 2915 కిలోమీటర్ల జాతీయ రహదారులను మూడేళ్లలో పూర్తి చేసేలా ముందడుగేస్తోంది. అదేవిధంగా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 14వేల కిలోమీటర్ల రాష్ట్ర రహదారుల నిర్మాణానికి పూనుకున్నది. ఇందుకుగానూ రూ. 15వేల కోట్లను వ్యయం చేయాలని నిర్ణయించింది. మరోవైపు జాతీయ రహదారుల విస్తరణకు కేంద్రం రూ. 10వేల కోట్లను అందజేసింది. అయితే గత మూడేళ్లలో 500కిలో మీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం పూర్తిచేశారు. రాష్ట్ర ఆవిర్భావానికి పూర్వం 2527 కిలోమీటర్లుకాగా మరో 2915 కిలోమీటర్ల ➪ 8వ పేజీలో...

• కలెక్టర్ మినహా కింది స్థాయిలో ఆ కోర్టులు అవసరం లేదు: సీఎం
• రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు త్వరలో నోటిఫికేషన్
• మూడు దశాబ్దాల వ్యవస్థకు చెల్లుచీటి • రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సమగ్ర భూ సర్వేతో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ కోర్టులను రద్దు చేయాలని సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. 1986లో (స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలో) మాండలిక వ్యవస్థ ఏర్పాటైనప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాలుగా అమల్లో ఉన్న వ్యవస్థలో కీలక మార్పులు చేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. కలెక్టర్ మినహా కిందిస్థాయిలో భూ కేసుల పరిష్కారానికి ఉన్న కోర్టులన్నీ రద్దు చేయాలని ఆదేశాలిచ్చారు. తహసిల్దార్, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్ల వద్ద నిర్వహిస్తున్న కోర్టులు అవసరం లేదని, ఆ అధికారాలను ఉపసంహరించాలని నిర్ణయించారు. జాయింట్ కలెక్టర్ వద్ద ఉన్న కోర్టులను కలెక్టర్లకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలోనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భూ రికార్డుల ప్రక్షాళనపై బుధవారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అత్యంత పారదర్శకతతో భూ రికార్డులను ప్రక్షాళన చేసి సమగ్ర సమాచారాన్ని కంప్యూటర్లలో భద్రపరుస్తున్నందున ఇక నుంచి భూముల తగాదాలు 90శాతం తగ్గుతాయని, అందువల్ల పనిభారం పెంచుతున్న ఈ రెవెన్యూ కోర్టుల వ్యవస్థ అవసరం లేదని సీఎం కేసీఆర్ అభిప్రాయపడ్డారు. భూ రికార్డులు, తగాదాలకు సంబంధించి కలెక్టర్, కోర్టు మినహా మిగతా ఇతర రెవెన్యూ కోర్టులన్నీ రద్దు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల్లో రైతుల పాస్‌బుక్‌లు కుదవపెట్టే విధానం ఇకపై ఉండకూడదని తేల్చిచెప్పారు. కంప్యూటర్ సమాచారం ఆధారంగా రైతులకు రుణాలిచ్చే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భూముల వ్యవహారాలు రాజ్యాంగపరంగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయని పేర్కొన్నారు. అందుకే విధానాల్లో మార్పులు చేర్పులు, ప్రక్షాళన చేసే అధికారం రెవెన్యూ అధికారులకు ➪ 3వ పేజీలో...

భూ హక్కులకు భంగం కలగొద్దు

• రైతుల ప్రయోజనాలూ ముఖ్యం
• భూముల రికార్డుల ప్రక్షాళన
• అన్నింటా పారదర్శకత అవసరం
• ధ్రువపత్రాలు మరింత సరళం
• పంట రుణాల మంజూరులో పట్టాదారు పుస్తకాలవసరం లేదు
• ఆన్‌లైన్ రికార్డులు ఆధారంతో రుణ వ్యవస్థ నెలకొల్పండి: కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భూ రికార్డుల నిర్వహణలో దేశానికే ఆదర్శవంతంగా నిలిచేలా పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేసి రైతుల యాజమాన్య హక్కులకు భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉన్న రికార్డుల ప్రక్షాళన ప్రక్రియలో ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ఈ క్రమంలో రెవెన్యూ, వ్యవసాయ, పంచాయితీరాజ్, ఇరిగేషన్ శాఖల అధికారుల యంత్రాంగం పూర్తిస్థాయి సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే క్రమంలో మరింత చిత్తశుద్ధి, నిబద్ధత అవసరమని సూచించారు. ఇదే అంశంపై బుధవారం ప్రగతి భవన్‌లో ➪ 3వ పేజీలో...



కవిత ఫిదా

హైదరాబాద్(నిజామాబాద్) ఆంధ్రప్రభ: అవ్వ ఆప్యాయతకు నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత ఫిదా అయ్యారు. సిర్పూర్ గ్రామంలో కాలుమోపగానే ఒక వృద్ధురాలు అందరినీ తోసుకుంటూ ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది గమనించిన కవిత ఆమెకు దగ్గరగా వెళ్ళి కరచాలనం చేశారు. వెంటనే ఆ అవ్వ కవితను గట్టిగా కావలించుకున్నారు. దాదాపు రెండు నిమిషాలు అలాగే ఉండిపోయింది. నా కూతురులాంటి దానివి.. అందరికీ అన్నీ చేస్తున్నావ్ చల్లగా ఉండాలంటూ అన్న ఆ అవ్వ మాటలకు కవిత భావోద్వేగానికి గురయ్యారు. కాసేపయ్యాక ఆమె చేయి పట్టుకుని తనతో పాటు నడిపించుకుంటూ గ్రామంలో పూర్తయిన ఎస్సీ మాల కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.

ఉద్యమకారులకు అన్యాయం
తెరాస నేత ఆత్మహత్యాయత్నం



తాండూరు, కెఎన్ఎన్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలోనే తెలంగాణ ఉద్యమకారుడు ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డారు. ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 2004 నుంచి మంత్రి మహేందర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తాండూరులో మైనారిటీ వర్గానికి చెందిన అయూబ్‌ఖాన్ టిఆర్ఎస్‌లో పనిచేస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన అయూబ్‌ఖాన్ తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. బుధవారం తాండూరులో పట్టణ టిఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న అయూబ్‌ఖాన్ సమావేశం మొదట్లోనే తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరి మైక్ ➪ 2వ పేజీలో...

పీఎస్ఎల్వీ సీ-39 కౌంట్‌డౌన్

• నేడు నింగిలోకి ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహం



8లో





మిషన్ భగీరథ భేష్..!

• ప్రాజెక్టు పనుల నాణ్యత బహు బాగు
• టెండర్ల ప్రక్రియ రాష్ట్రాలకు ఆదర్శం
• ఆశయం, అమలుతీరు ప్రశంసనీయం
• మధ్యప్రదేశ్ ఇంజనీర్ల బృందం

గజ్వేల్, కెఎన్ఎన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం భేష్‌గా వుందని ఈ పథకాన్ని మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం ప్రశంసించింది. బుధవారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ మండలం కొమటిబండ మిషన్ భగీరథ సంప్‌హౌజ్‌ను మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన ఇంజినీర్ల బృందం సందర్శించింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ఇంజినీర్ జిఎం ఎకె.శ్రీవాత్సవ నేతృత్వంలో బోపాల్ ఈఈలు ➪ 2వ పేజీలో...

సంతకం పెట్టేదాకా వెళ్లిపోం!

• ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ బంగ్లాలో 40 మంది ఆప్ ఎమ్మెల్యేల బైఠాయింపు
• మొహల్లా క్లినిక్‌ల పథకంపై రాజకీయాలు చేయొద్దంటూ వినతి



న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రతిపాదించిన మొహల్లా హెల్త్ ప్రాజెక్టును లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బజాల్ ఆమోదించాలని బుధవారం ఆప్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ప్రాజెక్టుపై ఎల్‌జీ సంతకం చేసేవరకు గవర్నర్ బంగ్లాలోనే ఉంటామని సుమారు 40 మంది ఎమ్మెల్యేలు ఆందోళన నిర్వహించారు. మొహల్లా ప్రాజెక్టుపై రాజకీయాలు తగవన్నారు. ఇది రెండు కోట్ల ఢిల్లీ పౌరులకు సంబంధించినదని, ఏమాత్రం ఆలస్యం జరగకూడదని కేజ్రీవాల్ ట్విట్టర్‌లో వెల్లడించారు. సీఎం, గవర్నర్ మధ్య ఏర్పడిన అభిప్రాయబేధాలతో ప్రాజెక్టు ఆగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆంధ్రప్రభ

గోదావరి పరవళ్లు

ప్రాజెక్టులకు జలకళ

• శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో • నిండుకుండలా కడెం ప్రాజెక్ట్
• నిండుతున్న ఎల్లంపల్లి, సింగూరు • గోదావరిలో పెరుగుతున్న నీటి మట్టం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలు, ఎగువ నుండి వస్తున్న స్వల్ప వరదలతో గోదావరి బేసిన్ ప్రాజెక్టులు జలకళ సంతరించు కుంటున్నాయి. గోదావరి బేసిన్‌లో భారీ ప్రాజెక్టు, ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లోలు కొనసా గుతున్నాయి. బుధవారం సాయంత్రం ప్రాజెక్టులోకి 30,126క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ ప్రాజె క్టు సామ ర్థ్యం 90.31 టిఎం సిలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 33.33 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఇం దులో 24టిఎంసిలకుపైగా వరద ఈ పక్షంలోనే చేరడం విశేషం. ప్రాజె క్టుకు ఇన్‌ఫ్లోలు కొనసాగు తున్నా యి. సింగూరు ప్రాజెక్టులోకి 3135 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 29.91టిఎంసిలు కాగా, ఇప్పటికే ప్రాజెక్టులో 21.35 టిఎంసిల నీరు చేరింది.



నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 2607 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు సామర్థ్యం 17.80 టిఎంసిలు కాగా, ప్రాజెక్టులో 2.77టిఎంసిల వరద నీరు చేరింది. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు సామర్థ్యం 7.60 టిఎంసిలు కాగా, 7.20టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 9500 క్యూసెక్కులు వరద వస్తుండగా, 11, 409 క్యూసెక్కుల వరదను బయటకు వదులు తున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 15.81టిఎంసిల నీరు ప్రస్తుతం నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 20.18టిఎంసిలు కాగా ప్రాజెక్టులోకి 7323క్యూసెక్కుల వరద వస్తోంది. గోదావరి నదిలో కూడా నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. ఏటూరునాగారం, భద్రాచలం వద్ద నీటిమట్టం క్రమంగా పెరుగుతోందని అధికారవర్గాలు తెలిపాయి.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

కృష్ణా బేసిన్‌కు సంబంధించి జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోలు పెరిగాయి. ఈ ప్రాజెక్టులోకి 12,700క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1915క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 9.66టిఎంసిలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 6.79టిఎంసిల నీరు నిల్వ ఉంది. తుంగభద్ర, ఆల్మట్టి ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు భారీగా పెరిగాయి. ఇవి తెలంగాణకు ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. ఆల్మట్టికి ఇన్‌ఫ్లోలు ఇదే రీతిన కొనసాగితే.. జూరాల, శ్రీశైలంలకు నీరు వచ్చే అవకాశం ఉంది. కనీసం తాగునీటి సమస్య అయినా తీరుతుందన్న ఆశ అధికారవర్గాల్లో మిణుకుమిణుకు మంటోంది. భద్రాద్రి జిల్లాల్లో తాలిపేరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతుండడంతో మూడు గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. ఎల్ఎండి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లోలు లేవు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు.. ఇతర రాష్ట్రాల్లోని వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిపై మళ్ళీ ఆశాజనకమైన వార్తలు వినిపిస్తున్నాయి. ఆయకట్టు రైతుల్లో ఇవి ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

తెలంగాణ కాంగ్రెస్‌లో...

భారీ మార్పులు, చేర్పులు

• ప్రచార కార్యదర్శులుగా విజయశాంతి, అజహరుద్దీన్ • మరో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పొన్నం?



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా ఉన్న అధిష్టానం ఆ దిశలో పావులు కదుపుతోంది. తెలంగాణ రాష్ట్రంలో పార్టీకి వైభవం తీసుకువచ్చేందుకు భారీ మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టనుంది. ఈ మేరకు కార్యాచరణకు దిగింది. పార్టీ నాయకులు కూడా ఊహించని విధంగా ఢిల్లీ నుంచే మార్పులు చేపడుతోంది. అక్టోబర్ నెలాఖరు వరకు పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకుని అధికార టీఆర్ఎస్‌పై శంఖారావం మోగించేందుకు స్టార్ క్యాంపెయినర్లను సిద్ధం చేసుకుంటోంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో చురుకుగా పాల్గొన్న విజయశాంతిని పార్టీలోకి తీసుకువచ్చేందుకు ఇప్పటికే చర్చలు పూర్తి చేసినట్లు తెలిసింది. పార్టీలో చురుకుగా పాల్గొనేందుకు ఆమె కూడా సుముఖత వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు, ఏఐసీసీ నేత ఒకరు ఆమెతో చర్చలు జరిపారు. పార్టీలో ఆమె కోరుకున్న బాధ్యతలను అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో రాములమ్మ కూడా సై అన్నట్లు తెలిసింది. అదే విధంగా మాజీ ఎంపి, క్రికెటర్ అజహరుద్దీన్‌ను కూడా రాష్ట్ర రాజకీయాల్లోకి తీసుకురావాలన్న ప్రయత్నాలు ఫలించాయి. హైదరాబాద్ స్వస్థలం కావడంతో ఇక్కడే రాజకీయాలు చేయాలని ఆయన భావిస్తున్నారు. నగరంలో ముస్లిం మైనారిటీలను ఆకర్శించడంతో పాటు ఎంపి అసదుద్దీన్ ఓవైసీని ఎదుర్కొనేందుకు ఆయన సంసిద్ధత వ్యక్తం చేశారు. అజ్జుభాయ్‌తో పాటు రాములమ్మకు ఇద్దరికి పార్టీ ప్రచార కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించాలని పార్టీ యోచిస్తోంది. అదే విధంగా టీపీసీసీకి మరో వర్కింగ్ ప్రెసిడెంట్ రానున్నారు. ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లు భట్టి విక్రమార్క ఒక్కరే ఉన్నారు. ఆయనతో పాటు బీసీ లేదా మహిళకు మరో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. బీసీ వర్గానికి ఇవ్వదల్చుకుంటె మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పగించవచ్చని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. మహిళ అయితే, డీకే అరుణకు దక్కే అవకాశం ఉంది. రాష్ట్రం నుంచి పలువురు నాయకులను ఎఐసీసీలోకి తీసుకోవాలని పార్టీ యోచిస్తోంది. ఎఐసీసీ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు ఇతర పార్టీ పదవులను కూడా రాష్ట్రా నికి చెందిన నాయకులకు అప్పగించేందుకు పార్టీ సిద్ధమైంది. అర్హుల కోసం ఆరా తీస్తున్నట్లు సమాచారం. అదే విధంగా పార్టీని బలోపేతం చేసే దిశలో పార్టీ సీరియస్‌గా అడుగులు వేస్తోంది. పని చేయని వారి పట్ల కఠినంగా ఉండాలని నిర్ణయించింది. కర్నాటక, హర్యానాల్లో అనుసరించిన ఫార్ములానే ఇక్కడ కూడా చేపడుతోంది. తెలంగాణ ఇచ్చిన పార్టీగా వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో పార్టీని గెలిపించుకోవాలనే లక్ష్యంతో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ఉన్నందున ఆ దిశలో కార్యాచరణ వేగంగా సాగుతోంది.

మిషన్ భగీరథ పనులపై

అలసత్వమేల?



• పనుల నత్తనడకపై డిప్యూటీ సీఎం అసంతృప్తి • అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం • డిసెంబర్ 31లోపు పనులు పూర్తి చేయాలి • జనవరి 1నుంచి ప్రతి ఇంటికీ నీళ్లివ్వాల్సిందే • కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో డిప్యూటీ సీఎం కడియం

వరంగల్, కెఎన్ఎన్ : మిషన్ భగిరథ పనులు వరంగల్ ఉమ్మడి జిల్లాలో పూర్తిగా నత్తనడకన నడుస్తున్నాయని డిపూ్యటీ సీఎం కడియం శ్రీహరి తీవ్ర అసహనం, అసంతృప్తి వక్తం చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హన్మకొండలోని నందన గార్డెన్‌లో 5 జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా అధికారులతో మిషన్ భగిరథ, రైతు సమన్వయ కమిటీలు, చేప పిల్లల పంపిణీ బుధవారం పై రివ్యూ చేశారు. ఈ సమావేశంలో డిసెంబర్ 31 నాటికి పనులు పూర్తి చేసే విధంగా రివైజ్డ్ షెడ్యూల్ ఇచ్చారు. ఒక్కొక్క జిల్లా అధికారిని డిసెంబర్ నాటికి పనులు ఎలా పూర్తి చేస్తారో, ఇప్పటి వరకు పనులు ఎలా పూర్తి చేశారో, పనులు ఏ స్థాయిలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి పూర్తి చేయడానికి గల ఇబ్బందులు, సమస్యలను కలెక్టర్లు, ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి పూర్తి చేయడానికి గల ఇబ్బందులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలన్నీ తమ స్థాయిలో కలెక్టర్లు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా డిపూ్యటీ సీఎం అధికారుల పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమావేశాలకు ఎలాంటి సమాచారం లేకుండా ఎలా వస్తారని.. ఇక్కడికి ఇచ్చి మీకు ఇష్టం వచ్చిన ముచ్చట్లు చెబుతారా? అని తీవ్రంగా మందలించారు. సమాచారం లేకుండా ముచ్చట్లు చెబితే ఉద్యోగాలు ఊడుతాయని తీవ్రంగా హెచ్చరించారు. ప్రభుత్వం మిషన్ భగిరథ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందనే విషయం అధికారులకు తెలిసినా? ... డిసెంబర్ 31 వరకు పనులు పూర్తి చేసి.. జనవరి 1న ఎట్టి పరిస్థితుల్లో ప్రతి ఇంటికీ నీళ్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్ కృతనిశ్చయంతో ఉన్నా.. అధికారులు మాత్రం నిశ్చితంగా ఎలా ఉండగలుగుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాలో సెగ్మెంట్ల వారిగా మిషన్ భగీరథ పనులు జరుగుతున్నాయన్నారు. అయితే ఇందులో పాలేరు సెగ్మెంట్ లో పనులు నత్తనడకన నడుతస్తున్నాయని, ఎల్ఎండీ వరంగల్ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని సంబంధిత అధికారులు ఎం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పనితీరు మార్చుకొని పనుల్లో పురోగతిని చూపించాలని హెచ్చరించారు. నెలకొకసారి ఐదు జిల్లాల అధికారులు, నేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం పనులు జరిగేలా అధికారులు, ఏజెన్సీలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, మీకు బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. ఎక్కువ పనులు ఏజెన్సీల వల్లే సమయం వృథా అవుతుందని ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకోచ్చారు. దీంతో ఏజెన్సీ ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు ఇష్టం లేకపోతే చెప్పండి వేరే వారితో చేయించుకుంటాం.. కావాలని చేస్తున్నారా? లేక మీ వల్ల కావడం లేదా? అని తీవ్రంగా మందలించారు. ఇకపైగా ఎలాంటి సమయం వృథా కాకుండా చూడాలని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ విధించిన డెడ్ లైన్ లోపు ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిషన్ భగిరథ పనులు పూర్తి చేయాలన్నారు. జనవరి 1 వరకు అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికి తాగునీటిని మిషన్ భగిరథ ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతును రాజు చేసేందుకు సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. గ్రామ, మండల కమిటీలను సెప్టెంబర్ 2 నుంచి 10 వరకు కమిటీలను పూర్తి చేయాలని, 10 నుంచి 14 వరకు ఆ కమిటీలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వచ్చే ఏడాది మే నెలలో రైతులకు అకౌంట్లు తెరచి ప్రభుత్వం ఇవ్వనున్న పంటసాయాన్ని ఆ అకౌంట్లలో వేసేందుకు చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. ఎకరానికి రూ. 8వేలు పెట్టుబడిగా ఇవ్వాలని నిర్ణయించినట్లుగా.. వాటిని నేరుగా రైతుల అకౌంట్లలో వేస్తామన్నారు.

అలాగే సెప్టెంబర్ 3 నుంచి చేపపిల్లల పింపిణీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరంగల్ ఉమ్మడి జిల్లాలో 30 శాతం చెరువులు నిండాయన్నారు. కనీసం 50శాతం నీరు నిండిన చెరువులన్నింటిలో చేపపిల్లలు వేయాలని అధికారులకు సూచించారు. సెప్టెంబర్ 3వ తేదీ నుంచి 10వ తీఏదీ వరకు చేపపిల్లలు వేసే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే ఒప్పందాలు పూర్తి అయ్యాయని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీలు సీతారాం నాయక్, పసునూరి దయాకర్, ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు , జడ్పీ చైర్‌పర్సన్ గద్దల పద్మ, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్ రావు, రాజయ్య, వినయ్ భాస్కర్, అరూరి రమేష్, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్లు ఆమ్రపాలి, ప్రశాంత్ జీవన్ పాటిల్, దేవసేనా, ప్రీతి మీనా, మురళి, మునిసిపల్ కమిషనర్ శృతి ఓజా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో రిజర్వాయర్లు నింపండి

• అధికారులకు డిప్యూటీ సీఎం కడియం ఆదేశం

వరంగల్, కెఎన్ఎన్ బ్యూరో : ఉమ్మడి వరంగల్ జిల్లాను సస్యశామలం చేసేందుకు గోదావరి జలాలతో దశలవారిగా చెరువులు, రిజర్వాయర్లను నింపాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదేశించారు. రెండో పంట కోసం ముందుచూపుతో జల ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. బుధవారం సాయంత్రం హన్మకొండ సర్క్యూట్ అతిథి గృహంలో శ్రీహరి గోదావరి ఎత్తిపోతల పథకం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ధర్మసాగర్, గండి రామారం, బొమ్మకూరు, తపాస్‌పల్లి, అశ్వరావుపల్లి, చిటాకోడూరు రిజర్వాయర్లతో పాటు 257 చెరువులను నింపడంపై దృష్టిసారించాలని శ్రీహరి అన్నారు. ఈ యేడాది జూన్ 29 నుంచి నవంబర్ 15వ తేదివరకు గోదావరి ఎత్తిపోతల పథకం కింద మొదటి, రెండవ దశల ద్వారా నాలుగు మోటార్లతో నీటిని నింపాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు 70 ఎంసీఎఫ్‌టీల నీటిని గోదావరి నుంచి లిఫ్ట్ చేయాలన్నారు. దీని ద్వారా దేవాదుల ప్రాజెక్టు కింద నిర్మించిన ఏడు రిజర్వాయర్లల్లో నాలుగు టీఎంసీల నీటిని నిలువ చేయవచ్చు అన్నారు. వీటితో పాటు ఆయా రిజర్వాయర్ల కింద ఉన్న గొలుసుకట్టు చెరువులను కూడా నింపాలని సూచించారు. తద్వారా వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, హుస్నాబాద్, పాలకుర్తి, జనగామ నియోజకవర్గ పరిధిలోని 257 చెరువులను నవంబర్‌లోపు నింపడానికి నీటిపారుదల శాఖ చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుకు రెండో పంటకు నీరు అందించాలనే ఆలోచనలతో మోటర్ల ద్వారా లిఫ్ట్ చేసి రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నింపే ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కడియం చెప్పారు. చెరువుల్లో నింపిన నీటిని మొదటి పంటకు వినియోగించకుడా రెండవ పంటకు మాత్రమే వాడుకోవాలని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. గత యేడాది చెరువులు నింపడం వలన వరంగల్ ఉమ్మడి జిల్లాలో రైతులు రెండో పంటను మంచిగా పండించుకున్నారని, వచ్చే యేడాది రెండో పంటను ఇదే విధంగా పండించుకునేందుకు ముందుచూపుతోనే జల ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని ప్రజాప్రతినిధులు ఈ ప్రణాళిక సక్రమంగా అమలు జరిగే విధంగా చూడాలని శ్రీహరి కోరారు. ఈ సమావేశంలో దేవాదుల ఎత్తిపోతల పథకం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సీఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ భేష్..!

(మొదటిపేజీ తరువాయి)

పికె.రఘువంశీ, పంకజ్, విజయవార్గియ, గ్వాలియర్ ఈఈ ఆర్‌కె.జైన్‌తో పాటు మరో ఏడుగురు ఇంజినీరింగ్ అధికారులు మిషన్ భగీరథ సంప్‌హౌజ్‌ను క్షుణ్ణంగా పరిశీలించి నీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం 4 గంటలకు కొమటిబండకు చేరుకున్న ఇంజినీర్ల బృందం సంప్‌హౌజ్ మొత్తం కలియతిరిగారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిఇ విజయప్రకాశ్, ఇఇ రాజయ్య, డిఇ కమలాకర్ మధ్యప్రదేశ్ ఇంజినీరింగ్ బృందానికి అక్కడే వున్న మ్యాప్ ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి కొమటిబండ సంప్‌హౌజ్ వరకు నీటి సరఫరా గురించి వివరించారు. అలాగే కొమటిబండ సంప్‌హౌజ్ నుంచి దుబ్బాక, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నీటి సరఫరా చేసే విధానాన్ని వివరించారు. గతంలో గజ్వేల్ ప్రాంతంలోని అన్ని గ్రామాల్లో ఏడాదికి తొమ్మిది నెలల పాటు నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసిన రోజులు వున్నాయని, మండలంలోని ఒక్క బెజుగామ గ్రామానికి సంవత్సరం పొడవునా నీటి సరఫరా చేయడం జరిగిందన్నారు. కానీ మిషన్ భగీరథ పథకం ద్వారా ఇప్పుడు అన్ని గ్రామాలకు నల్లాల ద్వారానే నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. కాగా గతంలో ఒక్కరికి 30 లీటర్ల నీరు అందించగా ప్రస్తుతం ఒక్కరికి



వంద లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు వెల్లడించారు. గతంలో ఒకకుటుంబానికి సంవత్సరానికి 2002 రూపాయలు ఖర్చు కాగా ప్రస్తుతం రూ.59 మాత్రమే ఖర్చు ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ పథకం ప్రారంభం కాకముందు చేతిపంపులు, మోటార్లు వాడేవారని, ప్రజలకు ఆ కష్టాలు ఇప్పుడు తప్పాయన్నారు. విద్యుత్, ట్యాంకర్లు, సిబ్బంది తదితరులకు గతంలో సంవత్సరానికి రూ.32 కోట్లు ఖర్చు కాగా ప్రస్తుతం ఇప్పుడు 5 కోట్ల రూపాయలు మాత్రమే ప్రభుత్వం ఖర్చు పెడుతుందన్నారు. గజ్వేల్ ప్రాంతంలో 8 పరిశ్రమలు వున్నాయని, వాటికి నీరు అందించడం వల్ల ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.4.64 కోట్లు ఆధాయం లభిస్తుందని అధికారులు వెల్లడించారు.

గిరిపల్లిలో ఇంటింటికి నల్లా కనెక్షన్‌ను పరిశీలించిన ఇంజినీర్ల బృందం

ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశయం గొప్పదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో నీళ్ళ కోసం నానా తిప్పలు పడేవారని, సిఎం ఆలోచనతో మారుమూల గ్రామాలకు కూడా శుద్ధి చేసిన గోదావరి నీళ్ళు తాగుతున్నామని గిరిపల్లి గ్రామ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందానికి తెలిపారు. ఈ బృందం గిరిపల్లి గ్రామంలో ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా నీరు వచ్చే తీరును పరిశీలించారు. అనంతరం గ్రామ సర్పంచ్‌తో మాట్లాడడం జరిగింది. ఎన్నిసార్లు నీళ్ళు వస్తాయని సర్పంచ్‌ను అడుగగా రెండుసార్లు నీళ్ళు వస్తున్నాయని, ఉదయం, సాయంత్రం వస్తాయని తెలుపడం జరిగింది. ఇంట్లో నల్లా తీసేస్తె ఏమిచేస్తారని అడుగగా ఎవరూ తీయడంలేదని అలా తీసేస్తె జరిమానాలు విధిస్తామన్నారు. నీటి సరఫరా చేసే ఆపరేటర్‌కు ఎంత డబ్బు చెల్లిస్తున్నారని అడుగగా ఇంటికి రూ.30 చొప్పున నెలకు రూ.4వేల వరకు అందిస్తున్నామన్నారు. నీరు ట్యాంకులో అవసరమైనంత సరఫరా చేయాలని అధికారులకు చెబుతామని, వారు అలాగే సరఫరా చేస్తారని, దీనివల్ల ఎలాంటి ఇబ్బంది కలుగడంలేదన్నారు. త్రాగునీరు ఇచ్చిన ముఖ్యమంత్రి ఇంకో రెండేళ్ళలో కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిచేసి సాగునీరు కూడా ఇస్తారని అధికారుల బృందానికి సర్పంచ్ నవ్వుతూ తెలుపడం జరిగింది.

తెరాస నేత ఆత్మహత్యాయత్నం

(మొదటిపేజీ తరువాయి)

అందుకున్నారు. తాండూరులో తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం లభించడం లేదని.. మూడేళ్లు గడుస్తున్నా నియమిత పదవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు.. ఈ సమావేశానికి మంత్రి వస్తున్నట్లు తమకు ఎవరు కూడా సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. అనంతరం బయటకు వచ్చి వెంట తెచ్చుకున్న కిరోసిన్‌ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని సమావేశ ప్రాంగణంలోకి వచ్చారు. మంటలతో వచ్చిన అయూబ్‌ఖాన్‌ను చూసిన పార్టీ నేతలు, శ్రేణులు వెంటనే దుప్పట్లు, నీరు పోసి మంటలను ఆర్పారు.

పోలీసు వాహనంలో తాండూరులోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మంత్రి మహేందర్‌రెడ్డి కూడా సమావేశం ప్రాంగణం నుంచి ఆసుపత్రికి వచ్చారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేయించి మంత్రి తన కాన్వాయ్‌లోనే అయూబ్‌ఖాన్‌ను అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కొరకు హైదరాబాద్‌కు తరలించారు. అయూబ్‌ఖాన్ తల, చాతి, చేతులకు గాయలయ్యాయి. ఈ ఘటన తాండూరులో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో మంత్రి మహేందర్‌రెడ్డితో పాటు అధికార పార్టీ నేతలు ఉలిక్కిపడ్డారు.

విద్యార్థుల గ్రేడింగ్

ఇక ఆన్‌లైన్‌లో..

• సెప్టెంబర్ తరువాత అప్‌లోడ్ • యుడైస్ వివరాల ఆధారంగా గ్రేడింగ్ • ఆన్‌లైన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్ధుల గ్రేడింగ్‌ను ఇకపై విద్యార్థుల తోపాటు, వారి తల్లిదండ్రులు చూసుకునే అవకాశం కలగనుంది. విద్యార్థుల ప్రతిభను వారి తల్లిదండ్రులు కూడా తెసుకోవచ్చు. విద్యార్థులకు సంబంధించిన సంచిత సమగ్ర ప్రగతి నివేదికను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశా లలకు సమాచారం అందించారు. విద్యార్థులకు సంబంధించిన సంచిత సమగ్ర ప్రగతి నివేదికను పుస్తకాల్లో నిక్షిప్తం చేయడం తొపాటు ఈ ఏడాది నుంచే వాటిని ఆన్‌లైన్‌లోనూ పొందుపర్చాలని పాఠశాల విద్యా శాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రవేశాలకు సంబంధించిన పని కొనసాగుతున్నందున సెప్టెంబర్ నెలలో సమ్మేటీవ్ అసైన్‌మెంట్ (ఎస్ఏ)-1 ముగిసిన అనంతరం వీటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఇప్పటి వరకు యుడైస్‌లో విద్యార్థుల ఆధార్ నంబర్ ఆధారం గా వారి వివరాలను నమోదు చేస్తున్నారు. వివరా లను ప్రతి పాఠ శాలలో ఉండే నోట్‌పుస్తకంలో పొందుపర్చుతారు. గత ఏడాది అన్ని పాఠశాలల్లో ఇది అమలు కాకపోవడంతో ఈ ఏడాది రాష్ట్రం లోని అన్ని స్కూల్స్ లోనూ అమలు చేయడానికి చర్యలు తీసుకు న్నారు. అందు కోసం అవసరమైన నోటుపుస్తకాలను అన్ని పాఠశాలలకు సరఫరా చేశారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక పుస్తకంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మరొక పుస్తకంలో పొందుపరుస్తారు. ఐదేళ్లపాటు ఒక విద్యార్థికి సంబం ధించి పూరిసమాచారం ఒకపుస్తకంలో పొందు పర్చబడుతుంది. నోటు పుస్తకంలో విద్యార్థి పరీక్షల్లో ప్రదర్శించిన ప్రతిభతోపాటు, విద్యార్థికి ఉన్న ఆరోగ్య సమస్య లు అన్ని అందు లో ఉంటాయి. బ్లడ్ గ్రూప్ దగ్గర నుం చి అతను బాధపడే ఆరోగ్య సమస్యలను అందులో చేర్చు తారు. ఈ వివరాలను ఇకపై ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు.

విద్యార్థిఫార్మేంటీవ్ అసైన్‌మెంట్(ఎఫ్ఏ), సమ్మేంటీవ్ అసైన్‌మెంట్(ఎస్ఏ)కు సంబంధించిన వివరాలను నోటు పుస్తకంలో పొందుపర్చడంతోపాటు ఆన్‌లైన్లో వివరాలను చేర్చుతారు. ఎఫ్ఏ ముగిసిన తరువాత, ఎస్ఏ ముగిసిన తరువాత వాటి వివరాలను ఆన్‌లైన్‌లో చేర్చుతారు. చివరిగా వార్షిక పరీక్షలు ముగిసిన తరువాత విద్యార్థి మార్కులు, ఇంటర్నల్ ప్రతిభ, ఇతర స్కిల్ డెవలప్‌మెంట్ల ఆధారంగా విద్యార్థిని, విద్యార్థులకు గ్రేడింగ్‌లను ఇస్తారు. ఈ వివరాలను కూడా ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. దీంతో తల్లిదండ్రులకు వారి పిల్లల ప్రతిభ ఎంత మేరకు ఉందో తెలిసి పోతుంది. తద్వారా తమ పిల్లలు ఎందులో వీక్‌గా ఉన్నాడో తెలుసుకుని దానిలో అభివృద్ధి అయ్యేలా చూసుకోవడానికి కూడా ఉపయోగపడనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 39వేల ప్రభుత్వ పాఠశాలల్లో దీనిని అమలు చేయనున్నారు. సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పర్చనున్నారు. విద్యార్థి పేరు లేదా, ఆధార్ నంబర్ చూస్తే అతనికి సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షం అవుతాయి. విద్యార్థికి సంబంధించిన మార్కుల గ్రేడింగ్, అతని ఆరోగ్య సమస్యలు, ఇతర వాటిల్లో అతని ప్రతిభ కూడా తెలిసిపోతుంది. ఒక్కో పుస్తకంలో ఒక్కో విద్యా ర్థికి సంబం ధించి 5 సంవత్సరాల వివరాలను పొందు పర్చనున్నారు. ఒక విద్యార్థి పాఠశాల మారితే ఆ విద్యార్థికి సంబం ధించిన అన్ని వివరాలను కొత్తగా చేరిన పాఠశాలకు మార్చుతారు. అక్కడ కూడా ఆ విద్యార్థి వివరాలను చూసుకోవడానికి అవకాశం ఉంటుంది.



మూడేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం

నిజామాబాద్ రూరల్, కెఎన్ఎన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని సిర్పూర్‌లో రూ. కోటి 45 33 లక్షల 33 కెవి సబ్ స్టేషన్ మహిళ సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మోపాల్ సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్ గదులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏళ్ల తరబడి గ్రామాల అభివృద్ధి జరగక కుంటుపడ్డాయన్నారు. అరవై ఏళ్లల్లో జరగని అభివృద్ధి పనులు మూడేళ్లలోనే కేసీఆర్ వేల కోట్ల నిధులతో పూర్తి చేశారన్నారు. మండలంలోని సిర్పూర్ గ్రామానికి చక్కటి అభివృద్ధి జరిగేందుకు అదనంగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో న్యాల్‌కల్, సిర్పూర్ రోడ్డు పనులకు రూ.25 లక్షల నిధులు చేశామన్నారు. బోయ కులస్తులకు కమ్యూనిటీ హాల్ భవనానికి రూ.5 లక్షలు, డ్వాక్రా భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, యూత్ సభ్యులకు భవనానికి రూ.5 లక్షలు, గౌడ్‌కు అదనంగా నిధులిస్తామన్నారు. గ్రామంలో నిరుపేద కులం బాలకు వంద డబుల్ బెడ్‌రూంలు నిర్మించి ఇస్తామన్నారు. సొసైటీల బలోపేతం కావడం సంతోషం, రాష్ట్రంలో కోట్ల రూపాయలతో సీఎం గోడౌన్స్ పనులు పూర్తి చేస్తున్నారని మోపాల్ సహకార కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ఎంపి కవిత మాట్లాడారు. సహకార సంఘం అభివృద్ధికి ప్రభుత్వ మద్దతు ఎంతో ఉంద న్నారు. ఇప్పటి వరకు 3వ విడతగా రైతులకు రూ.2.17 కోట్ల రుణమాఫీ వచ్చిందన్నారు.

సెప్టెంబర్‌లో గ్రామ సమన్వయ కమిటీల ఏర్పాటు

మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, కెఎన్ఎన్: సెప్టెంబర్ మొదటితేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు గ్రామసమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తామని ఈకమిటీల ద్వారా గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర అటవీ పర్యావరణ, బిసీ సంక్షేమ శాఖమంత్రి జోగురామన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని గాయత్రి గార్డెన్‌లో ఆదిలాబాద్ నియోజక వర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భం గా మంత్రి జోగురామన్న మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని ఇందులో భాగంగానే సెప్టెంబర్ తొమ్మిదవ తేదీ వరకురైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తామని ఈ కమిటీ ద్వారా భూ వివాదాలు , సమస్యలు పరిష్కారం చేస్తారని అన్నారు.గ్రామ మండల , జిల్లా స్థాయి రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు. సెప్టెంబర్ , అక్టోబర్ నవంబర్ మాసాల్లో కేటాయించిన గ్రామాల్లో కమిటీల ద్వారా భూ సమస్యలు భూ వివాదాలకు పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తారని, ఇందులో భాగంగానే అసలైన రైతులకు ఎంత భూమి ఉంది. గుర్తించి వచ్చే ఏడాది ఒక్కో రైతుకు నాలుగువేల రూపాయలు , రెండు పంటలు సాగే రైతులకు ఎనిమిది వేల రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, ఆయితే ప్రభుత్వం రైతుకు ప్రాధాన్యత ఇస్తు ముందుకు పోతున్నామని అన్నారు.

ఆయనెవరో మాట్లాడితే నన్నడిగితే ఎలా?

భట్టిని ఉద్దేశించి ఉత్తమ్ కామెంట్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర కాంగ్రెస్‌లో అందరినీ ఒక కెప్టెన్‌గా సమన్వయం చేయాల్సిన టీపీసీసీ అధ్యక్షుడు నల్లమాడ ఉత్తమ్‌కుమార్ రెడ్డి నోరు జారారు. ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్కను ఉద్దేశించి చేసిన కామెంట్ చర్చనీయాంశమైంది. ఇదేదో రహస్యంగానో...,లేదా తనకు కావాల్సిన వారి సమక్షంలో జరిగిన సంఘటన కాదు..ఏకంగా మీడియా సమావేశంలోనే భట్టి విక్రమార్కను ఆయనెవరో అన్నట్లు మాట్లాడి అందర్నీ ఆశ్చర్య పరిచారు. భట్టిని ఉద్దేశించి ఆయనెవరో మాట్లాడితే నన్నడిగితే ఎలా ? అని విలేఖరులను ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో 39 తో పాటు సీఎం కేసీఆర్‌కు గ్లోబల్ అవార్డుపై మాట్లాడారు. సీఎంకు గ్లోబల్ అవార్డు కాదు...బోగస్ అవార్డు వచ్చిందని ఆరోపించారు. జీవోకు సంబంధించి అఖిలపక్ష సమావేశంఏర్పాటు చేసి రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఆయన మాట్లాడిన అనంతరం జీవో 39 ను రద్దు చేయాలని కోరుతున్నారా ?లేదా ? మీ అభిప్రాయం చెప్పండి ? మీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి గారు కూడా విలేఖరుల సమావేశంలో జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు . మీరేమంటారని అడగ్గా...,ఉత్తమ్ ఒక్కసారిగా ఫైర్ అయ్యారు. ఆయనెవరో అడిగితే నన్ను జవాబు చెప్పమంటారా ? అట్లడగరాదు . ఇప్పుడు చెబుతున్నా ...,పార్టీ అభిప్రాయం అంటూ.., జీవో నిలుపుదల చేయాలి అని వ్యాఖ్యానించారు.

నాయకులను సమన్వయం చేయాల్సిన కెప్టెన్ ఏకంగా వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యాఖ్యలపై గరం కావడంతో వేదికపై ఉన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌కుమార్,ఎమ్మెల్యే ఎస్‌ఎ సంపత్ కుమార్ కంగుతిన్నారు. విలేఖరుల సమావేశం తర్వాత ఎందుకు మీ అధ్యక్షుడు భట్టిపై అంతగా ఫైర్ అయ్యారని అడగ్గా...,ఏమో బాస్ అంటూ విలేఖరులతో మాట్లాడేందుకు నిరాకరించారు. మొత్తం మీద ఇంత వరకు ఉత్తమ్ ,భట్టి మధ్య విబేధాలు ఉన్నాయని చెప్పుకోవడమే గాని ఇద్దరు బాహాటంగా ఎప్పుడూ బయటపడలేదు. పార్టీ కార్యక్రమాలు, సమావేశాల్లో తమ మధ్య విబేధాలు అసలు లేవు.., కలిసే ఉన్నామనే విధంగా వ్యవహరించేవారు. కానీ, వారి మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న విబేధాలు ఉన్నట్లు ఉత్తమ్ కామెంట్‌తో బయట పడ్డాయి. ఇవి పార్టీలో చర్చనీయాంశమయ్యాయి.

ఫేక్ సర్వేలు.. బోగస్ అవార్డులు

మూడేళ్ల లో సీఎం కేసీఆర్ సాధించింది ఏదైనా ఉంటే అది ఫేక్ సర్వేలు చేయించడం , బోగస్ అవార్డులు స్వీకరించడమేనని టీపీసీసీ అధ్యక్షుడులు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. పాటు రైతులను ఏడిపించిన సీఎం కేసీఆర్‌కు ఏ ప్రాతిపధికన అవార్డు ఇచ్చారో చెప్పాలని ప్రొఫెసర్ స్వామినాధన్‌కు లేఖ రాయనున్నట్లు చెప్పారు. అదే విధంగా మూడేళ్లలో రైతులు, ప్రజలను ఏడిపించారు..,ఇకనైనా బాగు చేయాలని కేసీఆర్‌కు కూడా లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. రైతుల హక్కులను కాలరాసే జీవో 39 ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఎమ్మెల్యే ఎస్‌ఎ సంపత్‌కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్‌తో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఒక ప్రభుత్వేతర సంస్థ సీఎం కేసీఆర్‌కు గ్లోబల్ అగ్రికల్చరల్ లీడర్ షిప్ అవార్డు ప్రకటిస్తే అది కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అవార్డుగా భావించి రాష్ట్ర గవర్నర్ కూడా ప్రశంసించడం దురదృష్టకరమన్నారు. జీవో 39 ద్వారా రైతు సమన్వయ సమితీలు ఏర్పాటు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులకు ఏం చేసినా కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తుందని, కానీ, సమితీల పేర టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను నింపుతామంటే ,వారికై రూ.500 కోట్లు ఖర్చు చేస్తామంటే సహించేది లేదన్నారు. సమితీల ఏర్పాటుపై వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రులు.. ఎమ్మెల్యేలకు విషమ పరీక్ష

- డిసెంబర్ దాకా హైదరాబాద్ రావొద్దన్న సీఎం
- రైతు కమిటీల ఏర్పాటు, భూసర్వే సవాలే
- సమర్థత ఆధారంగానే ఎన్నికల్లో అవకాశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి మంత్రులు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు విషమ పరీక్ష పెట్టారు. సెప్టెంబర్ 1నుండి ప్రారంభమయ్యే కొత్త పరీక్షను ఎదుర్కొనేందుకు నేతలు సన్నద్ధమవుతున్నారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో పాటు అనేక సంచలనాత్మక నిర్ణయాలను.. విప్లవాత్మక పథకాలను సేఫ్‌గా ల్యాండ్ చేసిన సిఎం కెసిఆర్ దేశంలోనే తొలిసారి రైతు సమన్వయ కమిటీల వ్యవస్థకు, సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల ముఖచిత్రాన్ని ఒడిసిపట్టే.. ప్రగతికి మార్గం నిర్దేశించే ఈ రెండు కార్యక్రమాలు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో చురుకుగా, వ్యూహాత్మకంగా చేయలేకుంటే ఇబ్బందులొస్తాయని భావించిన సిఎం కెసిఆర్ ఇటీవల ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యత అప్పగించారు. ఒక్కో ప్రజాప్రతినిధి మూడు గ్రామాలను యూనిట్‌గా తీసుకోవాలని చెప్పినా, నియోజకవర్గాల్లో కార్యక్రమాన్ని సమన్వయం చేసుకుని ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరించే ఎమ్మెల్యేలపైనే సిఎం పెట్టారు. ఈ పథకం విజయవంతమైతే.. కమిటీలు సేఫ్‌గా ల్యాండయి భూసర్వే పూర్తయితే.. ఇక మీకు తిరుగుండదని సిఎం భరోసానిచ్చారు. ఎమ్మెల్యేల పనితీరుకు ఇదే గీటురాయిగా భావిస్తానని, డిసెంబర్ దాకా ఎవరూ హైదరాబాద్ రావొద్దని.. ఈ రెండు పథకాల పని పూర్తయ్యాకే హైదరాబాద్ ముఖం చూడాలని సిఎం ఆదేశించారు. గ్రామాల్లోని రైతులను సమన్వయం చేయడం, భూ వివాదాలను పరిష్కరించి.. సర్వేను సమగ్రంగా చేయించడం అంత తేలికగా జరిగే వ్యవహారం కాదని కొందరు ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఇవి రెండూ.. సమగ్రంగా జరిగితే.. భవిష్యత్‌లో గ్రామాల్లో





ఫైల్

సమస్యలు లేకుండా పోతాయని, గ్రామాల ప్రగతిచిత్రంలో గణనీయ మార్పులు వస్తాయని నేతలు ఉదహరిస్తున్నారు.

జనంలో పరీక్షే..

టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి 40మాసాలవుతోంది. ఏడాదిలో ఎన్నికల హడావుడి ప్రారంభం కానుంది. ఈ సమయంలో ప్రజల మధ్యకు రైతు సమన్వయకమిటీల ఏర్పాటు పేరుతో వెళ్తే ఎలా రిసీవ్ చేసుకుంటారోనన్న ఆందోళన కొందరిలో ఉంది. అయితే ఎమ్మెల్యేలపై జనం నాడి తెలుసుకునేందుకు.. ఇది దోహదపడుతుందన్న చర్చ పార్టీలో ఉంది. రైతు కమిటీలను రాజకీయాలకు అతీతంగా వేయడం అన్ని గ్రామాల్లో సాధ్యమయ్యే పని కాదని, ఈ కమిటీల వేదికగా.. గ్రూపు తగాదాలు, ఆదిపత్య పోరులు బయటపడే అవకాశం ఉందన్న చర్చ కూడా కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యర్థులకు టిక్కెట్ రాకుండా చేయాలన్న వ్యూహంతో ఉన్న నేతలు.. సహాయ నిరాకరణ చేసే అవకాశం ఉందని, ఉద్దేశపూర్వకంగా అనుచరులను ఎగదోసే అంశాలను కొట్టిపారేయలేమని చెబుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలకు గ్రామాల్లోని పార్టీ క్యాడర్‌తో సన్నిహిత సంబంధాలు లేవు. ఈ పేరుతో వెళ్తే.. తమ ప్రత్యర్థులు చిక్కులు సృష్టించే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. రైతు కమిటీలకు చాలా ప్రాముఖ్యముందని, ముఖ్యమంత్రి కెసిఆర్.. ఇప్పటికే అనేకమార్లు విశదీకరించడంతో ఈ పదవులకు గ్రామాల్లో, మండలాల్లో క్రేజ్ ఏర్పడింది. కొందరు రైతులు కాని పార్టీనేతలు కూడా కమిటీల పదవుల కోసం తహతహలాడుతున్నారు. ఇతర పార్టీల రైతులను ఈ కమిటీలలో సమన్వయం చేసుకోలేకపోతే.. పలు చోట్ల సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.

గుబులు గుబులుగా..

సిట్టింగ్‌లందరికీ సీట్లు ఇచ్చి గెలిపించుకుంటానని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. ఈ నాలుగునెలలు ప్రజల్లో ఉండండి.. వీటిని విజయవంతం చేయండి.. మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత నాది అంటూనే సమర్థంగా పనిచేసిన వారికే నని చెప్పారు. నియోజకవర్గాల్లో పోటీనేతలు, స్థానిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తమ కాళ్లకిందకు నీళ్ళొస్తున్నాయన్న ఆందోళనలో.. కొందరు ఎమ్మెల్యేలున్నారు. నూటికి నూరుశాతం సిట్టింగ్‌లకు సీట్లు ఇవ్వడం అసాధ్యమని, ఖచ్చితంగా కొందరికి కోత పడుతుందని.. ఆ కోత పడే జాబితాలో తమ పేర్లు ఉండకూడదంటే ఇపుడు ఒళ్ళు వంచి పనిచేయడమే మార్గమని కొందరు నేతలు చెబుతున్నారు. సిఎం పెట్టిన విషమపరీక్షను నెగ్గేందుకు నేతలు వ్యూహరచన చేస్తున్నారు.

మంత్రులకు సవాలే..

ఇక మంత్రులకూ ఈ రెండు కార్యక్రమాలు సవాలే. తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయకుంటే.. జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో చెప్పలేని పరిస్థితి నెలకొంటుంది. గ్రామీణ ప్రాంత నియోజకవర్గాల్లోని మంత్రులకు పెద్ద పరీక్షే. దీంతో కార్యక్రమ విజయవంతానికి ప్రత్యేక వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం సిఎం పరీక్ష నుండి సేఫ్ కానున్నారు. ఎంతమంది ఎమ్మెల్యేలు.. సిఎం గీసిన గీత దాటకుండా.. ఆదేశాలను పాటిస్తారో.. నియోజకవర్గాలకే పరిమితమవుతారో చూడాలి.

కడుపేదలూ లబ్ధిపొందాలి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీల సాధికారిత కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. బుధవారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమం, సాధికారిత కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల గురించి వివరించారు. ఈ మేరకు ఆయన కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ మంత్రి తావర్ చంద్ గెహ్లాట్‌తో చర్చించినట్టు ఆయన వెల్లడించారు.

ముందుగా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అందజేసిన సహాయం, విడుదల చేసిన నిధుల వివరాలను దత్తాత్రేయ విడుదల చేశారు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వశాఖ ద్వారా రూ. 893.83 కోట్లు తెలంగాణ రాష్ట్రానికి అందాయని తెలిపారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ. 84.85 కోట్లు కేటాయించగా 24,251 కుటుంబాలకు లబ్ధి చేకూరిందని వివరించారు. ఎస్సీలకు స్కాలర్‌షిప్పు పథకం కింద 9,14,281 మంది విద్యార్థులకు



రూ. 567.96 కోట్లు విడుదల చేసిందని, అలాగే 14,75,000 మంది ఓబీసీ విద్యార్థుల కోసం రూ. 86.13 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ల కోసం రూ. 55.72 కోట్లు విడుదల చేయగా 5,546 మంది లబ్ధి పొందారని దత్తాత్రేయ వెల్లడించారు.

డాక్టర్ అంబేడ్కర్ పేరుతో ఉన్న వైద్య బీమా పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో ఒక్కో రోగికి రూ. 1.75 లక్షలు సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే నైపుణ్య శిక్షణ కింద ఎస్సీల్లో 2,255 మంది విద్యార్థులు, యువత కోసం రూ. 84.84 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామీణ యోజన పథకం కింద తెలంగాణలో 6 గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ. 1.26 కోట్లు విడుదల చేశామని, ఇతర పథకాల్లో కేంద్ర సహాయం కింద రూ. 4.81 కోట్లు విడుదల చేశామని వివరించారు.

మండల్ సిఫార్సులన్నీ అమలవుతాయి

వెనుకబడిన వర్గాలను జాతీయ స్థాయిలో వర్గీకరించడం ద్వారా అందరికీ సమన్యాయం జరిగేలా ప్రయత్నిస్తున్నామని బండారు దత్తాత్రేయ అన్నారు. ఇన్నాళ్లూ రిజర్వేషన్ల వల్ల విద్య, ఉద్యోగాల్లో లబ్ది పొందలేకపోయిన సామాజిక వర్గాలకు ఆ ప్రయోజనాలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లోనూ

క్రీమీలేయర్

(మొదటిపేజీ తరువాయి)

బృందం (జివోఎం) ఇచ్చిన సిఫారసులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసిందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కిందిస్థాయి ఉద్యోగాల్లో పనిచేస్తున్న పిల్లలకు కలుగుతున్న ప్రయోజనాలు, ప్రభుత్వ రంగ సంస్థల కిందిస్థాయి ఉద్యోగుల పిల్లలకు అందుతాయని అరుణ్‌జైట్లీ తెలిపారు. రూ. 8 లక్షల ఆదాయపరిమితి ప్రభుత్వ రంగసంస్థలకు కూడా వర్తిస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ విద్యా, ఉద్యోగ నియామకాల్లో ఓబీసీలకు 27శాతం రిజర్వేషను అమలవుతున్నాయి. అయితే ఇన్నాళ్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితమైన క్రీమీలేయర్‌ను విస్తరిస్తూ ప్రభుత్వ రంగసంస్థలను దీని పరిధిలోకి తీసుకువచ్చారు. ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, బీమా సంస్థల్లో క్రీమీలేయర్‌ను అనుసరించి ఉద్యోగ నియామకాలు చేపడతారు. ఇందుకు అవసరమైన నిబంధనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం వల్ల ఆయా ప్రభుత్వరంగ సంస్థల్లో కిందిస్థాయిలో పనిచేస్తున్న ఓబీసీ ప్రభుత్వోద్యోగుల పిల్లలు ఈ ప్రయోజనాలు వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. గ్రూప్ -ఎ, బి పోస్టులు, ఎగ్జిక్యూటివ్ పోస్టుల్లో ఉన్న ఉద్యోగులను ఈ పరిధి నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. 24 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు కేంద్రమంత్రి వర్గం పరిష్కారాన్ని చూపింది. దీని ఫలితంగా ఆయా సంస్థల్లో లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రుల బృందం ఇచ్చిన సిఫారసుల మేరకు కేబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. సంపన్న శ్రేణి పరిమితిని 6 నుంచి 8 లక్షలకు పెంచడం ద్వారా రిజర్వేషన్ల ప్రయోజనాలను మరింతమంది ఓబీసీలలు విస్తృతంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. పెరుగుతున్న ధరల సూచిని పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో చేరేందుకు ఓబీసీలకు దీని వల్ల మరింత మేలు కలుగుతుంది. ఇతర వెనుకబడిన తరగతులకు మెరుగైన సామాజిక న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా క్రీమీలేయర్ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును కూడా ప్రవేశపెట్టింది. గత వారమే ఓబీసీలలో వర్గీకరణ కోసం ప్రత్యేకంగా కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఓబీసీలలో మరింత వెనుకబడిన కులాలకు రిజర్వేషన్ల ఫలాలు దక్కేందుకు కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ దిశగా అడుగులేస్తోంది. విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీల ప్రాతినిధ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా మోడీ ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. అనేక ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా ఓబీసీల్లో కింది కులాను పైకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 340 కింద కమిషన్ ఏర్పాటు చేసి త్వరితగతిన నివేదికను కోరింది. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల కాలంలో ఆ వర్గాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు.

భూ హక్కులకు భంగం కలగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ, భూముల లెక్కలన్నీ సర్వేలో సేకరించిన సమాచారంతో బేరీజు వేసుకుని సవరించిన తర్వాతే ఆ వివరాలను కంప్యూటర్లలో పొందుపరచాలన్నారు.

తుది జాబితాలు ప్రకటించే ముందు గ్రామాల వారీగా రైతులందరితో సంప్రదింపులు జరిపి సంతకాలు తీసుకోవాలన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన సులభంగా, సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అర్థమయ్యే రీతిలో జరగాలన్నారు. ఈ క్రమంలో ఎక్కడైనా భూ తగాదాలు ఎదురైతే ఆ చిక్కులు, సమస్యలను 95శాతం స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలోనే పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ ప్రధాన ఆదాయ వనరుగా భూమి శిస్తు ఉండేదని, కాలక్రమేనా రైతుల దగ్గర శిస్తు వసూలు చేసే బదులు ప్రభుత్వమే వారికి రాయితీలను అందిస్తోందని తెలిపారు.

దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ప్రభుత్వం ప్రతి రైతు కుటుంబానికి ఎకరాకు రూ.8వేల చొప్పున పెట్టుబడి రాయితీ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. భూ రికార్డులకు సంబంధించిన పూర్తి సమాచారం నివేదికలు ప్రభుత్వానికి అందిన వెంటనే ఈ పథకానికి సంబంధించిన నిధుల కేటాయింపు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల సేకరణ తదితర ప్రక్రియను మొదలుపెడతామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడా చూసినా అన్ని దేశాలు రైతులను గౌరవిస్తున్నాయని, ఆ క్రమంలో రాష్ట్రంలోనూ రైతులకు విశిష్ట గుర్తింపు, ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆహార భద్రత కోసం వ్యవసాయ రంగంలో స్వావలంబన సాధించడమే ప్రధాన లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామన్నారు. తెలంగాణలో అన్ని పంటల సాగుకు సమశీతోష్ణ వాతావరణం ఉండడం మన అదృష్టమని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. రానున్న కాలంలో ప్రాజెక్టుల



నిర్మాణం పూర్తయ్యే కొద్దీ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని, అదే సమయంలో రైతుల ఆదాయ వనరులు కూడా రెట్టింపవుతాయని పేర్కొన్నారు.

ఆ నీళ్ళు వస్తే మనకిక ఢోకా లేదు

కాళేశ్వరం నుంచి గోదావరి నీళ్ళు పుష్కలంగా అందుబాటులోకి వస్తున్నందున ఆ నీటితో చెరువులు, గుంటలు నింపుకుని పంటలకు అందిస్తామన్నారు. ఈ నీటి ద్వారా ఏడు జిల్లాల్లోని రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. భూ రికార్డుల్లో పహాణీలు, సేత్వారీలు తదితర పాతకాలపు పదాలు తెలుగు భాషకు సంబంధించినవి కావన్నారు. అందువల్ల ఆ పదాలకు స్వస్తి చెప్పి కొత్తగా తెలుగులో సరళంగా, సులభంగా ఉండే విధంగా పేర్ల ఖరారు చేయాలన్నారు. పహాణీల్లో కూడా ఎక్కువ కాలమ్స్ ఉండకుండా స్పష్టమైన సమాచారం వెంటనే తెలుసుకునే విధంగా సమాచారాన్ని పొందుపరచాలన్నారు. అందుకు ప్రత్యేక ఫార్మాట్‌ను రూపొందించవలసిందిగా రెవెన్యూశాఖ యంత్రాంగానికి ఆదేశాలు జారీచేశారు.

రికార్డుల ప్రక్షాళనకు 1,193 బృందాలు

ఇప్పుడున్న భూ రికార్డులను ప్రక్షాళన చేసి సమగ్ర సమాచారంతో సులభతర రికార్డులను రూపొందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,193 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. ఒక్కో అధికారుల బృందానికి తొమ్మిది గ్రామాలు కేటాయించి ప్రక్షాళన కార్యక్రమాన్ని మొదలుపెట్టామన్నారు. పూర్తిస్థాయిలో రికార్డులను సవరణ చేయడానికి ఎంత లేదన్నా మూడు నెలల కాల వ్యవధి అవసరమవుతుందన్నారు. మనకున్న 31 జిల్లాల్లో కలెక్టర్లకు ఈ ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతలను అప్పగించామన్నారు. ఏయే గ్రామాలకు ఏయే బృందాలను కేటాయించారనే సమాచారం, మార్పులు చేర్పులు చేసే అధికారం వారికి ఉందన్నారు. భూ రికార్డుల్లో చిత్రవిచిత్రమైన చిక్కుముడి సమస్యలు ఉంటాయని, వాటిని పరిష్కరించడం అంత సులువైన పని కాదని కేసీఆర్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అందువల్ల చిక్కుముడి సమస్యల్లో ఇరు వర్గాలను కూర్చోబెట్టి పరిష్కరించవలసిందిగా సూచించారు. సాధ్యమైనంత మేరకు సమస్యలను న్యాయస్థానాల వరకు వెళ్ళకుండా రెవెన్యూ అధికారులే పరిష్కరించాలన్నారు. సర్వే నెంబర్లలో ఎలాంటి అవకతవకలు లేకుండా, బై నెంబర్లు లేకుండా సవరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సమావేశంలో డిప్యూటి సీఎం మహమూద్ అలీ, మంత్రి కేటీఆర్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కోర్టుల రద్దు..!

భూ రికార్డుల్లో కోర్ బ్యాంకింగ్ విధానం

(మొదటిపేజీ తరువాయి)

ఉందన్నారు. ఎక్కడా న్యాయపరమైన చిక్కులకు ఆస్కారం లేకుండా రికార్డులు ప్రజలందరికీ అందుబాటులో ఉండేవిధంగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని గుర్తుచేశారు. ఈ ప్రక్రియను సాధ్యమైనంత త్వరలో పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. తహసిల్దార్, ఆర్డీవోలకు ఎప్పటికపుడు మార్గదర్శకాలు జారీచేస్తూ వాటికి ప్రోత్సాహకాలు అందించవలసిందిగా సూచించారు.

గురు వారం జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ అధికారు లతో సమీక్షా సమావేశం నిర్వహించిన తర్వాత మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తహసి ల్దార్లతో ప్రత్యేకంగా సమావేశమై ప్రభుత్వ ఆలోచనా విధానాలను, భూరికార్డుల భద్రత, సరళీకరణ అంశాలను వివరిస్తానని పేర్కొన్నారు.

భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయిన తర్వాత కోర్ బ్యాంకింగ్ తరహాలో ఎప్పటికప్పుడు చోటుచేసుకునే మార్పులకు అనుగుణంగా కంప్యూటర్లలో సమాచారాన్ని మార్చేందుకు వీలు కల్పించాల న్నారు. అందుకోసం వెయ్యి మంది ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అధికారులను రెవెన్యూ శాఖలో నియమించుకునేందుకు ఆమోదం తెలిపినట్లు సీఎం పేర్కొన్నారు. వీరి ద్వారా ఆన్‌లైన్ వ్యవస్థలో లోపాలు లేకుండా చూడడం, రికార్డుల సమాచారాన్ని గోప్యంగా ఉంచడం తదితర కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలన్నారు. ఒకవైపు భూ ప్రక్షాళన కార్యక్రమం నిర్వహిస్తూనే ఐటి అధికారుల నియామక ప్రక్రియ, కంప్యూటర్లు, సర్వర్ల కొనుగోలు, వాటికి అనుసంధాన ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. మ్యుటేషన్ ప్రక్రియను రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రైతులు ఒకేసారి వెళ్ళడంతో పూర్తిస్థాయి పని జరిగేలా ఉండాలన్నారు. పట్టాదారు పాసుబుక్‌లు కొరియర్ ద్వారా రైతుల ఇళ్ళల్లోకి చేర్చే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటి సీఎం మహమూద్ అలీ, మంత్రి కేటీఆర్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు, సీఎం కార్యాలయ ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 31 ఆగస్టు 2017

మళ్ళీ లోక్‌పాల్ కోసం..!

అత్యున్నత స్థాయిలో పటిష్ఠమైన చర్యలు తీసుకోనిదే అవినీతి నిర్మూలన గురించి ఎన్ని ప్రసంగాలు చేసినా, మరెన్ని హామీలు ఇచ్చినా అవన్నీ నీటిమీద రాతలే అవుతాయని నలభై రెండేళ్ళ క్రితం సంపూర్ణ విప్లవ శంఖారావాన్ని పూరిస్తూ లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేసిన మాటల్లో ఎంత సత్యం ఉందో ఆధునిక రాజకీయ యవనికపై చూస్తున్నాం. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న సంఘటనలన్నీ అవినీతి ప్రేరకమైనవే. ఆనాటి కేంద్ర మంత్రి లలిత్ నారాయణ్ మిశ్రా దుర్మరణానికి కారణమైన సమస్తిపూర్ బాంబు కేసు, నగర్‌వాలా బ్యాంకు దోపిడీ కేసు పెద్దల ప్రమేయం లేదా, ప్రోద్బలం ఉన్న అవినీతి కుంభకోణాలే. ఆ కుంభకోణాల్లో స్వాహా అయిన సొమ్ము వందల కోట్లు మాత్రమే. ఆ తర్వాత వెలుగు చూసిన కుంభకోణాల్లో వేలు, లక్షల కోట్ల రూపాయిలు నిలువు దోపిడీకి గురి అయ్యాయి. వీటిలో కొన్నింటిపై విచారణలు జరిగాయి. మరికొన్ని ఏళ్ళూ, పూళ్ళూ గడిచినా ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఈ కేసుల విచారణ ఎప్పటికి పూర్తి అవుతుందో, దోషుల నిర్ధారణ ఎప్పటికి జరుగుతుందో ఎవరూ అంచనా వేయలేని విచిత్ర పరిస్థితి నెలకొని ఉంది. ఉన్నత స్థాయిలో వ్యక్తుల ప్రమేయం ఉన్న కుంభకోణాల విచారణ కోసమే లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని చాలా కాలంగా సామాజిక హితైషులు కోరుతున్నారు. లోక్‌పాల్ వ్యవస్థలో ప్రధానమంత్రి స్థాయి నాయకులపై కూడా విచారణ జరిపే అధికారాలను చేర్చాలని గాంధేయవాది అన్నాహజారే ఐదారు సంవత్సరాలుగా ఆందోళన సాగిస్తున్నారు. లోక్‌పాల్, లోకాయుక్త సక్రమంగా పని చేస్తేనే అవినీతి నిర్మూలన జరుగుతుందన్న దృఢ నమ్మకంతో ఆయన ఏ పార్టీకి చెందని సంస్థ తరఫున ఈ ఆందోళన సాగిస్తున్నారు. అయితే, ఆనాటి యూపీఏ ప్రభుత్వం కానీ, ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం కానీ ఆయన సలహాలనూ, హెచ్చరికలనూ ఖాతరు చేయడం లేదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ రెండవ విడత ప్రభుత్వ హయాంలో కుంభకోణాలెన్నో వెలుగు చూడటానికి సమాచార హక్కు చట్టమే కారణమనీ, ఇది తమ ప్రభుత్వం తెచ్చిన చట్టమని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్య అక్షరాలా నిజమే. అవినీతి నిర్మూలన విషయంలో తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అంటూ ఆయన ప్రస్తుత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చిందంటూ ప్రధాని మోడీపై విసుర్లు విసిరారు. ప్రస్తుత ప్రధానిపై మాజీ ప్రధానిపై రాజకీయ దుగ్ధతో చేసిన ఆరోపణగా కాకుండా, వాస్తవ దృష్టితో చూస్తే ఇందులో అసత్యం లేదని ఎవరికైనా అనిపిస్తుంది. మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత మచ్చుకు ఒక్క అవినీతి ఘటన కూడా చోటు చేసుకోలేదని కమలనాథులు సమయం వచ్చినప్పుడల్లా ప్రకటనలు గుప్పిస్తుంటారు. అవినీతి బయటపడే దారులన్నీ మూసివేసి, విచారణలను చాపచుట్టేసి, లేదా స్టేల పేరిట కేసులను అటకెక్కించేసి తామంతా నీతిమంతులమని ప్రచారం చేసుకోవడం ఆధునిక రాజకీయ నాయకుల శైలి. అవినీతి వ్యవస్థీకృతమైందనీ, దానిని కూకటి వేళ్ళతో పెళ్ళగించే వరకూ నిద్రపోనని ప్రధానమంత్రి మోడీ ఇటీవల ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమావేశంలో శపథం చేశారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే అవినీతి తగ్గిన మాట నిజమే కానీ, పూర్తిగా నిర్మూలన కాలేదు. నగదు లావాదేవీలను నియంత్రించడం వల్ల నల్లధనం చలామణిని అరికట్టినట్టు ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తోంది. నల్లధనం రూపుమాసిపోతే ఉప ఎన్నికల్లో వందల కోట్ల రూపాయిలు నీళ్ళప్రాయంగా అభ్యర్థులు ఎలా ఖర్చు చేయగలిగారన్న ప్రశ్నకు ఎవరివద్దా సమాధానం లేదు. ప్రతిపక్షం కన్నా ఐదారు రెట్లు ఎక్కువ డబ్బు ఇచ్చి ఓట్లను కొనుగోలు చేస్తున్న పార్టీల తీరును ప్రజలు అసహ్యించుకుంటున్నారు. అవినీతి, నల్లధనం కనుమరుగు కావాలంటే, ఎన్నికల సంస్కరణలు తు.చ. తప్పకుండా అమలు జేయాలి. పార్టీలకు విరాళాల మొత్తాలపై గట్టి నిఘా వేయాలని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇటీవల నిర్వహించిన సదస్సులో అన్ని పార్టీల నాయకులు గంభీరోపన్యాసాలిచ్చారు. ఆ అసోసియేషన్ విడుదల చేసిన జాబితాలో గరిష్ఠంగా విరాళాలు అందుకున్న పార్టీ బీజేపీ. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అత్యధికంగా విరాళాలు రావడం దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం. ఎన్నికల్లో అభ్యర్థులకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలన్న వోహ్రా కమిటీ సిఫార్సులను అటకెక్కించడంలో ఆనాడు కాంగ్రెస్ అనుసరించిన మార్గాన్నే ఇప్పుడు బీజేపీ అనుసరిస్తోంది. ప్రభుత్వంలో ఏం జరుగుతోందో తెలిసే అవకాశం ప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా అప్పట్లో లభించేది. ఇప్పుడు సహ చట్టం కింద సమాచారం కోసం దాఖలయ్యే దరఖాస్తులన్నీ బుట్టదాఖలు కావడమో, తగిన సమాచారం లేదనో జవాబు వస్తోంది. అలాగే, అవినీతి కేసుల విచారణ నత్తనడక కన్నా నెమ్మదిగా సాగుతున్నప్పుడు, అసలు విచారణే జరగకుండా సాంకేతిక కారణాలను అడ్డుపెట్టుకుని స్టేలు తెచ్చుకోగలుగుతున్నప్పుడు అవినీతిని రూపుమాపామని ఎవరైనా ఎలా చెప్పగలుగుతారు? లోకాయుక్త, లోక్‌పాల్ వంటి వ్యవస్థలు చట్టప్రకారం సజావుగా, సక్రమంగా పని చేసినప్పుడే ఆరోపణలు నిగ్గుతేలుతాయి. లోక్‌పాల్ కోసం యూపీఏ ప్రభుత్వం కొంత ప్రయత్నమైనా చేసింది. ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి అయినాదాని ఊసు లేదు. అందుకే లోక్‌పాల్ కోసం మరోసారి ఉద్యమిస్తానని అన్నాహజారే హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా జరిగినప్పుడే లోక్‌పాల్ ఉద్యమం జనాదరణకు నోచుకుంటుంది.

మంచి మాట

శిక్ష క్రూరత్వాన్ని మాయం చేసే కళ.
అది విచక్షణా జ్ఞానాన్ని
నేర్పుతుంది.

● ప్లేటో

శత్రువు గుండెల్లో వేగుచుక్క

జనసాంద్రతలో ఆసియాలో రెండు పెద్ద దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణాన్ని ఒక్కసారిగా చల్లార్చిన చతురుడు. ఎంతటి క్లిష్ట సమస్యనైనా చిటికెలో పరిష్కరించగల చాణక్యుడు. ఆయన ప్రస్తుతం జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. ఆ పదవికి ఆయనను ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏరికోరి ఎంపిక చేశారు. పూర్వపు ప్రధానమంత్రులు కూడా ఇలాంటి దోవల్‌లను ఏరికోరి ఎంపిక చేసుకున్నవారే. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి తన హయాంలో బ్రిజేష్ మిశ్రాను ఈ పదవికి ఎంపిక చేసినప్పుడు చాలా మంది నివ్వెరపోయారు. ఆయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య యోధుడు ద్వారకా ప్రసాద్ (డిపి) మిశ్రా కుమారుడు. మధ్యప్రదేశ్ రాజకీయాల్లో చక్రం తిప్పారు. అటువంటి రాజకీయ చాణక్యుని కుమారుడైన బ్రిజేష్ మిశ్రా కాంగ్రెస్ హయాంలోనే కాకుండా, వాజ్‌పేయి హయాం లో జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుగా వ్యవహరించడం, వాజ్‌పేయికి అత్యంత సన్నిహితుడు కావడం అప్పట్లో చాలా మందికి మింగుడు పడలేదు. వాజ్‌పేయి అనుసరించిన విదేశాంగ విధానం రూపశిల్పి బ్రిజేష్ మిశ్రా. ముఖ్యంగా, పొరుగు దేశాలతో సంబంధాల విషయంలో వాజ్‌పేయి అనుసరించిన విధానం వల్ల దేశానికి మంచి జరిగిందని విశ్వసించేవారు ఈనాటికీ ఎంతో మంది ఉన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో కె.నారాయణన్, శివశంకర్ మీనన్‌లు జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారులుగా వ్యవహరించారు. జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారు పదవి అత్యంత కీలకమైనది. విదేశాంగ వ్యవహారాల్లోనే కాక, రక్షణ సంబంధమైన వ్యవహారాల్లో కూడా అన్ని సమస్యలను ఆకళింపు చేసుకున్న వ్యక్తికే ఆ పదవిని అప్పగిస్తారు. పాకిస్తాన్, చైనాలతోనే కాకుండా, అటు అమెరికాతోనూ, ఇటు రష్యాతోనూ, అరబ్ దేశాలతోనూ భారత్ సంబంధాలు వృద్ధి కావడానికి జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుల (ఎన్ఎస్ఏ) పాత్ర ఎంతో ప్రముఖమైనది. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించగల మేధావులనే ఈ పదవికి ఎంపిక చేస్తూ ఉంటారు. నారాయణన్, శివశంకర్ మీనన్‌లు భద్రతా వ్యవహారాల నిపుణులు. శివశంకర్ మీనన్ వివిధ దేశాల్లో దౌత్యాధికారిగా ఉన్నత పదవులను అలంకరించారు. చైనాతో సంబంధాల పునరుద్ధరణ విషయంలో ఆయన ఎంతో కృషి చేశారు. అదే మాదిరిగా ప్రస్తుతం ఎన్ఎస్ఏగా ఉన్న అజిత్ దోవల్ దౌత్య రంగంలోనే కాకుండా, భద్రతా వ్యవహారాల్లో ఎంతో ప్రావీణ్యాన్ని సంపాదించారు. అందుకే ఆయనను అత్యంత కీలకమైన ఆ పదవికి ప్రధాని నరేంద్రమోడీ ఎంపిక చేశారు.

ఎన్ఎస్ఏల పాత్ర: ప్రతి దేశానికీ ఎన్ఎస్ఏలు ఉంటారు. దౌత్యపరంగా సత్సంబంధాలను నెరపగల సమర్థులనే అటువంటి పదవులకు ఎంపిక చేస్తుంటారు. అయితే, మన పొరుగు దేశమైన పాకిస్తాన్ ఇందుకు విరుద్ధం. పాక్ జాతీయ భద్రతా వ్యవహారాల సలహాదారుగా చాలా కాలం వ్యవహరించిన సర్తాజ్ అజీజ్ మన దేశంపై అకారణంగా ద్వేషాన్ని పెంచుకుని ఇరు దేశాల మధ్య అగ్గి రాజేయడానికి ఎంతో ప్రయత్నం చేశారు. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కి మన దేశంపై శత్రు భావాన్ని నూరిపోసింది అతడే. వయసు, అనుభవాల రీత్యా చాలా పెద్దవాడైనా అతడివి అన్నీ

అజిత్ దోవల్ పేరు ఇప్పుడు మార్మోగిపోతోంది. శత్రువు గుండెల్లో నిద్రపోయే వేగుచుక్క. గూఢచార సంస్థలో చాలా కాలం పని చేసిన ఆయన శత్రువులను గడగడలాడించిన అరివీర భయంకరుడు. అవసరాన్నిబట్టి ఆహార్యాన్ని మారుస్తూ శత్రు శిబిరాల్లోకి చొచ్చుకుని వెళ్ళి తన పని ముగించుకుని సురక్షితంగా బయటకు రాగల నేర్పరి. భారత, చైనాల మధ్య మరో యుద్ధం తప్పదన్న ఊహాగానాలకు ఊతం ఇచ్చే విధంగా సిక్కిం సరిహద్దులలో ఏర్పడిన ఉద్రిక్తత తొలగిపోయేట్టు చేయడం లో, సేనల ఉపసంహరణకు ఇరుదేశాలూ అంగీకారానికి రావడంలో దోవల్ కృషి ఎంతో ఉంది.

చిన్న బుద్ధులు. అతడి వల్ల నవాజ్ షరీఫ్ ముఖం చెల్లని పరిస్థితిని ఎన్నోసార్లు ఎదుర్కొన్నారు. అతడిని తొలగించలేక ఆ పదవి నుంచి తప్పించి, విదేశాంగ వ్యవహారాల్లో సలహాదారుగా నియమించారు. అజీజ్‌ని గడగడలాడించిన చరిత్ర అజిత్ దోవల్‌కి ఉంది. అజిత్ దోవల్‌తో సమావేశమైతే తన బండారం బయటపడుతుందన్న వెరపుతో ఢిల్లీలో జరగాల్సిన సమావేశానికి అజీజ్ డుమ్మా కొట్టాడు. దోవల్‌కి పాక్ ఆంతరంగిక వ్యవహారాల గురించే కాకుండా, చైనా గురించి అన్ని విషయాలూ తెలుసు. అందుకే, డోక్లామ్ ఉద్రిక్తతను పరిష్కరించేందుకు ఆయనను ప్రధాని మోడీ నియోగించారు.

దోవల్ డాక్టరీన్ (సిద్ధాంతం): ఉగ్రవాదాన్ని ఏయే దేశాలు పెంచి పోషిస్తున్నాయో సాధికారికంగా చెప్పగల నేర్పు, నైపుణ్యం దోవల్ సొంతం. ఉగ్రవాద సంస్థలకు ఏయే దేశాల నుంచి నిధులు అందుతున్నాయో, ఎవరెవరు సాయపడుతున్నారో అన్ని విషయాలూ ఆయనకు కరతలామలకం. పాకిస్తాన్‌ని ఉగ్రవాద దేశంగా ప్రకటించాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి తెరవెనుక ఆయన చేసిన కృషిని తక్కువగా అంచనా వేయలేం. పాక్ కేంద్రంగా పని చేస్తున్న జైష్ ఎ మహ్మద్, లష్కర్ ఎ తోయిబా వంటి సంస్థలకు నిధులు ఎక్కడి నుంచి అందుతున్నాయో, ఏయే బ్యాంకుల్లో వాటికి ఖాతాలు ఉన్నాయో రుజువులతో నివేదికలు అందించిన దోవల్‌ని చూస్తే పాక్, చైనా నాయకులు బెదురుతూ ఉంటారు. తమ గుట్టుమట్లను ఎక్కడ సేకరిస్తాడోనన్న భయం వారిలో ఉంది. ఉగ్రవాదాన్ని అంతమొందించడానికి ఆయన ప్రతిపాదించిన కార్యక్రమం దోవల్ డాక్టరీన్ (సిద్ధాంతం)గా ప్రాచుర్యాన్ని పొందింది. వేగులంటే రాజకీయ నాయకులే కాకుండా, ఉన్నత స్థానాల్లో ఉన్న వారు బెదురుతూ ఉంటారు. వేగుల్లో రేచుక్క లాంటి వారంటే ఇంకా ఎక్కువ భయపడతారు. దోవల్ రెండవ తరహాకు చెందిన వారు.

ఎవరీ దోవల్?: ఉత్తరాఖండ్‌లోని పౌడీ గఢ్వాల్‌లో జన్మించిన అజిత్ దోవల్ కేరళ క్యాడర్‌కి చెందిన 1968వ సంవత్సరం బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ఇంటిలిజెన్స్‌శాఖలో ఆపరేషన్స్ విభాగంలో ఆయన చాలా కాలం పని చేశారు. 2004-05 మధ్య ఇంటిలిజెన్స్ విభాగం డైరక్టర్‌గా కూడా పని చేశారు. శాంతి కోసం కృషి చేసిన అత్యంతఉన్నతమైన సాహసికుని అవార్డు కీర్తిచక్రను ఆయన అందుకున్నారు. ఆ అవార్డును అందుకున్న మొదటి పోలీసు అధికారి ఆయనే.



సాంఘిక కార్యకలాపాల్లో: కేంద్ర ప్రభుత్వ గూఢచార విభాగం ఐబి నుంచి రిటైర్ కాగానే ఆయన వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (విఐఎఫ్) పేరిట మేధావుల బృందాన్ని ఏర్పాటు చేశారు. దేశం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మేధావుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి అందజేసే కార్యక్రమాన్ని ఆ సంస్థ నిర్వహించేది. పంజాబ్, ఈశాన్య రాష్ట్రా లు, పాకిస్తాన్, జమ్ము, కాశ్మీర్‌లలో ఉగ్రవాదం మూలాల గురించి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. జేమ్స్‌బాండ్‌ని ఎందుకన్నారు? ఆయనను జేమ్స్ బాండ్ అని పిలుస్తుంటారు. ఆయన కరడుకట్టిన ఉగ్రవాదుల మధ్య చాలా నేర్పుగా, ఒడుపుగా తన విధులను నిర్వహించారు. వారితో కలిసిమెలిసి ఉంటూనే వారి ఉక్కుకౌగిలిలో పడకుండా చాలా నేర్పుగా చాలా సార్లు బయటపడ్డారు. అలాంటి సాహసాలు చేయడంలో ఆయన దిట్ట. ఎన్నోసార్లు ఆయన ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకున్నారు. పాక్ ఉగ్రవాదుల క్రీనీడలో ఆయన ఏడేళ్ళు గడపగలిగారంటే ఎంతటి నేర్పు గలవారో వేరే చెప్పనవసరం లేదు. నరాలు తెగే ఉత్కంఠ రేకెత్తించే జేమ్స్ బాండ్ సినిమాల్లో గూఢచారులు ఏ విధంగా శత్రు శిబిరాల్లో ప్రవేశించి అక్కడి రహస్యాలు తెలుసుకుంటారో అలాంటి విధులను చాలా చాకచక్యంగా దోవల్ నిర్వహించి మంచి పేరు సంపాదించుకున్నారు.

డేర్ డెవిల్: శత్రు రహస్యాలను తెలుసుకోవడానికి దూసుకుని పోయే తత్వం కలిగిన ఆయనను డేర్ డెవిల్ అని అంటూంటారు. శత్రువుల బారిన పడకుండా ఆయన మారువేషాల్లో కూడా తిరిగిన ఉదంతాలు కోకొల్లలు. ఒకసారి పాకిస్తానీ ముస్లిం వేషంలో తప్పించుకున్నారు. మసీదులకు తరచూ వెళ్తూ స్థానికులు ఎంతో మందిని మిత్రులుగా చేసుకున్నారు. ఆయన కుట్టిన చెవులు చూసి హిందువు అని ఎవరో అనుమానించగా, వెంటనే ఆయన శస్త్ర చికిత్స చేయించుకున్నారు.

స్వర్ణాలయంలో ప్రవేశం: 1988లో ఆపరేషన్ బ్లాక్ థండర్ జరగడానికి ముందు ఆయన అమృత్‌సర్ స్వర్ణాలయంలోకి ప్రవేశించారు. ఆ ఆలయంలో దాక్కున్న ఉగ్రవాదులతో తాను పాక్ రహస్య గూఢచార సంస్థ ఐఎస్ఐ కి చెందిన వాడినని మీకు సాయం చేద్దామని వచ్చానని చెప్పి నమ్మించారు. ఉగ్రవాదుల నుంచి సమాచారాన్ని సేకరించి భద్రతాదళాలకు అందించారు. రహస్య గూఢచర్యంలో ఆయన ఎంతో పేరు సంపాదించారు.

దోవల్ డాక్టరీన్ అంటే...: 2014,2015లలో ఆయన రక్షణ, విదేశాంగ విధానాలపై తన అభిప్రాయాలను కూలంకషంగా వివరించారు. ఆయన అభిప్రాయాలే దోవల్ సిద్ధాంతంగా ప్రాచుర్యాన్ని పొందాయి. భారత్‌ని శత్రుదేశంగా పరిగణిస్తున్న దేశాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. శత్రువును అదును చూసి దెబ్బకొట్టాలన్నది ఆయన సిద్ధాంతాల్లో ముఖ్యమైనది. గత సంవత్సరం సెప్టెంబర్ 29వ తేదీన ఆక్రమిత పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై జరిగిన మెరుపుదాడులు ఆయన ఆలోచనే. అలాగే, మయన్మార్‌లో ఉగ్రవాదులపై పొంచి ఉండి చేసిన దాడి కూడా ఆయన ఆలోచనే.

పాక్‌ని హడలెత్తించిన దోవల్: ముంబాయిలో తొమ్మిదేళ్ళ క్రితం నవంబర్ 26న జరిపిన దాడుల వంటివి పునరావృతం అయితే, బలూచిస్థాన్‌పై ఆశ వదులుకోవల్సి ఉంటుందని పాక్‌ని హెచ్చరించిన ధీరుడు ఆయన. వ్యక్తి విలువల కన్నా, దేశం విలువలు గొప్పవని ఆయన బలంగా నమ్ముతారు.

చైనాకు ఎందుకు ద్వేషం: సిక్కిం సరిహద్దుల్లో డోక్లామ్ వద్ద తన సేనలను మోహరించిన చైనా తిరిగి వెనక్కితగ్గేట్టు చేయడంలో దోవల్ అనుసరించిన వ్యూహం అమోఘం. దోవల్ సిద్ధాంతం గురించి చైనీస్ ప్రభుత్వానికి, అక్కడి గూఢచార సంస్థలకూ తెలుసు. గత నెలలో బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశానికి దోవల్ వెళ్ళడానికి ముందే బీజింగ్ నుంచి వెలువడే గ్లోబల్ టైమ్స్‌తో సహా పలు అధికార పత్రికల్లో దోవల్ వస్తున్నాడు జాగ్రత్త అని హెచ్చరిస్తూ వ్యాసాలు ప్రచురితమయ్యాయి. డోక్లామ్ ఉద్రిక్తతకు దోవల్ కారణమని కూడా నింద వేశాయి. దోవల్ చైనీస్ నాయకులతో బేరసారాల చేద్దామనుకుంటే నిరాశ తప్పదంటూ కూడా వ్యాసాలు వెలువడ్డాయి. అయితే, ఆయన నిరాశపడే పరిస్థితి రాలేదు. సరిహద్దుల్లో ఉద్రిక్తతను తగ్గించడంలో ఆయన కృషి ఫలించింది. గ్లోబల్ టైమ్స్ వంటి పత్రికల అంచనాలు తలకిందులయ్యాయి. డోక్లామ్ నుంచి సేనల ఉపసంహరించుకునేందుకు చైనా కూడా అంగీకరించింది. డోక్లామ్ ఉద్రిక్తత మబ్బులా విడిపోవడంతో దోవల్ ప్రతిభ మరోసారి యావత్ ప్రపంచానికి తెలిసింది. దోవల్ డాక్టరీన్‌తో డోక్లామ్ ఉద్రిక్తత తొలగిపోయింది.

- ఎపి స్వామి

ముసురుతోనే మునిగిపోయే..

ప్రపంచంలోనే అత్యుత్తమ ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానంభారత్‌సొత్తు ఇదిప్రపంచవ్యాప్తంగా వినిపించే మాట వాతావరణ మార్పుల అంచనాలో భారతదేశంచాలాముందుందనిపలుదేశాలు విశ్వసిస్తున్నాయి ఆ సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన వాతావరణ అంచనాలు ఏమయ్యాయి? ముంబైపై కమ్ముకున్న భీకరమైన రణోన్మత్త మేఘ వాటికను ఈ ఉపగ్రహాలు ఎందుకు కనుగొనలేకపోయాయి.? అందులో ఎందుకు విఫలమయ్యాయి? శివుని జటాజూటం నుంచి ప్రళయభీకరంగా పొంగి పొర్లిన గంగలా ఆర్థిక నగరం ఏ మూలనూ విడిచిపెట్టకుండా కసితీరా ముంచేయబోతోందని ఎందుకు అంచనా వేయలేకపోయాయి? స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై ప్రధాని నరేంద్ర మోడీ జరిగేదేదో జరుగుతుంది అనే వైఖరి విడనాడాలంటూ ఇచ్చిన సందేశం.. అధికారుల చెవులపడలేదనడానికి ఇది ప్రత్యక్షసాక్ష్యం.

ఉపగ్రహాలు అంగారక గ్రహంపై వాతావరణాన్ని కచ్చితంగా అంచనా వేయగలవు..కానీ ముంబైకి సంబంధించి మాత్రం వేయలేవు. ఎంత దురదృష్టకరమైన అంశమిది. హాంగ్‌కాంగ్‌ను ఇటీవల హ్యాటో అనే టైఫూన్ తాకింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకున్న ఆ ప్రభుత్వం ఒక్క పౌరుడు కూడా వీధుల్లో రాకుండా చూసింది. ఎటువంటి ప్రాణనష్టమూ కలగకుండా చర్యలు చేపట్టింది. చరిత్రలోనే హ్యాటో అత్యంత తీవ్రమైన తుపాను. హాంగ్‌కాంగ్ వద్ద తీరం తాకింది. ఇలాంటిదే మన దేశంలో సంభవించి ఉంటే... ఇంతేనా...

హాంగ్‌కాంగ్ దాకా ఎందుకు.. నవ్యాంధ్ర ప్రదేశ్ కూడా సాంకేతిక వ్యవస్థను అత్యంత సమర్థంగా వినియోగించుకుంటోంది. ఆఖరుకు పిడుగుపాటు ఎక్కడ తాకుతుందో కూడా అరగంట ముందే అంచనా వేయగలుగుతోంది. ఇందుకోసం ఒక ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించింది. సమాచారం తెలిసిన మరుక్షణం సంబంధిత ప్రాంతాల్లోని అధికారులను అప్రమత్తం చేసి, ప్రాణాలు పోకుండా కాపాడగలుగుతోంది. అంటే ఈ విషయంలో ఏపీ నుంచి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది. ప్రజలు బాధ పడుతున్నారు. పట్టణాలు స్థంభించి పోతున్నాయి. రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా కుదేలవుతోంది. అంచనా వేయగలిగిన సామర్థ్యముండీ అంచనా వేయలేక పోతే ఉపయోగమేమిటి?

మంగళవారం కురిసిన భారీ వర్షాలూ...వాటికి తోడైన పెను గాలులు ముంబైని స్థంభింపచేశాయి. చెట్లను కూకటివేళ్ళతో పెకిలించివేశాయి. కాలనీలో మోకాటి నీటిలో మునిగిపోయాయి. కిందటేడాదీ జరిగిందిదే. మూడు గంటల వ్యవధిలో 65 మిమీ వర్షపాతం నమోదైందంటే పరిస్థితి తీవ్రతను ఊహించుకోవచ్చు.

ముంబై 26 జూలై 2005.. ఆ మహానగరానికి ఓ పీడకల. అరేబియన్ మహాసముద్రంలో ఏర్పడిన తుపాను ఒక్కసారిగా ముంచెత్తడంతో అతలాకుతలమైంది. వెయ్యిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 944 మిమీ వర్షపాతం నమోదైంది(అత్యధిక వర్షపాతాల్లో ఇది 8వది). తరువాతి రోజు అంటే 27న ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల మధ్య 644 మిమీ వర్షం కురిసింది. గోరేగావ్, కొలాబా, మెరైన్ డ్రైవ్, బాంద్రా..ఇలా ఒకటేమిటి అన్ని ప్రాంతాలూ వర్షపు నీటిలో మునిగిపోయాయి. వర్షపు నీటితో పాటు ప్రజలూ రోడ్లపై ప్రవాహంలాగే కనిపించారు. ఎటు వెళ్ళాలో తెలీదు.. ఎక్కడ నిలబడాలో తెలీదు. కార్లలోకి నీళ్ళు ప్రవేశించి, బయటకు రాలేక పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. దేశానికే ఆ వర్షాలు ఓ పీడకలగా పరిణమించాయి.

అదే నగరం.. 29.. ఆగస్టు 2017.. ఇంచుమించుగా అదే పరిస్థితి ఎదుర్కొంది. అంతే అసౌకర్యం. నీట మునిగిన ప్రాంతాలు..బయటకు వెళ్ళిన వారు ఇంటికి చేరలేక తంటాలు. పెనుగాలులతో కూడిన వర్షాలతో ముంబై ఒక్కసారి ఉలిక్కిపడింది. గజగజలాడింది. ఉరుములేని పిడుగులా.. హెచ్చరికలు లేని వానతో విలవిలలాడింది. మరో రెండు రోజులు కురవచ్చనే హెచ్చరికను వాతావరణ శాఖ ఆ తదుపరి విడుదల చేసింది. ఊపిరి పీల్చుకునే అంశమేదైనా ఉందీ అంటే అది ప్రాణనష్టం లేకపోవడం. అంతే. మిగిలిన దృశ్యాలన్నీ సేమ్ టు సేమ్. ముంబయిలో ఎప్పుడు వర్షం కురుస్తుందో ఎవరికీ తెలియదు. బయటకు వెళ్ళేవారు గొడుగు తప్పనిసరిగా తీసుకెడతారు. కొద్దిసేపు కురిసి ఆగిపోతుంది. ఇది ముంబై ప్రత్యేకత.

సాంకేతికంగా ముందే హెచ్చరించి ఉంటే ప్రజలు కష్టాలబారిన పడకుండా నివారించి ఉండవచ్చు. సాయంత్రం 4.30 గంటల కల్లా సముద్ర పోటు పెరుగుతుంది. బీభత్సమైన వర్షాలు కురిసి సమయంలో ఇది డ్రైనేజి వ్యవస్థను స్థంభింపజేస్తుంది. అంటే ఆ నీరు కూడా వరద నీటిలో కలిసిపోతుందన్నమాట. గంటల కొద్దీ వివిధ ప్రాంతాలు నీటిలోనే నానిపోతూ ఉన్నాయి. విమానాలాగిపోయాయి.. ట్రైన్ సర్వీసులు, బస్సులు రద్దయ్యాయి. జనజీవనం స్తంభించింది. మొత్తం మీద ముంబై బేలగా మారిపోయింది. ఇదంతా ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సక్రమంగా వినియోగించుకోకపోవడం వల్లనే. ఇప్పటికైనా ఓ రాష్ట్రా నికి ఆవల ఉన్న నవ్యాంధ్రను చూసి, మహారాష్ట్ర నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉంది.




- ***ముంబై ఏడు ద్వీపాల సమూహం***
- ***21 మిలియన్లకు పైగా జనాభా***
- ***భారత ఆర్థిక రాజధాని***
- ***బిలియనీర్లు, మిలియనీర్లు ఎక్కువగా ఉండే నగరం***
- ***హిందీ సినిమాకు ఆయువుపట్టు***
- ***చినుకు చిటుక్కుమంటే బేలగా మారిపోతుంది***
- ***సర్వం స్థంభించిపోతాయి.***

అమెరికాలో ప్రైవేటు వాతావరణ సంస్థలు

నిన్న కాక మొన్న టెక్సాస్‌ను కుదిపేసిన టైఫూన్‌ను ఊహించడంలో కూడా అమెరికన్ వాతావరణ విభాగాలు విఫలమయ్యాయి. భవనాలు పేకమేడల్లా కుప్పకూలుతుంటే కళ్ళప్పగించి చూశాయి. అక్కడ ప్రభుత్వ వాతావరణ విభాగాలే కాక, ప్రైవేటు ఏజెన్సీలు కూడా వాతావరణ వివరాలను అందిస్తుంటాయి. నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్, నేషనల్ ఓషనిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ సివియర్ స్టార్మ్స్ లేబరేటరీ, నేషనల్ క్లైమాటిక్ డాటా సెంటర్, నేషనల్ వెదర్ సర్వీస్, నేషనల్ సెంటర్స్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రెడిక్షన్, నేషనల్ హర్రికేన్ సెంటర్, స్టార్మ్ ప్రెడిక్షన్ సెంటర్, నేవల్ మేరిటైమ్ ఫోర్‌కాస్ట్ సెంటర్‌లు ప్రభుత్వ సంస్థలు ఇవి కాక ఇంకా పదుల సంఖ్యలో ప్రైవేటు ఏజెన్సీలపై అమెరికా వాతావరణ వివరాలకోసం ఆధారపడుతుంది. భారత్‌కు ఇండియన్ మెటిరియలాజికల్ డిపార్ట్‌మెంట్ ఒక్కటే ఆధారం.

-సుబ్రహ్మణ్యం వివిఎస్ కూచిమంచి



నారదుడి అజీర్తి

ఉదయాన్నే లేచాడు నారదుడు. ఏదో ఓ ప్లేస్‌లో.. కడుపంతా పట్టేసినట్టయింది. ఒకటే త్రేన్పులు, గ్యాస్. వాళ్ల లోకంలో ప్రసిద్ధి చెందిన వైద్యుడి దగ్గరికి బైల్దేరాడు ఆశ్చర్యంగా. వైద్యుడు ముక్కుమూసుకుని తపస్సు చేసుకుంటున్నాడు. నారాయణ.. నారాయణ.. అనగానే కళ్లు తెరిచి, నారద మునీంద్రులకు స్వాగతం. ఏమిటిలా పొద్దున్నే వచ్చారు.. గత కొన్ని రోజులుగా కడుపు కదలటం లేదు వైద్యుడూ... కలహభోజనం కాస్త ఎక్కువైందేమో నారదా అన్నాడు. అబ్బే... ఈ మధ్య మనకి పెద్ద పనేముంది? కృత, త్రేతా, ద్వాపర యుగాల్లో మనకి మూడుపూటలా ముద్ద దిగేది. కలియుగం వచ్చాక దేవతలకి కలికాలం దాపురించింది. పనే ఉండటం లేదు. ఎప్పుడో ఏడాదికోసారి పండగొస్తే ఆ పర్టిక్యులర్ దేవుడో, దేవతో పూజలందుకుని గమ్మునుంటున్నారు. పూర్వం అసురులు, దేవతలు అని రెండు వర్గాలు కాబట్టి మనకి ఫిట్టింగ్ పెట్టి ఫుల్‌మీల్స్ ఎంజాయ్ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు మనుషులు, దేవతలే. అసుర జాతిలేదు కదా... మనుషులంతా ఏదో ఒక దేవతకో, దేవుడికో భక్తులాయె. ఫిట్టింగ్ పెట్టే అవకాశం ఏది? కలియుగంలో సుష్టుగా కలహ భోజనం చేసి రెండు వేల పదిహేడు సంవత్సరాలైంది. వైద్య... మానవ లెక్కల ప్రకారం మరి నాడిచూస్తే అజీర్తి సూచనలు గోచరిస్తున్నాయి.

తమరేమో భోజనమే లేదంటున్నారు ఇదెక్కడి చిక్కు స్వామి నాకు.. అని వైద్యుడు విసుక్కున్నాడు భక్తిగానే. నువ్వెలాగైనా నా రోగానికి కారణం కనిపెట్టి చెప్పాలి అన్నాడు నారదుడు కోపంగా. నావల్ల కాదు స్వామీ.. త్రిమూర్తులలో ఎవరైనా దివ్యదృష్టితో చెప్పాలి తప్ప నాలాంటి సామాన్యవైద్యులకి అంతుపట్టని అజీర్తి ఇది అన్నాడు. సరే అని నారదుడు ముక్కంటి మూడోకన్ను తెరిచి చూపించమందామనుకుని కైలాసానికి వెళ్ళాడు. శివరాత్రికి ఇంకా చాలా టైముంది కదా అని శివుడు హాయిగా బజ్జున్నాడు. నారదుడు వెయిట్ చేసి, చేసి వెళ్లిపోయాడు. విష్ణుమూర్తి అరికాలిలో ఉన్న కన్నులో అజీర్తి ఎలా కలిగిందో చూద్దామని వెళ్లాడు నారదుడు. లక్ష్మీదేవి దీపావళి దాకా ఎవరూ డిస్టర్బ్ చేయద్దని అలారం పెట్టి పడుకుంది. విష్ణుమూర్తి పాదాల చెంత.. దాంతో నారదుడు ఆ తల్లి నిదుర పాడు చెయ్యలేక బ్రహ్మదేవుడి దివ్య దృష్టినుపయోగించి తెలుసుకుందాం అని వెళ్లాడు. బ్రహ్మ వరుసగా చైనా వాళ్లని, తర్వాత భారతీయుల్ని, ఆ తర్వాత రష్యా వాళ్లని, యూరోపియన్లని ఇలా జనాభా లెక్కల ప్రకారం తలో తలకాయతో, తలకాయకి రెండు చేతుల చొప్పున ఎడా పెడా తయారు చేసేస్తున్నాడు బిజీగా. నారదుడు గారంగా, నాన్నా.. అన్నాడు.. నేను బిజీ అన్నాడు బ్రహ్మ.. నాకు కడుపులో అనీజీ.. అన్నాడు. నారదుడు - నేను బిజీ.. డాక్టరుకి చూపించుకో అన్నాడు. నువ్వొక్క అరక్షణం నాకు అజీర్తి ఎందుకొచ్చిందో డయాగ్నసైస్ చేసి చెప్తే. అప్పుడు మందిస్తానన్నాడు నవ వైద్యాచార్యుడు అన్నాడు నారదుడు. మూడు తలకాయల, ఆరు చేతుల పని ఆపకుండా, అంటే చైనా, భారత్, రష్యాల పని ఆపకుండా యూరప్ దేశ సృష్టిని ఆపి, ఒక తలకాయ, రెండు చేతులని ఉపయోగించి, కళ్లు మూసుకుని కుడి చేయి, భృకుటి దగ్గిర పెట్టి నెమ్మదిగా కళ్లు తెరిచాడు. ఈ మధ్య ఎక్కడికెళ్లావ్.. మొన్న వినాయక చవితికదా, మన బొజ్జ వినాయకుడితో సరదాగా భూలోకం చిన్న రౌండేసి వచ్చాను. అక్కడ ఏం చేశావ్? అన్నాడు బ్రహ్మ. ఏముంది వినాయకుడు నవరాత్రులూ నవకాయ పిండివంటలతో సుష్టుగా విందులారగిస్తుంటే, నేను అక్కడే ఉండి చూస్తే మళ్లీ నవ్వినా, దగ్గినా చంద్రుడిలా నన్ను ముక్కలు చేస్తాడని భయపడి అలా నా కలహ భోజనాన్ని వెతుక్కుంటూ వెళ్లాను. అన్నట్లు జనకా, ఈ మధ్య ఉభయ తెలుగు రాష్ట్రా ల్లో మామూలు భోజన హోటల్స్ లాగా కలహ భోజన హోటల్సు కూడా తయారయ్యాయి సుమా! వాటిని ఆంగ్లంలో ఇంటర్నెట్ సెంటర్లు అంటారట. అందులో కూర్చుని, మీటనొక్కితే ఫేస్ బుక్, ట్విట్టర్ మొదలైన సామాజిక అనుసంధాన సైట్లలో ప్రతి ఒక్క పౌరుడూ, అంటే నెటిజన్ అపర నారదుడే. రామ్‌గోపాల్ వర్మ అనే తెలుగు దర్శకుని నుండి, పవన్ ఫ్యాన్స్, మహేష్ ఫ్యాన్స్, బాలయ్య ఫ్యాన్స్, మెగా ఫ్యాన్స్, రచయితలు, రచయిత్రులు, సాఫ్ట్ వేర్ నిపుణులు, గృహిణులు, విద్యార్థినీ విద్యార్థులు, గాయనీ గాయకులు, నటీనటులు, జ్యోతిష్యులు, పండితులు, పామరులు, భగ్నప్రేమికులు, మహేష్ కత్తి వంటి సమీక్షకులు, అన్ని కులాలవాళ్లు, మతాలవాళ్లు, జాతులవాళ్లు అందరూ ఒకరితో ఒకరు కలహించుకోవడం, లేదా ప్రతి ఇద్దరి మధ్యా మూడోవాడు నారదుడై ఫిట్టింగు పెట్టడం - ఆహా - చూడడానికి నా మనసు సంతోషంతో పొంగిపోయి, కడుపు నిండిపోయిందనుకో, ముఖ్యంగా ట్రాల్ పేజీలని ప్రత్యేకంగా కలహ కాగితాల హవా నడుస్తోంది అంతర్జాలంలో. అన్నాడు ఎగ్జయిటింగ్‌గా. అదీ సంగతి. ఇంటర్నెట్ లేని కాలంలో నీకు యుగానికొక్క సారో, రెండు సార్లో కలహ భోజనం లభించేది. కడుపు మితంగా నిండేది. ఇప్పుడు పదిహేను యుగాలకి సరిపడా భోజనం చేశాక తొమ్మిది రోజుల్లో అజీర్తి రాకచస్తుందా అన్నాడు బ్రహ్మ చిద్విలాసంగా. హతోస్మి - అదా సంగతి అంటూ వైద్యుడి దగ్గిరకి పరుగెత్తాడు నారదుడు అజీర్తి మందు కోసం.



(మళ్లీ వారం మరో విశేషంతో...)

మీ
వి.ఎన్.ఆదిత్య

మంత్రులపై రైల్వే కేసు కొట్టివేత



హైదరాబాద్/సికింద్రాబాద్, ఆంధ్రప్రభ: 2012 మౌలాలి వద్ద తెలంగాణ ఉద్యమకారులు రైల్ రోకో నిర్వహించిన కేసులో సికింద్రాబాద్ రైల్వే కోర్టు బుధవారం తుది తీర్పు ఇచ్చింది. ఈ కేసులో 11 మంది ఉద్యమకారులతో పాటు ప్రస్తుతం మంత్రులుగా ఉన్న కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి, కత్తి పద్మారావు ఉన్నారు. అయితే వీరిలో ముగ్గురు మంత్రులతో పాటు మరో 8మంది పై ఎటువంటి సాక్ష్యాధారాలు లేనందున కేసును కొట్టివేస్తూ తుది తీర్పు ప్రకటించింది. ఐదు సంవత్సరాల సుదీర్ఘ విచారణ అనంతరం కేసును కొట్టివేసినట్లు పిటిషనర్ల తరపు న్యాయవాది చెప్పారు.

ఇంటర్ హాజరు శాతం మినహాయింపు ఫీజు రూ.500

● సెప్టెంబర్ 30 తుది గడువు ● అపరాధ రుసుం రూ.200తో అక్టోబర్ 31 వరకు అవకాశం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రైవేటు విద్యార్థులకు హాజరుశాతం మినహాయింపుకు రూ. 500 ఫీజుగా నిర్ణయించారు. విద్యార్థులు ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు బోర్డు కార్యదర్శి డాక్టర్ ఏ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 200 అపరాధ రుసుంతో అక్టోబర్ 31 వరకు ఫీజు చెల్లించవచ్చని చెప్పారు. కాలేజీలకు రెగ్యులర్‌గా రాకుండా ప్రైవేటుగా ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 2018 మార్చిలో జరిగే వార్షిక పరీక్షల కోసం హాజరుశాతం మినహాయింపుకు ఇచ్చినట్లు అశోక్ ప్రకటనలో తెలిపారు.

వారంలోగా డీఎస్సీ నోటిఫికేషన్

● లేకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం ● తెలంగాణ బీఈడీ, డీఈడీ, భాషా పండితుల సమాఖ్య హెచ్చరిక



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వారం రోజుల్లో ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేయాలని తెలంగాణ బీఈడీ, డీఈడీ, భాషా పండితుల సమాఖ్య డిమాండ్ చేసింది. నోటిఫికేషన్ వెలువడకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు. బుధవారం తెలంగాణ బీఈడీ, డీఈడీ, భాషా పండితుల సమాఖ్య రాష్ట్ర సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశానికి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ అధ్యక్షత వహించారు. సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో గుజ్జ కృష్ణ, కోట్ల శ్రీనివాస్, గుజ్జ రమేష్, రామలింగం, రమ్య, శ్రీలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ రాకపోవడంతో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో మన్నెపు రామకృష్ణ ఆత్మహత్య చేసుకున్నారని, అంతకు ముందు మరో నలుగురు నిరుద్యోగులు కూడా ఇలానే ఆత్మహత్యకు పాల్పడ్డారని కృష్ణయ్య గుర్తు చేశారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, టెట్ ఫలితాలు వెలువడగానే డీఎస్సీని ప్రకటిస్తామని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రకటించారని అన్నారు. కానీ టెట్ ఫలితాలు వెలువడి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్ గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. 8792 ఉపాధ్యాయ పోస్టులకు కాకుండా 40వేల ఉద్యోగ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఏఈఈ శ్రీకాంత్ మృతికి కారణమైన నిర్మల్ ఈఈని సస్పెండ్ చేయాలి

● ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజనీరింగు విభాగంలోని నిర్మల్ డివిజన్‌లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవీ శ్రీకాంత్ మృతికి కారణమైన నిర్మల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రఘువీరారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఇంజనీర్స్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) కార్యాలయం ముందు ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగు అసోసియేషన్ అధ్యక్షుడు కోటాల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈఈ రఘువీరారెడ్డి వేధింపుల కారణంగా ఏఈఈ శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ రాసిన సూసైడ్ నోట్‌లో కూడా ఈఈ వేధింపుల వల్లే తాను చావుకు కారణమని పేర్కొన్నారని, అయినప్పటికీ ఇప్పటి వరకు ఈఈపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. అదే విధంగా మృతుని కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, శ్రీకాంత్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ అసోసియేషన్ ఉద్యమం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఈఎన్సీ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీకాంత్ ఆత్మహత్యపై శాఖాపరమైన విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపించినట్లు వెల్లడించారు. సంబంధిత ఈఈపై రాష్ట్ర ప్రభుత్వమే చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

త్వరలో టీడీపీ తెలంగాణ రాష్ట్ర కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీకి ఒకటి, రెండు రోజుల్లో మోక్షం లభించనుంది. కమిటీ కూర్పుపై ఇప్పటికే పలుమార్లు కసరత్తు చేసిన అనంతరం తుది రూపం వచ్చింది. రూపొందించిన జాబితాను పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కొద్ది రోజుల క్రితం పంపిన విషయం తెలిసిందే. రూపొందించిన జాబితాలో స్వల్ప మార్పులు, చేర్పులు చేసి కమిటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కమిటీని ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నారని తెలుస్తోంది. 2019లో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కమిటీని ఎంపిక చేసినట్లుగా సమాచారం. అయితే కమిటీలో ప్రస్తుతం కొనసాగుతున్న పలువురికి తిరిగి స్థానం లభించనున్నట్లుగా తెలుస్తోంది. కాగా కొందరికి ఆయా పదవులను మార్పు చేసినట్లుగా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో తెదేపా పటిష్టానికి పనిగట్టుకుని పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న వారికి కీలక పదవులను అప్పగించనున్నారు. ముఖ్యంగా యువకులకు కూడా రాష్ట్ర కమిటీలో కీలక పదవులను కట్టబెట్టనున్నారు. కాగా పదవులు తీసుకుని ఇప్పటి వరకు సరిగ్గా పనిచేయని వారికి ఉద్వాసన పలుకుతున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎల్. రమణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్న రేవంత్‌రెడ్డి స్థానాల్లో ఎలాంటి మార్పు లేనప్పటికీ మిగిలిన పదవుల్లో మాత్రం మార్పులు, చేర్పులు ఉండే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో పార్టీని ఎలాగైనా అధికారంలోకి తీసుకురావడం ద్వారా తెదేపాకు తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు చాలా పట్టుదలగా ఉన్నారు.

నాబార్డు రోడ్లు ఎక్కడ?

● టెండర్లు పూర్తయినా సాగని పనులు ● రూ. 2500 కోట్లు మంజూరైనా వినియోగించుకోని ప్రభుత్వం ● పనుల ప్రారంభంపై స్పష్టత కరువు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న నాబార్డు పనులు మొక్కుబడిగా జరుగుతున్నాయి. గతేడాదిలో చేయాల్సిన పనులకు కూడా ఇప్పటి వరకూ మోక్షం లేదని తెలిసింది. ఇంతకు ఈ పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా స్పష్టత లేదు. రాష్ట్ర ప్రభుత్వం కోరిక మేరకు నిబంధనలను మార్చి గ్రామీణ రోడ్లపై బ్రిడ్జిలను నిర్మించేందుకు నాబార్డు గతేడాది అనుమతులతో పాటు ఆర్థిక సహాయం చేసింది. గత రెండేళ్ల నుంచి ఈ పనులు ఆశించిన మేరకు జరగడం లేదు. నాబార్డు ద్వారా గడిచిన రెండేళ్లల్లో రూ.471.95 కోట్లతో 402 ప్యాకేజీల్లో రాష్ట్రప్రభుత్వం పనులను చేపట్టింది. వీటిలో ఇప్పటి వరకూ 40 ప్యాకేజీల్లోనే పూర్తయినట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తోంది. మిగిలిన ప్యాకేజీల్లో టెండర్లు పూర్తయి ఏడాదిన్నర గడిచిన కూడా క్షేత్రస్థాయిలో పనులు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. దీంతో నాబార్డు పనులు ఆశించిన మేరకు జరగకపోవడంతో నిధులు కూడా వృథా అయ్యే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారుల్లో బ్రిడ్జిలను నిర్మించేందుకు ఆర్ఐడీఎఫ్-20 కింద 173 ప్యాకేజీలను చేపట్టేందుకు రూ. 250కోట్లు నాబార్డు నుంచి రాష్ట్రప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని పొందింది. 173 ప్యాకేజీల్లో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. అయితే టెండర్ల ప్రక్రియను పంచాయతీరాజ్ ఇంజనీరింగు విభాగం పూర్తి చేసింది. వీటిలో 144 బ్రిడ్జిలకు అయా కాంట్రాక్టర్ల మధ్య అంగీకారం పూర్తికాగా, 132 బ్రిడ్జిల నిర్మాణం పనులను ప్రారంభించింది. కానీ ఈ పనులన్నీ ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఆర్ఐడిఎఫ్-21 కింద మరో 229 బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నట్లు రెండేళ్ల క్రితం పాలనపరమైన అనుమతులు జారీ చేసింది. వీటిలో సూమారు 100కు పైగా బ్రిడ్జిలకు టెండర్లను ప్రక్రియను పూర్తిచేయగా, మిగిలిన వాటికి సంబంధించి సర్వేలు, అంచనాల ప్రతిపాదనల తయారీ దశలోనే ఉన్నాయి. ఇప్పటి వరకూ చాలా బ్రిడ్జిలకు టెండర్ల ఆమోదం పొందలేదని తెలిసింది. ఈ లెక్కన నాబార్డు పనులు ఏ మేరకు జరుగుతున్నాయో తెలుస్తోంది. వాస్తవానికి నాబార్డు కింద రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న బ్రిడ్జిలను మూడేళ్లల్లో పూర్తి చేయాలని ఆయా కాంట్రాక్టర్లతో అంగీకార ఒప్పందం కుదిరింది. కానీ ఆర్ఐడీఎఫ్-20 కింద చేపట్టిన పనులకు ఏడాదిన్నర క్రితమే పరిపాలన అనుమతులు ఇచ్చిన కూడా పనులు మందకొడిగా సాగినట్లు తెలుస్తోంది. దీంతో నాబార్డు బ్రిడ్జిలు ఇప్పట్లో పూర్తికావడం కష్టమేనని తెలుస్తోంది.

ఇదిలా ఉండగా బ్రిడ్జిల పనులు నత్తనడగా సాగుతుండగా, బ్రిడ్జి కమ్ చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం పాలనపరమైన అనుమతులను కూడా మంజూరు చేసింది. ఏడాది క్రితమే ఈ అనుమతులు జారీ చేసినా కూడా పనులను చేపట్టడంలో ఆలసత్వం వహిస్తున్నారు. దీనికి సంబంధించి ఆర్ఐడీఎఫ్-20 కింద 60 బ్రిడ్జి కమ్ చెక్‌డ్యామ్‌లు, ఆర్ఐడీఎఫ్-21 కింద 73 బ్రిడ్జి కమ్ చెక్‌డ్యామ్‌లను నిర్మించేందుకు ప్రణాళికను రూపొందించింది. దీని కోసం రూ. 129.953కోట్ల నిధులను నాబార్డు మంజూరు చేసింది.

గ్రామీణ రహదారులను అద్దంలాగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాలవ్యవధిలోగా పంచాయతీరాజ్ ఇంజనీరింగు విభాగం పూర్తి చేసిన విషయం తెలిసిందే. కానీ నాబార్డు పనుల విషయంలో ఎందుకు ఆలసత్వం వహిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో నాబార్డు పనుల్లో వేగం పెంచాలని పలువురు కోరుతున్నారు.

అంధుల పాఠశాలకు రూ.6 లక్షల వితరణ

టీ న్యూస్ ఎండీ సంతోష్ దాతృత్వం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంత్రి కెటిఆర్ జన్మదినం సందర్భంగా దేవనార్ అంధుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని అక్కడి పరిస్థితులకు చలించిన టి-న్యూస్ ఎండి సంతోష్‌కుమార్ రూ.6లక్షల వితరణ ప్రకటించగా, బుధవారం ఇందుకు సంబంధించిన చెక్‌ను దేవనార్ స్కూల్ ఫౌండేషన్ చైర్మన్ అలంపూర్ సాయిబాబా గౌడ్‌కు అందజేశారు. తెలంగాణభవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంధుల పాఠశాల సమస్యలపై చలించిన ఆయన వెంటనే రూ.4లక్షల వితరణ ప్రకటించగా, మరో నాయకుడు పోచంపల్లి శ్రీనివాసరెడ్డి రూ. 2లక్షల వితరణ ప్రకటించారు. మొత్తం రూ.6లక్షల వితరణను చెక్కు రూపంలో తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అందజేశారు.

నవంబర్‌లో రేషన్ లిఫ్టింగ్ బంద్

● అక్టోబర్ 28న హైదరాబాద్‌లో బహిరంగ సభ: డీలర్స్ అసోసియేషన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ వ్యాప్తంగా రేషన్ వ్యవస్థ ఒకే విధంగా ఉండాలని డిమాండ్ చేస్తూ నవంబర్‌లో రేషన్ లిఫ్టింగ్ బంద్ చేస్తున్నామని అఖిల భారత రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాయికోటి రాజు తెలియచేశారు. బుధవారం న్యూ ఢిల్లీలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ జాతీయ కమిటీ సమావేశం జరిగింది. దేశంలోని అన్ని రాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొని రాష్ట్రాల వారిగా రేషన్ డీలర్ల సమస్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా సమావేశం పలు తీర్మానాలు చేసింది. దేశవ్యాప్తంగా రేషన్ వ్యవస్థ ఒకే విధంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. డీలర్లను పౌరసరఫరాల సంస్థ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేసింది. ఉద్యోగులుగా గుర్తించలేని పక్షంలో గౌరవ వేతనం ప్రకటించాలని కోరింది. గ్రామీణ ప్రాంత డీలర్లకు రూ. 40 వేలు, పురపాలక సంఘాల పరిధిలోని డీలర్లకు రూ. 50 వేలు, గ్రేటర్ పరిధిలోని డీలర్లకు రూ. 60 వేల వరకు గౌరవ వేతనం ఇవ్వాలని కోరింది. చౌక ధరల దుకాణాల నిర్వహణ భారం ప్రభుత్వమే భరించాలని, డీలర్లకు ఆరోగ్య కార్డులు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, బీమా వర్తింపచేయాలని సమావేశం కోరింది.

ఈ పాస్ మిషన్‌ల ద్వారా డీలర్లు నిజాయితీగా పని చేస్తున్నారని, నిర్వహణ వ్యయం పెరిగి, చాలీచాలని కమీషన్‌తో డీలర్లు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని సమావేశం అనంతరం నాయికోటి రాజు విలేకరులకు వివరించారు. తమ సమస్యల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వానికి డీలర్ల సమస్యలను నివేదించాలమని వెల్లడించారు. తెలంగాణలోని ఇతర రేషన్ డీలర్ల సంఘాలను కలుపుకొని ఐక్యతగా పోరాడేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నవంబర్‌లో జరిగే రేషన్ లిఫ్టింగ్ బంద్ కార్యక్రమంలో డీలర్లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 28న హైదరాబాద్‌లో రేషన్ డీలర్ల బహిరంగ సభ నిర్వహించబోతున్నామని తెలిపారు. అఖిల భారత రేషన్ డీలర్ల అసోసియేషన్ పిలుపు మేరకు హైదరాబాద్‌లో డీలర్ల బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. తెలంగాణలోని డీలర్లందరూ బహిరంగ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డీలర్లందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. త్వరలోనే రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, ఇతర సంఘాల నాయకులను కూడా ఆహ్వానించబోతున్నామన్నారు. ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు కలిసిరావాలని ఆయన ఇతర రేషన్ డీలర్ల సంఘాల నాయకులను కోరారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా ర్యాలీ



సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా ర్యాలీ జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు గుదిబండగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు బుధవారం గృహకల్పలో ధర్నా, అక్కడి నుండి ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో టిజివోస్ చైర్మన్, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు వి. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల అనేక మంది ఉద్యోగులు మనోవేదనకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 1000 మంది వరకు ఉద్యోగ విరమణ పొందగా, వారిలో ఏ ఒక్కరికి సీపీఎస్ విధానం వల్ల పెన్షన్ రాలేదన్నారు. ఈ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టి పెట్టవలసి ఉందన్నారు. సమావేశంలో టిజివోస్ అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టిజివోస్ నాయకులు కృష్ణయాదవ్, జి. వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడారు.

సీపీఎస్ రద్దుకు సామూహిక సెలవు

జాక్టో ప్రకటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగులు సామూహిక సెలవులు పెట్టి కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేపట్టనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జాక్టో) స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సెప్టెంబర్ 1న సామూహిక సెలవులు పెట్టనున్నట్టు జాక్టో నేతలు రఘునందన్, చెన్నయ్య, భుజంగరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సామూహిక సెలవుల్లో తాము కూడా పాల్గొంటున్నట్టు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు.

5న 100కె డిజిథాన్:టైటా

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉపాధ్యాయ దినోత్సవం అయిన సెప్టెంబర్ 5న 100కె డిజిథాన్ అనే అతిపెద్ద సామూహిక సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమాన్ని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్(టైటా) తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ ఎలక్ట్రానిక్స్ సేవల విభాగం కలిసి సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5 నుంచి 9 వరకు డిజిథాన్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డిజిటల్ ఉపాధ్యాయుడిగా, ప్రతి ఒక్కరూ బోధించాలనే 10 నినాదాలతో ఈ కార్యక్రమాన్ని కనీసం లక్ష మంది పౌరులను సాంకేతిక అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టైటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మక్తాల తెలిపారు.

రామకృష్ణారావు మృతికి సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మాజీ ఐపీఎస్ అధికారి డివిఎల్ఎన్ రామకృష్ణారావు మృతిపట్ల ముఖ్యమంత్రి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఐపీఎస్ అధికారిగా వివిధ హోదాల్లో సేవలందించారని కొనియాడారు. రామకృష్ణారావు అంత్యక్రియలను అధికార లాంచనాలతో నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను ఆదేశించారు.

బీసీ ఫెడరేషన్లపై సర్కార్ చిన్నచూపు

● మూడేళ్లుగా నిధులు లేవు
● పాలక మండళ్ల ఏర్పాటు లేదు
● కుంటుపడుతున్న కుల వృత్తులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: బీసీ ఫెడరేషన్లను తెలంగాణ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. రాష్ట్ర విభజన జరిగి.. ఉద్యమ పార్టీ అధికారంలోకి వచ్చినా బీసీ ఫెడరేషన్లకు అన్యాయమే జరుగుతోంది. టీఆర్ఎస్ సర్కార్ మూడేళ్ల పాలనలో ఒక్క ఫెడరేషన్‌కు నిధులు విడుదల చేయకపోవడం, కనీసం పాలక మండళ్ల నియమాకంపై కూడా ప్రభుత్వం దృష్టిసారించడంలేదు. దీంతో ఫెడరేషన్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితిలు నెలకొన్నాయి. అంతే కాకుండా ఈ ఫెడరేషన్లను ప్రభుత్వం రద్దు చేసే యోచనలో ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. బలహీన వర్గాల్లో అత్యంత పేదవారిగా ఉన్న తమకు సొంత రాష్ట్రంలోనూ అన్యాయం జరుగుతోందని వివిధ కుల సంఘాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే బీసీ వర్గాల్లోని వివిధ కులవృత్తులు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చేయూతనిచ్చేందుకు ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 12 బీసీ ఫెడరేషన్లను ఏర్పాటు చేసింది. ఫెడరేషన్ల కోసం బీసీ వర్గాలు పోరాటం చేసి.. అప్పటి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడంతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రజక, నాయిబ్రాహ్మణ, పూసల, వడ్డెర, విశ్వ బ్రాహ్మణ, శాలివాహన, మేధర, దర్జీ, బట్రాజ్, గీత, ఉప్పర, మత్స్యకార ఫెడరేషన్లను ఏర్పాటు చేస్తూ 2005 సంవత్సరంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఒక్కో ఫెడరేషన్ కింద గ్రామాల వారిగా సంఘాలను ఏర్పాటు చేసుకుని, ప్రభుత్వం నుంచి సబ్సీడితో కూడిన రుణ సహాయం పొందారు. ఆయా ఫెడరేషన్ల జనాభా, సంఘాలను బట్టి ప్రభుత్వం రుణాలు విడుదల చేసింది. వైఎస్ హయాంలో ఒక్కో ఫెడరేషన్‌కు రూ. 30 నుంచి 50 లక్షల వరకు నిధులు కేటాయించారు. ఆ తర్వాత రోశయ్య ప్రభుత్వం ఒక్కో ఫెడరేషన్‌కు రూ. 8 కోట్ల వరకు విడుదల చేయగా.. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో రూ. 17 కోట్ల వరకు పెంచినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిధులతో ఫెడరేషన్ల కింద ఉన్న సంఘాలు ఆర్థికంగా లబ్ది పొందినట్లు వివిధ కుల సంఘాల నేతలు చెబుతున్నారు.


అయితే రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీఆర్ఎస్ సర్కార్ బీసీ ఫెడరేషన్లను విస్మరించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రజక, నాయిబ్రాహ్మన ఫెడరేషన్లకు మాత్రం ఒక్కో దానికి రూ. 250 కోట్ల చొప్పున మొత్తం రూ. 500 కోట్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసినా నిధులు మాత్రం పూర్తిగా విడుదల కాలేదు. ఇకపోతే మిగతా 10 ఫెడరేషన్ల ఊసే ఎత్తడం లేదని పలు బీసీ సంఘాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన ఎంబీసీ (అత్యంత వెనుకబడిన వర్గాల) కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లను విడుదల చేయడమే కాకుండా పాలకవర్గాన్ని కూడా ప్రభుత్వం నియమించింది. అయితే ఈ ఎంబీసీ జాబితాలోకి ఏ కులాలు వస్తాయో కూడా ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడంపై బీసీ వర్గాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్త మవుతోంది. ఎంబీసీ కార్పొరేషన్‌తో పాటు ఫెడరేషన్లను కూడా కొనసాగించాలని అంటున్నారు.

ఉప్పరులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఉప్పర సంగం నాయకుడు నర్సింహ్మసాగర్

నిర్మాణ రంగంలో మొదటి నుంచి ఉన్న తమ కులాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పర కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మసాగర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 400 సొసైటీలు ఉన్నాయని, ఫెడరేషన్‌కు నిధులు కేటాయించి ఒక్కో సొసైటికి 50 శాతం సబ్సీడితో రూ. 30 లక్షలు ఇవ్వాలన్నారు. డాంబార్ ప్లాంట్, రెడిమిక్స్ ప్లాంట్‌ల ఏర్పా టుకు ప్రభుత్వం సహకరించాలన్నారు. ఈ మూడేళ్లలో కేవలం 12 యూనిట్లకే ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు.


వడ్డెర ఫెడరేషన్‌కు రూ. 100 కోట్లు



వేముల వెంకటేశ్

వడ్డెర ఫెడరేషన్‌కు ఏడాదికి రూ. 100 కోట్లు ఇవ్వాలని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల వెంకటేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన ఈ మూడేళ్లలో వడ్డెర ఫెడరేషన్‌కు ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల సొసైటీలు ఉన్నాయని, ఒక్కో సొసైటీకి రూ. 30 లక్షలు కేటాయించాలని కోరారు.

ఫెడరేషన్లను నిర్వీర్యం చేయొద్దు



కోల శ్రీనివాస్


గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన బీసీ ఫెడరేషన్లను నిర్వీర్యం చేయవద్దని పూసల కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫెడరేషన్లకు నిధులు కేటాయించి, పాలక వర్గాలను నియమించాలని ఆయన కోరారు. ఎన్నో పోరాటాలు చేయడం వల్లే గత ప్రభుత్వాలు ఫెడరేషన్లను ఏర్పాటు చేశాయన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లుగానే తమ సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మంగళగిరి ఎయిమ్స్‌పై ప్రధాని మోడీ సమీక్ష

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ఆలిండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ నిర్మాణంపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమీక్ష జరిపారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన ప్రగతి సమావేశంలో ఆయన పలు మౌలిక వసతుల ప్రాజెక్టుల పనితీరును పరిశీలించారు. దేశవ్యాప్తంగా మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగవంతం చేసేందుకు ప్రధానమంత్రి స్వయంగా ప్రగతి పేరుతో పర్యవేక్షిస్తున్నారు. ప్రగతి 21వ సమావేశాన్ని నిర్వహించిన ప్రధాని పలు ప్రాజెక్టుల పనితీరును సమీక్షించారు. పేటెంట్స్, ట్రేడ్ మార్క్‌కు సంబంధించి వస్తున్న ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సాంకేతికతను ఉపయోగించుకుని అవరోధాలను తొలగించాలని, ప్రపంచ ప్రమాణాలను అందుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న సుమారు 56వేల కోట్ల విలువైనమౌలిక వసతుల ప్రాజెక్టుల పనితీరును క్షుణ్ణంగా సమీక్షించారు. రైల్వే, రోడ్డు, విద్యుత్, చమురు పైప్‌లైన్‌లు తదితర ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కోరారు. ఢిల్లీ ముంబై పారిశ్రామిక కారిడార్, ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో ఎయిమ్స్ నిర్మాణంపై అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యూపీలో కొనసాగుతన్న ఎయిమ్స్ నిర్మాణ పనులను సమీక్షించారు. స్మార్ట్ సిటీ పథకం అమలు తీరును తెలుసుకున్నారు. స్మార్ట్ సిటీ ఛాలెంజ్‌లో వివిధ నగరాలు పాల్గొనడాన్ని ప్రశంసించారు. 90నగరాలను స్మార్ట్ సిటీలుగా మార్చడమే అందరి ముందున్న పెద్ద చాలెంజ్ అన్నారు. అంతరిక్ష పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని గిరిజనుల అటవీ హక్కులను కాపాడాలని ఆదేశించారు. జిఎస్టీలో మరింత రిజిస్ట్రేషన్‌లు పెంచేందుకు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు చొరవ తీసుకోవాలన్నారు.

పరిష్కారం దిశగా ఫాతిమా మెడికో కేసు

● సుప్రీం ఆదేశాలతో విద్యార్థుల్లో ఆశలు
● విద్యార్థులను సర్దుబాటు చేసే విషయమై వివరణ కోరిన సుప్రీం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కడప జిల్లా ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ బాధిత విద్యార్థుల సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. బాధిత విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో పాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 2 వారాల్లోగా జవాబు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ సందర్భంగా నష్టపోయిన విద్యార్థులను ఇతర కళాశాలల్లో సర్దుబాటు చేసే పరిస్థితి ఉందా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపు న్యాయవాది సమాధానమిస్తూ 13 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో విద్యార్థులను సర్దుబాటు చేస్తామని తెలిపారు. దీంతో కౌంటర్లు దాఖలు చేయాల్సిందిగా కేసులో ప్రతివాదులను ఆదేశిస్తూ తదుపరి విచారణ సెప్టెంబర్ 21కు వాయిదా వేసింది. 2015-16 విద్యాసంవత్సరంలో సరైన ప్రమాణాలు పాటించనందుకు ఫాతిమా మెడికల్ కాలేజి అనుమతులను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కళాశాల యాజమాన్యం కోర్టును ఆశ్రయించింది. తాత్కాలికంగా స్టే తెచ్చుకున్న యాజమాన్యం ఆ ఏడాది అడ్మిషన్లు యథావిధిగా చేపట్టింది. అయితే 9 నెలల తర్వాత వచ్చిన తుది తీర్పులో న్యాయస్థానం ఎంసీఐ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో అప్పటికే 9 నెలల విద్యాభ్యాసం చేసిన 100 మంది విద్యార్థులు అడ్మిషన్లతో పాటు విద్యా సంవత్సరాన్ని నష్టపోవాల్సి వచ్చింది. వారంతా రెండేళ్లుగా తమకు న్యాయం చేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చుట్టూ తిరుగుతూ వచ్చారు. కళాశాల యాజమాన్యం చేసిన తప్పులకు తమను బలి చేయవద్దంటూ నేతలను వేడుకున్నారు. దీంతో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యకు కోర్టు ద్వారానే పరిష్కారం సాధ్యమని భావించి విద్యార్థుల తరపున కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు ధర్మాసనం విద్యార్థులకు న్యాయం చేసే దిశగా చర్యలు చేపట్టింది. అయితే ఈ 100 మంది విద్యార్థుల్లో ఒకరు నీట్ పరీక్ష ద్వారా వేరే కళాశాలలో అడ్మిషన్ పొందినందున మిగతా 99 మంది విద్యార్థులను సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. తదుపరి విచారణ లోపు సమగ్ర వివరాలను సుప్రీంకోర్టుకు అందజేసేందుకు సమాయత్తమైంది.

ఏపీఎస్ఎఫ్‌సీలో ఆంధ్ర ప్రాంత ఉద్యోగులను విధుల్లో చేర్చుకోండి

● కేంద్ర ప్రభుత్వానికి ఏపీ సీఎస్ లేఖ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఎపిఎస్ఎఫ్‌సి)లో పనిచేస్తున్న డిప్యూటి జనరల్ మేనేజర్ జి.వెంకటేశ్వరరావు, మరో ఐదు ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందినప్పటికీ ఎపిఎస్ఎఫ్‌సి తెలంగాణ డివిజన్‌లో వీరిని కేటాయించారని, వీరిని ఏకపక్షంగా ఎస్ఎఫ్‌సి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ఏప్రిల్‌లో బాధ్యతల నుంచి రిలీవ్ చేశారని కేంద్ర హోం మంత్రిత్వశాఖ కార్యదర్శి రాజీవ్ మెహిరిషికి వివరిస్తూ ఈ మేరకు లేఖ రాశారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని 19వ షెడ్యూల్‌కు భిన్నంగా, ఏకపక్షంగా ఆంధ్రప్రాంతానికి చెందిన ఉద్యోగులను విధుల నుంచి రిలీవ్ చేశారని ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. పునర్వ్యవస్థీకరణ చట్టం ఈ అధికారులు తెలంగాణ డివిజన్‌లో పని చేసేందుకు అవకాశం కల్పించాలని మేనేజింగ్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తే అందుకు ఆయన సమ్మతించారని తెలిపారు. ఈ వినతిని పరిశీలించి వారిని విధుల నుంచి రిలీవ్ చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌కు సూచించినప్పటికీ ఆయన దాన్ని ఆమోదించలేదని ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. ఎపిఎస్ఎఫ్‌సిలో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రాంతాల వారీగా విభజించి వివక్షచూపవద్దని, తుది విభజన జరిగేంత వరకు ఏ ప్రాంతం వారైనా ఎస్ఎఫ్‌సిలో పనిచేసేలా ఆదేశించాలని దినేష్ కుమార్ కోరారు.

మేకలను బలివ్వడం ముమ్మారు తలాక్ వంటిదే

న్యూఢిల్లీ: బక్రీద్ సందర్భంగా మేకలు, గొర్రెలను బలి ఇవ్వడం వంటి దురాచారాలకు స్వస్తి చెప్పాలనీ, వాటికి బదులు దురలవాట్లను త్యాగం చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనుబంధ సంస్థ అయిన రాష్ట్రీయ ముస్లిం మంచ్ ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేసింది. మేకలను,గొర్రెలను బలి ఇవ్వడమంటే ముమ్మారు తలాఖ్ చెప్పడం ద్వారా భర్త భార్యకు విడాకులు ఇవ్వడం వంటి దురాచారం వంటిదేనని మంచ్ అవధ్ ప్రాంత కన్వీనర్ హసన్ కౌసర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు సంప్రదాయం పేరిట ఇప్పటికీ అనేక దురాచారాలను పాటిస్తున్నారనీ, వాటి నుంచి బయటపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



పతంజలి నుంచి 'దివ్యజల్'

● దీపావళి నాటికి మార్కెట్‌కు ● పెప్సికో, కోకాకోలాకు గట్టిపోటీ

న్యూఢిల్లీ : యోగా గురు రాందేవ్‌బాబా పతంజలి ఆయుర్వేద దీపావళి నాటికి ప్యాకేజీ హిమాలయన్ డ్రింకింగ్ వాటర్ (మంచినీరు) మార్కెట్లో విడుదల చేయనుంది. కంపెనీకి చెందిన హరిద్వారా, లక్నో ప్లాంట్‌లలో బాట్లింగ్ మొదలుపెట్టబోతున్నామని రాందేవ్ అధికార ప్రతినిధి ఎస్‌కె తిజారావాల్ చెప్పారు. దివ్యజల్ దేశవ్యాప్తంగా వచ్చే 3 నుంచి 6 నెలల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోగా రూ.1,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్యాకేజీ మంచినీటి మార్కెట్ రూ.7,040 కోట్లుగా ఉందని, వాటిలో బిస్లేరీ వాటా 24 శాతమని పేర్కొన్నారు. రాందేవ్ బాబాకు చెందిన దివ్యజల్ .. మార్కెట్లో పాతుకుపోయిన పెప్సీకో, కోకాకోలా, పార్లే కు చెందిన బిస్లేరీ, టాటాగ్లోబల్ బేవరేజస్‌కు గట్టి పోటీ ఇస్తుందనడంలో సందేహం లేదు. గత 2 సంవత్సరాల నుంచి పతంజలి ఆయుర్వేద ఆయుర్వేద పేరులో నిత్యావసర ఆహార పదార్థాల నుంచి బ్యూటీ కేర్, (సౌందర్యపోషణ) ఉత్పత్తుల వరకు మార్కెట్లో విడుదల చేసి పెద్ద పెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీలకు దడ పుట్టిస్తోంది. అలాగే రాందేవ్ బాబా రెస్టారెంట్ వ్యాపారంలో కూడా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. మెక్‌డొనాల్డ్, కెంటకీ ఫ్రైడ్ చికెన్, సబ్‌వేలకు పోటీ ఇవ్వబోతున్నారు. అలాగే దుస్తుల రంగంలో కూడా వచ్చే ఏడాది ప్రవేశించబొతున్నారు. ప్రారంభంలో 250 పతంజలి స్టోర్‌లను ప్రారంభిస్తుంది. ఈ దుస్తులు బిగ్‌బజార్‌తో పాటు ప్రభుత్వరంగానికి చెందిన ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్‌లలో విక్రయిస్తుంది.





ఎయిర్‌ఇండియా కొనుగోలు

● రెండు సంస్థల ఆసక్తి : జైట్లీ

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం ఎయిర్‌ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఎయిర్‌ఇండియాలో వాటాలు కొనుగోలు చేయడానికి రెండు కంపెనీలు ఆసక్తిని కనబర్చాయని ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చూచాయిగా చెప్పారు. జైట్లీ నేతృత్వంలో మంత్రుల బృందం భారీ నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్‌ఇండియాలో పెట్టుబడుల ఉపసంహరణకు ఎలాంటి వ్యూహాలు అమలు చేయాలనే అంశంపై కసరత్తు చేస్తున్నారు. ఈ విషయాన్ని జైట్లీ కూడా ధ్రువీకరించారు. కేంద్రకేబినెట్ గత జూన్‌లో ఎయిర్‌ఇండియాతో పాటు ఐదు అనుబంధ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించాలని సూత్రప్రాయంగా అంగీకరించింది. విమానయాన సర్వీసులు అందించే బర్డ్ గ్రూపు ఎయిర్‌ఇండియాకు చెందిన గ్రౌండ్ హ్యాండ్లింగ్ అనుబంధ సంస్థ ఏఐఏటీఎస్ఎల్ టేకోవర్ చేయడానికి ఆసక్తిని కనబరుస్తోందని పౌర విమానయాన కార్యదర్శి ఆర్ఎన్ చౌబే బుధవారం నాడు ఉదయం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. ఇండిగో కూడా ఎయిర్‌ఇండియా కొనుగోలు ఆసక్తిని కనబర్చిందని ఆయన అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎయిర్ ఇండియా భారీ నష్టాల్లో కూరుకుపోయింది. నీతిఆయోగ్ కూడా ఎయిర్ ఇండియాను పూర్తిగా ప్రైవటైజేషన్ చేయాలని సూచించింది. కాగా ఎయిర్ ఇండియా ఇప్పటికే రూ.52వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం 2012లో రూ.30వేల కోట్ల బెయిల్‌ఔట్ ప్యాకేజీతో రోజులు నెట్టుకొస్తోంది.

శ్రేయ లైఫ్ రష్యా వ్యాపారంపై

అరబిందో కన్ను

ముంబాయి: శ్రేయ లైఫ్ సైన్సెస్‌కు చెందిన రష్యా వ్యాపారాన్ని కొనుగోలు చేసేందుకు అరబిందో ఫార్మా సంప్రదింపులు జరుపుతోంది. ఈ డీల్ విలువ 80 నుంచి 100 మిలియన్ డాలర్ల దాకా వుంటుందని భావిస్తున్నారు. ఈ సంప్రదింపుల గురించి తెలిసిన విశ్వసనీయ వర్గాలు పై వివరాలు తెలిపాయి. సంప్రదింపులు తుది దశకు చేరాయని, వ్యాల్యుయేషన్ ప్రక్రియ కొనసాగుతోందని, శ్రేయ లైఫ్ సైన్సెస్ కొంత భాగాన్ని అట్టేపెట్టుకోవాలనుకుంటోందని, గంపగుత్తగా విక్రయించాలనుకోవడం లేదని ఆ వర్గాలు వెల్లడించాయి. 2001లో ఏర్పడిన శ్రేయ లైఫ్ సైన్సెస్ ఔషధాలు తయారు చేసి, అంతర్జాతీయ మార్కెట్లో విక్రయిస్తోంది. 200లో రష్యాలో అడుగిడిన ఈ సంస్థ ప్రస్తుతం 31 ఔషధాలదాకా అక్కడ విక్రయిస్తోంది. ఇందులో ప్రిస్క్రిప్షన్, ఓటిసి, జెనిరిక్ ఔషధాలున్నాయి. డిస్ట్రిబ్యూటర్ల ద్వారా 25 వేల రిటెయిల్ ఫార్మసీలకు, రష్యన్ ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థకూ కూడా శ్రేయా లైఫ్ సైన్సెస్ తన ఔషధాలను విక్రయిస్తోంది. ఇక రష్యాతోపాటు, అదే ప్రాంతంలోని మరికొన్ని దేశాలలోను, ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆగ్నేయాసియా దేశాలలోనూ కూడా శ్రేయా లైఫ్ సైన్సెస్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వివిధ థెరాప్టిక్ విభాగాల కింద మొత్తం 200 ఔషధాలను సంస్థ ఉత్పత్తి చేస్తోంది. 2015-16 సంవత్సరానికి శ్రేయా లైఫ్ సైన్సెస్ అమ్మకాలు రూ.269 కోట్లకు చేరాయి. ఈ డీల్ గురించి అరబిందో పెదవి విప్పకపోగా, రష్యాలో మేము ఇప్పటిదాకా వినియోగించని, కొన్ని రిజిస్ట్రేషన్స్‌లో భాగస్వాముల కోసం ప్రయత్నిస్తున్నట్లు శ్రేయా లైఫ్ సైన్సెస్ అధికార ప్రతినిధి చెప్పారు. అయితే రుణం తగ్గించుకునే వ్యూహంలో భాగంగా అంతర్జాతీయంగా కొన్ని వ్యాపారాలను సంస్థ విక్రయించాలనుకుంటోందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

కార్మిక సంస్కరణలతోనే వృద్ధికి ఊతం


న్యూఢిల్లీ: దేశంలో నలభైకి పైగా వున్న కార్మిక సంబంధ చట్టాలను 4గా కుదించడం ద్వారా సరళీకరించాలని, భారత్ లోని కార్మక సంబంధ చట్టాలు కొన్ని ప్రపంచంలోనే చాలా కఠినమైనవిగా వున్నాయని అరవింద్ పనగారియా చెప్పారు.

కేంద్ర కార్మిక చట్టలను సరళీకరించడం ద్వారా వ్యాపార నిర్వహణ సులభతరమవడమే కాకుండా, మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం సాధ్యమవుతుందని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా చెప్పారు. ప్రస్తుతం 40గా వున్న ఈ కార్మిక సంబంధ చట్టాలను నాలుగుగా కుదించడమే కాకుండా, కఠినంగా వున్న కొన్ని నిబంధనలను సరళీకరించడం ఆవశ్యకమని ఆయన అభిప్రాపడ్డారు. ఉద్యోగుల నియామకం, తొలగింపు విషయంలో ప్రపంచంలోనే కఠినమైన నిబంధనలు కొన్ని దేశంలో అమలవుతున్నాయని చెప్పారు. ఈ చట్టాలలో మార్పులను రాష్ట్రస్థాయిలో చేస్తే, ఆ రాష్ట్రా లలో మాత్రమే ప్రభావం వుంటుందని, కేంద్ర కార్మిక చట్టాలను సంస్కరించడం ద్వారా అయితే దేశమంతటికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. కార్మిక చట్టాల సంస్కరణలలో వేగం పెరిగితే, అధికవృద్ధికి అవకాశం కలుగుతుందని, పెట్టుబడుల రాక పెరిగి, ఉపాధి అవకాశాలు అధికమవుతాయని పనగారియా వివరించారు.

కొనుగోళ్లతో కళకళ!

● 258 పాయింట్ల వృద్ధి ● నేటితో ఆగస్టు ఎఫ్అండ్ఓ ముగింపు

ముంబై : స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు తిరిగి కోలుకున్నాయి. ఉత్తర కొరియా జపాన్‌పై క్షిపణి దాడులతో తలెత్తిన ఉద్రిక్తతలు చల్లబడ్డాయి. దీంతో గ్లోబల్ మార్కెట్లు జోరందుకున్నాయి.



సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. బీఎస్ఈ 258.07 పాయింట్లు లాభపడి 31,646 వద్ద, ఎన్ఎస్ఈ 88.35 పాయింట్లు పుంజుకొని 9,884.40 వద్ద ముగిసింది. గురు వారంతో ఆగస్టు నెల ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ముగియనుండటంతో మదుపరులు షార్ట్‌కవరింగ్‌కు పాల్పడ్డారు. మదుపరులు ముఖ్యంగా లోహ, చమురు సహజ వాయువు, ఇంధనం, రియల్టీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, క్యాపిటల్‌గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు మదుపరులు పెద్దెత్తున కొనుగోలు చేశారు. పైన తెలిపిన షేర్లని మంగళవారం నష్టపోయాయి.

బీఎస్ఈలో లాభపడిన టాప్5 షేర్లు ఇలా ఉన్నాయి. అదనీ పోర్ట్స్ 1.94 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ 1.83 శాతం, కోల్‌ఇండియా 1.39 శాతం, టాటాస్టీల్ 1.35 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా ఎంఅండ్ఎం 1.28 శాతం, పవర్‌గ్రిడ్ 0.35 శాతం, ఎన్‌టీపీసీ 0.3 శాతం, సిప్లా 0.19 శాతం, డాక్టర్ రెడ్డీస్ 0.16 శాతం వరకు నష్టపోయాయి.

స్టాక్ మార్కెట్లు పుంజుకోవడానికి మరో కారణం .. కొత్తగా అమల్లోకి వచ్చిన జీఎస్టి మొదటి నెలలోనే పన్ను రూపంలో ప్రభుత్వానికి రూ.92,283 కోట్ల రెవెన్యూను సంపాదించి పెట్టింది. ప్రభుత్వం లక్ష్యం కంటే ఇది చాలా చాలా ఎక్కువే. జీఎస్టి రిటర్న్స్ పూర్తయితే పన్ను వసూళ్లు మరింత పెరిగే అవకాశాలున్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీ గణాంకాల ప్రకారం విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు మంగళవారం నాడు రూ.1459.64 కోట్ల షేర్లు కొనుగోలు చేయగా.. దేశీయ సంస్థాగత మదుపరులు (బీఐఐ)లు రూ.1391 కోట్లు షేర్లు కొనుగోలు చేశారు.

రద్దయిన నోట్లలో 99%


ఆర్‌బీఐ గూటికి

● 1 శాతం=రూ.16వేల కోట్ల ఆదాయం ● ముద్రణకు 7వేల కోట్ల వ్యయం



ముంబై : రూ.500, రూ.1,000 కరెన్సీ నోట్ల చలామణి రద్దు తర్వాత.. రద్దు చేసిన 99 శాతం కరెన్సీ నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని రిజర్వుబ్యాంకు బుధవారం తెలియజేసింది. ఇప్పటి వరకు ప్రతిపక్షం పెద్ద నోట్ల రద్దు తర్వాత ఎంత మొత్తం కరెన్సీ తిరిగొచ్చిందని ప్రశ్నించడంతో రిజర్వుబ్యాంకు సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ గతేడాది నవంబర్ 8వ తేదీన నల్లధనం, అవినీతిని రూపుమాపడానికి రూ.500,రూ.1,000 నోట్లను రద్దు చేశారు. అయితే రిజర్వుబ్యాంకు 2016-17 వార్షిక నివేదికలో చలామణి నుంచి తప్పించిన పెద్దనోట్లలో రూ.15.28 కోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చాయని తెలిపింది. కేవలం రూ.16,050 కోట్లు రావాల్సి ఉందని పేర్కొంది.

నవంబర్ 8, 2016న మొత్తం 1,716.5 కోట్ల రూ.500 నోట్లు, 685.8 కోట్ల రూ.1,000 నోట్లు చలామణిలో ఉన్నాయి. ఇవన్నీ లెక్కిస్తే రూ.15.44 లక్షల కోట్లుగా తేలింది.



పెద్దనోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ గత సంవత్సరం రూ.500, రూ.2,000 నోట్లతో పాటు ఇతర డినామినేషన్ నోట్లను ముద్రించడానికి రూ.7,965 కోట్లు వ్యయం చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో వ్యయం చేసిన రూ.3,421 కోట్లతో పోల్చుకుంటే రెట్టింపు వ్యయం చేసింది.

ప్రభుత్వం నల్లధనం, అవినీతిని, నకిలి కరెన్సీకి అడ్డుకట్ట వేయడానికి పెద్దనోట్లను రద్దు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. నోట్ల రద్దును చాలా మంది స్వాగతించారు కూడా. అయితే ఆర్‌బీఐ చెప్పిందేమిటంటే పది లక్షల నోట్లు చలామణి అయితే కేవలం 7.1 నోట్లు మాత్రమే రూ.500 నకిలీ నోట్లు చలామణి అయ్యాయని.. అదే రూ.1,000 నోటు విషయానికి వస్తే ప్రతి పది లక్షల నోట్ల చలామణినికా గాను కేవలం 19.1 నోట్లు మాత్రమే నకిలీవని ఆర్‌బీఐ సాంపిల్ సర్వేలో తేలిందని వెల్లడించింది.

తాజాగా రిజర్వుబ్యాంకు వెల్లడించిన గణాంకాలపై ప్రతిపక్షం గరం గరం అయ్యింది. మాజీ ఆర్థికమంత్రి పీ చిదంబరం దీనిపై స్పందిస్తూ.. ఆర్‌బీఐ రూ.16,000 కోట్లు పెద్దనోట్ల రద్దుతో లాభపడితే రూ.21,000 కొత్త నోట్లుముద్రించి నష్టపోయిందని విమర్శించారు. పెద్దనోట్ల రద్దుకు సూచించిన ఆర్థికవేత్తకు నోబుల్ ప్రైజ్ ఇచ్చి సత్కరించాలని వ్యంగ్యంగా అన్నారు.

రద్దు చేసిన రూ.15,44,000 కోట్ల కరెన్సీలో రూ.16,000 కోట్లు వెనక్కి తిరిగిరాలేదు. దాని అర్థం ఏమిటంటే రద్దు చేసిన పాత నోట్లలో ఒక శాతం వెనక్కిరాలేదని.. పెద్దనోట్ల రద్దు సలహా ఇచ్చినందుకు ఆర్‌బీఐ సిగ్గుతో తలదించుకోవాలని ట్విట్ చేశారు. పెద్దనోట్ల రద్దు అనేది నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకోవడానికి ఈ పథకాన్ని తీసుకొచ్చారా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

రద్దు చేసిన పెద్దనోట్లలో కేవలం 8.9 కోట్ల నోట్లు రూ.1,000 నోట్లు బ్యాంకుకు తిరిగి రాలేదని వివరించింది. రద్దు చేసిన నోట్లలో ఇది కేవలం 1.3 శాతమేనని సమర్థించుకుంది. అయితే రూ.500 నోట్లు ఎంత మొత్తం తిరిగి రాలేదో ప్రస్తావించలేదు.

జూన్ 30, 2017 నాటికి స్పెసిఫైడ్ బ్యాంకు నోట్స్ (ఎస్‌బీఎన్)లు మొత్తం రూ.15.28 లక్షల కోట్లు బ్యాంకులకు తిరిగి వచ్చాయని తెలిపింది. పెద్దనోట్లు రద్దు చేసిన తర్వాత ఆర్‌బీఐ రద్దు చేసిననోట్లను బ్యాంకులో డిపాజిట్ చేసుకోవడానికి కొంత గడువు ఇచ్చింది. అయితే ఈ డిపాజిట్లపై ఆదాయపు పన్ను శాఖ దృష్టి పెట్టడంతో కొంత డబ్బు బ్యాంకుకు రాకపోవచ్చుననే వాదన కూడా ఉంది. నోట్ల ముద్రణకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వం నుంచి ఆర్‌బీఐ రాబట్టుకుంటుంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన డివిడెండ్‌లో సర్దుబాటు చేసుకుంటుంది. ఇదిలా ఉండగా 2016-17 ఆర్థికసంవత్సరంలో ఆర్‌బీఐ ఆదాయం 23.56 శాతం క్షీణించగా.. అదే సమయంలో వ్యయం మాత్రం 107.84 శాతం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఆర్‌బీఐ వద్ద అదనంగా రూ.306.59 కోట్లు మిగులుంటే అంతకు ముందు సంవత్సరం రూ.658.76 కోట్లు మిగులుండింది. సుమారు 53.46 శాతం క్షీణించింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రభుత్వం కొత్త రూ.500 నోటును తీసుకొస్తే రూ.1,000 నోటుకు ప్రత్యామ్నయం లేకుండా చేసింది. దానికి బదులుగా రూ.2,000 నోటును విడుదల చేసింది. మార్చి 31, 2017 నాటికి 588.2 కోట్ల రూ.500 పాత, కొత్త నోట్‌లు చలామణిలో ఉన్నాయని తెలిపింది. అదే మార్చి 31, 2016 నాటికి రూ.500 నోట్లు మొత్తం 1507 నోట్లు చలామణిలో ఉన్నాయని పేర్కొంది. మార్చి 31, 2017 నాటికి 328.5 కోట్ల కొత్త రూ.2,000 నోట్లు చలామణిలో ఉందని తెలిపింది. ప్రస్తుతం రూ.500, రూ.2,000, తాజా రూ.200 కొత్త నోటును చలామణిలోకి తెచ్చింది. మాజీ ఆర్‌బీఐ గవర్నర్ ఆర్ గాంధీ మాట్లాడుతూ.. పెద్దనోట్ల రద్దు ప్రభావం దీర్ఘకాలంలో కనిపిస్తుందన్నారు. నోట్ల రద్దు తర్వాత రద్దైన నోట్లతో కొంత కరెన్సీ తిరిగి వచ్చే అవకాశాల్లేవన్నారు.

లగ్జరీ కార్ల ధరలకు రెక్కలు

● 15 నుంచి 25 శాతానికి సుంకం పెంపు ● ఆర్డనెన్స్ ద్వారా జీఎస్టికి సవరణ



న్యూఢిల్లీ : కేంద్ర కేబినెట్ బుధవారం నాడు ఆర్డినెన్స్ ద్వారా వస్తు సేవల పన్ను (జీఎస్టి)లో మధ్యరకం నుంచి పెద్ద కార్లు స్పోర్ట్‌యుటిలిటి కార్లపై 15 శాతం నుంచి 25 శాతం వరకు సుంకాన్ని పెంచుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ ఆర్డినెన్స్ సెప్టెంబర్ 9వ తేదీన హైదరాబాద్‌లో జరిగే జీఎస్టి కౌన్సిల్ సమావేశం ప్రస్తావనకు వస్తుంది. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎంత మొత్తం సుంకం పెంచాలో నిర్ణయం తీసుకుంటుంది.

జులై 1 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో ఎస్‌యువీలో పాటు పెద్ద కార్ల ధరలను రూ.1.1 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు కంపెనీలు తగ్గించాయి. దీంతో కార్ల అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి. తాజాగా కేంద్రకేబినెట్ లగ్జరీ కార్లపై సుంకం పెంచడంతో తిరిగి కార్ల ధరలు పెరుగుతాయి. కేబినెట్ సమావేశం తర్వాత ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మీడియాతో మాట్లాడుతూ కేబినెట్ తీసుకున్న నిర్ణయం గురించి వివరించారు. ఆర్డినెన్స్ ద్వారా జీఎస్టిలో పన్ను రేట్ల సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా కొన్ని మోటార్ వాహనాలపై సుంకాన్ని పెంచుకోడానికి వీలవుతుంది. వచ్చిన డబ్బును జీఎస్టి అమలు తర్వాత రాష్ట్రాలు కోల్పోతున్న రెవెన్యూ పరిహారంగా చెల్లించడానికి వీలవుతుందన్నారు.

కేంద్రప్రభుత్వం నిర్ణయంపై మెర్సిడెజ్ బెంజ్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ హడావుడిగా నిర్ణయం తీసుకునే బదులు జీఎస్టి అమల్లోకి వచ్చిన ఆరు నెలల తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటే బాగుండేదన్నారు. హడావుడిగా సుంకం పెంచాలని నిర్ణయం తీసుకోడం తమకు ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. మహీంద్రా అండ్ మహీంద్రా కు చెందిన పవన్ గోయెంకా మాట్లాడుతూ.. అనుకున్న విధంగానే సుంకం పెంచారని అన్నారు.

ప్రస్తుతం ఆటో రంగం సంక్షోభంలో ఉన్న ప్పుడు పెంచడం భావ్యంగా లేదని, ఎంత మొత్తం ఎందుకు పెంచాల్సి వస్తుందో ప్రభుత్వం వివరించి ఉంటే బాగుండేదన్నారు. ఇప్పటికే ఆటో రంగం ప్రభుత్వానికి కొన్ని వినతి పత్రాలు అందించిందని, దానిపై తుది నిర్ణయం తీసుకోకుండా నిర్ణయం తీసుకున్నారు. సుంకం పెంచి ఆటో రంగానికి ఆందోళన కలిగిస్తున్నారని ఆయన వాపోయారు.



100 జీప్ కంపాస్ డెలివరీ

హైదరాబాద్ : ఫ్రైడ్‌మోటార్స్ హైదరాబాద్ జీప్ కంపాస్ 100, వాహనాన్ని బుధవారం డెలివరీ ఇచ్చింది. ఫ్రైడ్ మోటార్స్‌కు చెందిన సురేశ్, హైదరాబాద్‌కు చెందిన ఈ ప్రదీప్‌కుమార్, డి దేవేందర్‌రావుకు వాహనాలను అందజేశారు. అమెరికాకు చెందిన జీప్ దేశంలోనే ఉత్పత్తి ప్రారంభించింది.


పర్యావరణానికి ప్రాధాన్యం ఇవ్వండి

● పేపర్ టెక్, గ్రీన్ షుగర్ సమ్మిట్‌లో ఐపిఎంఎ ఉపాధ్యక్షుడు మెహతా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాంకేతిక పరిజ్ఞానం మరింతగా విస్తరించిన తరుణంలో పర్యావరణం పరిరక్షణను పరిగణలోకి తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని భారతీయ కాగిత ఉత్పత్తిదారుల సంఘం (ఐపిఎంఎ) ఉపాధ్యక్షుడు ఎఎస్ మెహతా అన్నారు. దేశంలోని పల్ప్ అండ్ పేపరు రంగంలో నూతన ప్రక్రియలు ఆవిష్కరించి కాగిత ఉత్పత్తులు సాధిస్తున్నారని, అదే స్థాయిలో పర్యావరణానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందని ఆయన అన్నారు. కాగిత పరిశ్రమకు అవసరమైన చెట్లు నరకడమే కాకుండా చెట్లు పెంచుతూ పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యత పోషిస్తోందని ఆయన అన్నారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య (సిఐఐ) నిర్వహిస్తున్న పేపరు టెక్ - గ్రీన్ షుగర్ సమ్మిట్ 2017 సదస్సులో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెహతా మాట్లాడుతూ, దేశంలో హరితవనాల ప్రాధాన్యత ఎంతో ఉందని, పర్యావరణ నిబంధనలు పాటించేందుకు కాగిత పరిశ్రమ ఉత్పత్తిదారులు తగిన విధానాలు అమలు చేయాలని సూచించారు. చెట్లతో పాటు నీరు, ఇంధన వినియోగాన్ని కూడా పొదుపు చేయాలని, ఇందుకోసం సామర్థ్యం కలిగిన యంత్రాలు వినియోగించాలని మెహతా సూచించారు. దేశంలో పేపరు పరిశ్రమ ఎంతో విస్తరించినప్పటికీ అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తులు సాధించలేకపోతున్నామన్నారు.

రూ.350 తగ్గిన పసిడి ధర

● గ్లోబల్, దేశీయ మార్కెట్లో డిమాండ్ కరవు



న్యూఢిల్లీ : బులియన్ మార్కెట్లో బుధవారం నాడు పసిడి ధర పది గ్రాములు ఏకంగా రూ.350 తగ్గి రూ.30,100 మార్కుకు దిగివచ్చాయి. కాగా మంగళవారం నాడు బంగారం ధరలు భారీగా పెరిగాయి. గ్లోబల్ మార్కెట్లతో పాటు స్థానిక నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్ల డిమాండ్ తగ్గడంతో ధరలు తగ్గాయని స్థానిక వర్తకులు చెబుతున్నారు. వెండి కూడా కిలో రూ.41వేల మార్కుకు దిగివచ్చింది. కిలో ఏకంగా రూ.500 తగ్గి రూ.40,600 పడిపోయింది. స్థానిక పారిశ్రామిక యూనిట్లతో పాటు వెండి నాణెల తయారీ కంపెనీలు కొనుగోళ్లకు దూరంగా ఉండటమే దీనికి కారణం. గ్లోబల్ మార్కెట్ల విషయానికి వస్తే పసిడి ధర మంగళవారం ఔన్స్ 0.07 శాతం క్షీణించి 1308.60 డాలర్లకు దిగిరాగా.. వెండి 0.43 శాతం తగ్గి న్యూయార్కులో 17.35 డాలర్లు పలికింది. దేశ రాజధానిలో 99.9 శాతం, 99.5 శాతం మేలిమి బంగారం పది గ్రాములు రూ.350 వరకు తగ్గి రూ.30,100, రూ.29,950కి దిగివచ్చాయి. కాగా మంగళవారం పది గ్రాములు బంగారం ఏకంగా రూ.550 పెరిగింది.

పెట్రోల్, డీజెల్‌పై పన్ను తగ్గించం



ధర్మేంద్రప్రధాన్

న్యూఢిల్లీ : పెట్రోల్, డిజెల్‌పై పన్నులు తగ్గించే ప్రసక్తిలేదని చమురుశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ బుధవారం నాడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో జులై నుంచి పెట్రోల్ ధర రూ.6పైనే పెరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన చమురు కంపెనీలు గత 15 ఏళ్ల నుంచి అనుసరిస్తున్న పక్షం రోజులకు ఒకసారి ధరలను సవరించే పద్ధతికి స్వస్తిపలికి రోజు వారి ధరలు సవరించడం మొదలుపెట్టింది. రోజు వారి ధరలను సవరించిన తర్వాత పక్షం రోజులపాటు ధరలు తగ్గముఖం పట్టినా, అటు తర్వాత అంటే జులై 3 నుంచి ధరలు పెరగడమే తప్ప దిగిరావడం లేదు. ప్రస్తుతం ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.6.08పైసలు పెరిగి రూ.69.12 పలుకుతోంది. చివరగా ఈ ధర ఆగస్టు 2014 స్థాయికి వచ్చింది. డిజెల్ విషయానికి వస్తే రూ.3.65 పైసలు పెరిగి రూ.57.01కి విక్రయిస్తున్నారు. ధరల సవరింపు అనేది పారదర్శకంగా జరుగుతోందని ఒక్కో నగరంలో ఎంతో ధర పలుకుతుందో ఎస్ఎంఎస్ ద్వారా తెలుసుకోవచ్చనని ప్రధాన్ అన్నారు. రోజువారి ధర సవరింపు అనేది ప్రస్తుతం మార్కెట్ ఎలా ఉందో సూచిస్తుందని, ప్రస్తుతానికి అత్యుత్తమ పద్ధతి ఇదేనని ఆయన రోజు వారి రేట్ల సవరింపును సమర్థించారు. పెట్రోల్, డిజెల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించే అవకాశం ఏమైనా ఉందా అని ప్రశ్నించగా.. ప్రస్తుతానికి అలాంటి ఆలోచన లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో పరిస్థితిని బట్టి ఆలోచిద్దామన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నవంబర్ 2015, జనవరి 2016లో పెట్రోల్, డిజెల్‌పై ఐదు రెట్లు ఎక్సైజ్ సుంకం పెంచేశాయి. ఎక్సైజ్ సుంకం పెట్రోల్‌పై లీటరుకు రూ.4.02, డిజిల్‌పై రూ.6.97 పెంచాయి. అంతకు ముందు ప్రభుత్వం నాలుగు వాయిదాల్లో ఎక్సైజ్ సుంకం పెట్రోల్, డిజెల్‌పై నవంబర్ 2014 నుంచి జనవరి 2015 వరకు పెంచాయి. నాలుగవసారి ఎక్సైజ్ సుంకం లీటరుకు రూ.7.75, డిజిల్ రూ.6.50 పెంచాయి. దీంతో ప్రభుత్వానికి రూ.20వేల కోట్ల అదనపు రెవెన్యూ వచ్చి పడింది. దీంతో ద్రవ్యలోటు తగ్గించుకోవడానికి వీలైంది. మొత్తానికి పెట్రోల్‌పై లీటరుకు రూ.11.77, డిజిల్ రూ.13.47 పెంచి ప్రభుత్వం ఖజానా నింపుకుంది. కాగా పెట్రోల్, డిజెల్, ముడి చమురు, విమానాలకు వినియోగించే ఇంధనం, సహజ వాయువులను జీఎస్టి పరిధి నుంచి మినహాయించారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టిలోకి తీసుకురావడానికి తాము అనుకూలమేనని ప్రధాన్ అన్నారు.

తగ్గనున్న వృద్ధిరేటు


● క్యూ1లో 6 శాతమే : హెచ్ఎస్‌బీఎసీ

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు కాస్తా తగ్గే అవకాశం ఉందని హెచ్ఎస్‌బీసీ తాజా నివేదికలో వెల్లడించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 6 శాతం నమోదయ్యే అవకాశాలున్నాయని అంచనా వేసింది. అంతకు ముందు అంటే మార్చితో ముగిసిన త్రైమాసికంలో 6.1 శాతం వృద్ధిరేటును సాధించింది. ప్రైవేట్ వినియోగం పెరగడం.. పెట్టుబడులు మందగించడంతో ప్రభుత్వం వ్యయం తగ్గించడంతో ఎగుమతులు కూడా బలహీనంగా నమోదు కావడంతో దాని ప్రభావం వృద్ధిరేటుపై చూపుతోందని వివరించింది. బడ్జెట్‌ను ముందుకు జరపుతామని ప్రకటించడంతో పాటు కొత్తగా అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టి) రేట్ల వల్ల రాబోయే కాలంలో జీడీపీ వృద్ధిరేటు అంతంత మాత్రంగానే ఉంటుందని అంచనా వేసింది.

రాబోయే త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థను కొలవడానికి గ్రాస్ వాల్యూ యాడెడ్ ద్వారా (జీవీఏ) లెక్కిస్తే ఖచ్చితమైన సమాచారం లభిస్తుందని తేల్చి చెప్పింది. గతేడాది నవంబర్ 8వ తేదీన పెద్దనోట్ల రద్దు, ఈ ఏడాది జులై 1 నుంచి జీఎస్టి అమలుతో పాటు ప్రభుత్వం పలు విధానాలు మారుస్తుండటంతో జీడీపీని లెక్కించే బదులు ఆర్థిక వ్యవస్థ వృద్ధికి జీవీఏపై ఆధారపడ్డం మేలని హెచ్ఎస్‌బీసీ సూచించింది. జీవీఏ ప్రకారం చూస్తే ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు కాస్తా మెరుగుపడి 6.2 శాతం దాటుతుందని.. జీడీపీ ప్రకారం లెక్కిస్తే ఆరు శాతం కంటే తగ్గుతుందని హెచ్ఎస్‌బీసీ పరిశోధన పత్రంలో పేర్కొంది. ఇదిలా ఉండగా కేంద్రబడ్జెట్ ఈ ఏడాది ఫిబ్రవరి 1న విడుదల చేసింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే ఒక నెల ముందుకు జరిపింది. దీంతో ప్రభుత్వం అనుమతులు వీలైనంత త్వరగా ఇవ్వడానికి వీలవుతుంది. వ్యయం కూడా చేయడానికి వీలవుతుంది ముఖ్యంగా సబ్సిడీలపై అని తెలిపింది. అలాగే కొత్త పన్ను వ్యవస్థ జీఎస్టిని తీసుకురావడంతో పన్ను వసూళ్లలో కూడా వ్యత్యాసం ఉంటుందని వివరించింది. తమ అంచనా ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జీవీఏ వృద్ధిరేటు సంవత్సరం ప్రాతిపదికన చూస్తే కాస్తా కోలుకొని 6.2 శాతంగా నమోదు కావచ్చునని అంతకు క్రితం త్రైమాసికంలో పెద్దనోట్ల రద్దు వల్ల 5.6 శాతంగా నమోదైందని పరిశోధన ప్రతంలో పేర్కొంది. అటు తర్వాత పరిస్థితులు మెరుగు పడినా.. వృద్ధిరేటు మాత్రం పెద్దగా జోరుండదని స్పష్టం చేసింది. వాస్తవానికి చూస్తే 2016 జూన్ నుంచి వృద్ధిరేటు క్రమంగా తగ్గుకుంటూ వచ్చిందని తెలిపింది. ఉత్పత్తి, వ్యవసాయం, వాణిజ్యం, సేవల రంగంలో బలోపేతం అవుతాయని, తయారీరంగం కూడా మెరుగుపడి ఐఐపీ గణాంకాలపై ప్రభావం చూపుతుందని, ఆర్థిక సేవల రంగం మాత్రం అంతంత మాత్రంగానే ఉంటాయని స్పష్టం చేసింది.

బ్రిడ్జ్‌స్టోన్ అంబాసిడర్‌గా పి.వి.సింధు

హైదరాబాద్: టైర్ల తయారీ రంగంలోని బ్రిడ్జ్‌స్టోన్ ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధును తమ తొలి బ్రాండ్ అంబాసడర్‌గా నియమించుకుంది. బ్రిడ్జ్‌స్టోన్ ప్రపంచవ్యాప్తంగా ఒలింపిక్ భాగస్వామిగా వ్యవహరిస్తోంది. పి.వి. సింధు బ్రిడ్జ్‌స్టోన్ యాక్టివేషన్స్‌లో భాగమ వుతారని, ఈ ఒప్పందం మూడేళ్లపాటు అమలులో వుంటుందని బ్రిడ్జ్‌స్టోన్ తెలిపింది. రియో ఒలింపిక్స్‌లో వెండి పతకం సాధించిన పద్మశ్రీ సింధును బ్రాండ్ అంబాసడర్‌గా నియమించుకోవడం ఆనందకరమని బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుతోషి ఒయమా ఈ సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో చెప్పారు. మా బ్రాండ్‌ను ప్రతిఫలించేలా సింధు విజయసాధకురాలిగా కొనసాగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక, ఫలప్రదమైన భాగస్వామ్యంగా ఈ అనుబంధం పటిష్ఠమవుతుందని భావిస్తున్నట్లు పి.వి. సింధు ఈ సందర్భంగా చెప్పారు.



నేడు డిగ్రీ విద్యార్థులకు సీట్ల కేటాయింపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరడం కోసం దోస్త్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నాలుగోవిడత సీట్ల కేటాయింపు గురువారం జరగనుంది. సీట్లు పొందిన వారు సెప్టెంబర్ 1 నుంచి 4 వరకు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. మూడో విడతలో సీట్లలో జరిగిన గందరగోళం నేపథ్యంలో నాలుగో విడత వెబ్‌ఆప్షన్లకు అవకాశం ఇచ్చారు. ఇప్పటి వరకు సీట్లు పొందని వారికి కూడా సీట్లను కేటాయించనున్నారు.

టీజీటీ పరీక్షకు 78 శాతం హాజరు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: గురుకులాల్లోని ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహిస్తున్న ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటి) ప్రధాన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బుధవారం రాష్ట్రంలోని మూడు కేంద్రాల్లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పరీక్షను నిర్వహించింది. పరీక్షకు 3006 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2349 మంది హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు.

అటవీ అనుమతులకు సత్వర చర్యలు

ప్రాంతీయ అటవీ అధికారి రామ్‌గోపాల్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వివిధ పథకాలకు అవసరమైన అటవీ భూములకు సంబంధించి ఇప్పటి వరకు 179 మొదటి విడత అనుమతులు ఇవ్వడం జరిగిందని కేంద్ర అటవీ పర్యావరణ శాఖ ప్రాంతీయ అధికారి (చెన్నై) రామ్ గోపాల్‌రెడ్డి తెలిపారు. దాదాపు 263 ప్రాజెక్టుల పనులకు తెలంగాణ ప్రభుత్వం రెండో దశ అనుమతులు సాధించిందన్నారు. అటవీ శాఖ అనుమతులు మంజూరు చేసినప్పటికీ తదుపరి చేపట్టాల్సిన చర్యల్లో తీవ్ర జాప్యం వల్ల తుది దశ అనుమతులు నిలిపివేయాల్సి వస్తోందన్నారు. సెప్టెంబర్ నెలాఖరులోగా మరో సారి అనుమతుల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. అటవీ అనుమతులపైన అరణ్యభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో రామ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టులకు అటవీ అనుమతులపై ప్రధానంగా చర్చించారు. రోడ్లు భవనాలు, విద్యుత్, సింగరేణి, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, గిరిజనాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, పనులకు అవసరమైన అటవీ అనుమతులపై చర్చించారు. శాఖల వారిగా సమీక్షలు నిర్వహించి మూడు మాసాల్లో అన్ని పనులు పూర్తి చేసి తుది అనుమతుల నివేదికలను పంపించడం జరుగుతుందని సంబంధిత శాఖల అధికారులు అటవీ పర్యావరణ శాఖకు తెలియచేశారు. చిన్న చిన్న కారణాలతో అనుమతుల్లో జాప్యం కారణంగా ప్రాజెక్టుల అనుకున్న లక్ష్యం నెరవేరబోదని రామ్‌గోపాల్‌రెడ్డి తెలిపారు. జాప్యాన్ని నివారించాలని అధికారులను కోరారు. సమావేశంలో ప్రధాన అటవీ సంరక్షణ అధికారి పి.కె. ఝా, అదనపు అటవీ సంరక్షణ అధికారి ఆర్. శోభ, అన్ని జిల్లాలకు చెందిన అటవీ శాఖ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

7న రైతు సాధికార సంస్థ ముట్టడి

1 నుంచి రైతు డిమాండ్ల వారోత్సవం: ఏపీ రైతు సంఘం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రైతులకు ఒకేసారి రుణమాఫీ అందించాలని డిమాండ్ తో సెప్టెంబర్ 7న గన్నవరంలోని రైతుసాధికార సంస్థ ముట్టడిని చేపడుతున్నట్లు అఖిల భారత కిసాన్ సంఘ్ జాతీయ ఉపాధ్యక్షులు రావుల వెంకయ్య తెలిపారు. రైతుల డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు రైతాంగ డిమాండ్ల వారోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా వారం రోజులపాటు అన్ని జిల్లాల్లోనూ ఆందోళనలు, ధర్నాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన 7న ఛలో గన్నవరం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు అన్ని రకాల రుణాలను రద్దు చేస్తామని ప్రకటించి రూ. 84వేల కోట్లకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక 30 రకాల షరతులు విధించి రుణమాఫీ లక్ష్యాన్ని రూ. 24 వేల కోట్లకు కుదించారని విమర్శించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గత 22 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ వారి సమస్యలను తీర్చలేకపోవడం దారుణమన్నారు. ఐసీఏఆర్ గుర్తింపు లేకున్నా ఇతర రాష్ట్రాల్లో విద్యను అభ్యసించి ఉద్యోగాలను పొందిన 256 మంది ఇప్పుడు పదోన్నతులు పొందడం కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 64ను వెంటనే రద్దు చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ డిమాండ్ చేశారు.

అర్జున్‌రెడ్డి సినిమాను నిలిపివేయాలి

ఏఐవైఎఫ్ డిమాండ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ : యువత, మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగే విధంగా సీన్లు ప్రదర్శించిన అర్జున్‌రెడ్డి సినిమాను తక్షణమే నిలిపివేయాలని ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ నదీమ్, నెర్లకంటి శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అర్జున్‌రెడ్డి సినిమా [illegible] దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్, ఆన్‌లైన్ గేమ్స్, రమ్మీ ఆటలను నిషేధించిన మాదిరి యువతను చెడుదారి పట్టించే సీన్లు ఉన్న సినిమాలకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు.

ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాలను మంజూరు చేయాలి

ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు రుణాలను అందించాలని ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో అధికారులతో రామలక్ష్మణ్ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలను త్వరతగతిన అందించాలని ఆదేశించారు. అదే విధంగా 2017-18 రుణ ప్రణాళికను కూడా వెంటనే చేయాలని ఆయా సంక్షేమశాఖ అధికారులను సూచించారు. ఎస్సీలకు సంబంధించి ఈ ఏడాదికి గాను ఇప్పటి వరకు ఆన్‌లైన్ లో 1.19లక్షల మంది దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. లబ్దిదారుల ఎంపిక గురించి జిల్లా అధికారులకు ఆదేశించామని తెలిపారు. మిగతా కార్పొరేషన్ అధికారులు కూడా వెంటనే ఈ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీసీ, మైనార్టీ సంక్షేమశాఖ అధికారులు అహ్మదాబాలిక్, లియాఖత్‌అలీ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ చట్టాల ఉల్లంఘన

తెరాస ప్రభుత్వంపై రావుల ధ్వజం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజ్యాంగాన్ని, రెవెన్యూ చట్టాలను తెరాస ప్రభుత్వ ఉద్దేశ్యపూర్వకంగా ఉల్లంఘిస్తోందంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రస్తుతమున్న కేంద్ర, రాష్ట్ర భూచట్టాలను హరించే విధంగా తెరాస ప్రభుత్వం జీవో 39ను తీసుకురావడంపై ఆయన తీవ్ర స్థాయిలో అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రావుల మాట్లాడుతూ, కొత్తగా జీవోను తెచ్చి మళ్లీ కొత్తగా పటేల్-పట్వారీ వ్యవస్థ వస్తుందన్న భయం రైతుల్లో నెలకొందన్నారు. తెరాస నాయకులు, కార్యకర్తలను రైతుల భూముల్లోకి జొరబడేందుకు జీవో 39 ద్వారా కల్పిస్తున్నారని విమర్శించారు. భూముల క్రమబద్ధీకరణ, వివాదాలను పరిష్కరించడం, కొత్త సర్వే నెంబర్లు ఇవ్వడం వంటి భూ సమస్యల పరిష్కారానికి కోసమే ప్రస్తుత భూ చట్టాలు ఉన్నప్పటికీ దానికోసం అంతర్యం మరోటి ఉండని రావుల వ్యాఖ్యానించారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రైతుల సమన్వయ సమితులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందుకు అయితే ఎన్టీఆర్ రద్దు చేసిన పటేల్-పట్వారీ వ్యవస్థను మళ్లీ తెరాస ప్రభుత్వం తీసుకురావాలన్న లక్ష్యంతో కొత్తగా జీవోను తీసుకువచ్చిందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ రైతుల సమన్వయ సమితులలో సభ్యుల చుట్టూ తిరిగే పరిస్థితి నెలకొనున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. క్యాబినెట్ నిర్ణయం కాకుండా ముఖ్యమంత్రి ఎలా నామినేట్ చేస్తారని రావుల ప్రశ్నించారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

- జిల్లాల్లో మత్స్యకార సంఘాలను ఏర్పాటు చేస్తాం • మత్స్యకారులకు సబ్సిడీపై ఉపకరణాల పంపిణీ
- సంగారెడ్డి, సదాశివపేటకు చేపల మార్కెట్ మంజూరు: మంత్రి తలసాని



సంగారెడ్డి, కెఎన్ఎన్: గ్రామీణా ప్రాంతాలలో నివాసం ఉంటూ కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి కోరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు అనేక సంక్షేమ చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జేడ్‌పి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా వృత్తిని నమ్ముకుని జీవనం కోనసాగిస్తున్న మత్స్యకారులను, మత్స్యకార్మిక కుటుంబాలు తెలంగాణ ప్రభుత్వం అనేక విధాల సహయ సహకారాలు అందించి ఈ వృత్తిపై ఆధారపడే కులాల వారికి వృత్తి నైపుణ్యాత శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి మార్గాలను అందే విధంగా కృషి చేయాలని ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు ఆదేశించినట్లు మంత్రి శ్రీనివాస్ యాదవ్ తెలి పారు. స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సంగారెడ్డి , సదాశివపేటకు చేపల మార్కెట్ కావాలని అడుగగానే మంజూరు చేసిన మంత్రి. ఇదే వృత్తిపై మిగతా కులాల వారు కూడా ఈ రంగంపై ఆధారపడి జీవనం కోనసాగిస్తే వారి కూడా సభ్యత్వం కల్పించే అంశాన్ని స్థానిక ఎమ్మెల్యేలు పరిశీలించాలని ఆయన సూచించారు.ఇదిలా ఉండగా జిల్లాల కేంద్రాలతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రాలలో మత్స్య మార్కెట్‌ను నిర్మించి స్థానిక సహకార సంఘాలలోని సభ్యులకు వాటి నిర్వ హణ భాద్యత అప్పగించాలని ఆయన తెలిపారు. జిల్లాలో మూడు కోట్ల 60లక్షల చేప పిల్లలను రెండవ విడుత పంపిణీ చేస్తున్నామని ఆయన ప్రకటించారు.మొదటి విడతలో మత్స్యకారులకు అందజేసిన చేపవిత్తనాల ద్వారా సత్ఫ లితాలు రావడంతో తెరాస ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటు వారి జీవన విధానంలో మార్పులు చేయడంతో పాటు ఆర్థికంగా స్థిరపడేం దుకు తమ ప్రభుత్వం రెండవ విడుత కూడా రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో మత్స్యకారులకు, సోసైటి సభ్యులకు నాణ్యమైన, ఆరోగ్యమైన చేప పిల్లలను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.అదే విధంగా జిల్లాపరిధిలోని సింగూర్ ప్రాజెక్టులో చేప పిల్లలను ఆయన విడుదల చేశారు.కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాబూమోహన్,మాజీ ఎంపి మాణిక్‌రెడ్డి, పుల్‌కల్, అందోల్, వట్‌పల్లి,మునిపల్లి,రాయికోట్ టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు,జోగిపేటమార్కెట్ కమిటీ చైర్మన్ నాగభూషణం, వట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఖమ్‌రోద్దీన్,సిడిసి డైరెక్టర్ జైపాల్ నాయక్, ఎంపిటిసిలు పోరం మండల ప్రదాన కార్యదర్శి ఈశ్వర్‌గౌడ్, ఉపాద్యక్షులు సంగమేశ్వర్ గౌడ్,టిఆర్ఎస్ నాయకులు హరి సింగ్,సతీష్,రాజు,మహేశ్,యాదగిరి,సుకేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, సలీంమ్,ఇర్‌ఫాన్,హర్షిత్ పాటెల్,రమేశ్, బుచ్చగౌడ్, మాణిక్‌రెడ్డి,నర్సింహాగౌడ్,శంకర్,కనకరెడ్డి,శేఖర్,మధు సూదన్, మంతూర్ ఎంపిటిసి గోపాల్, నాగేశ్‌సార్,శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్,నర్సింహులు,పల్లె సంజీవయ్య,నాగేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రేటే మేడిగడ్డలో ఇవ్వాలి

అది అభిప్రాయసేకరణ కాదు.. తెరాస సభ: మాజీ మంత్రి శ్రీధర్ బాబు



మహాదేవపూర్, కెఎన్ఎన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్నదని మాజీ మంత్రి , తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆరోపించారు. బుధవారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న అంతరం విలేకరులతో మాట్లాడు తూ ఈ ప్రాంతం రైతులు తమ భూమి కోల్పోయి త్యాగం చేసిన కూడా సరైన నష్టపరిహారం ఇవ్వడంలేదని ఆయన ఆరోపించారు. సిద్దిపేటలో ఇచ్చిన నష్టపరిహారాన్ని ఇక్కడి రైతులకు ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. అక్కడి రైతుకు ఒక న్యాయం ఇక్కడ త్యాగం చేసిన రైతుకు మరో న్యాయమా అంటూ ప్రశ్నించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ మురళి సహకారంతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని టీఆర్ఎస్ అభిప్రాయ సేకరణ సభగా మార్చారని ఘాటుగా విమర్శలు గుప్పించారు. ఈ ప్రాంతంలోని రైతులు భూములు కోల్పోయిన తమ అభిప్రాయాన్ని చెపప్పుకోవడానికి వస్తే అనేక చోట్ల నిర్బంధాలు విధించి సభకు రానియకుండా భయబ్రాంతులకు గురి చేశారన్నారు. సభలో కేవలం టీఆర్ఎస్ నాయకులను , వారి ప్రజా ప్రతినిధులను క ూర్చోబెట్టి టీఆర్ఎస్ఎస్ సభగా మార్చారన్నారు. ఎక్కడాలేని విధంగా ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్న కొన్ని కాంట్రక్టు సంస్థలతో రైతులకు చెక్కులను ఇప్పిస్తున్నారని ,డ్రాప్టు నోటీఫికేషన్ వెలువడిన తర్వాత ఆ భూమిఆని రిజిస్ట్రేషన్ చేయకూడదని, కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిర్మాణ కాంట్రాక్టర్లతో భూములను కొనుగోలు చేస్తున్నాయని ఇది అప్రజాస్వామిక పద్దతులను అవలంభిస్తున్నాయని ఎద్దేవ చేశారు. ఈ ప్రాంతంలో ఒక చోట ఒక రేటు మరో చోట మరో రేటు ఇస్తూ రైతులను భయభ్రంతులకు గురిచేసి భూములను లాక్కుంటారని విమర్శించారు. 2013 చట్టం అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాంచే చేస్తున్నామన్నారు. కేవలంప్రభుత్వం వివిధ చట్టాలను తీసుకువచ్చి రైతులతో టైంపాస్ చేస్తుందన్నారు. నూతనంగా మరో జీఓను తీసుకువచ్చి టీఆర్ఎస్ కార్యకర్తలను రైతు సంఘాలుగా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రైతు సంఘాల ఏర్పాటును నామినేట్ పద్దతిలో కాకుండా ఎన్నికలు నిర్వహించి ఏర్పటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అవలంభిస్తున్న విధాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పోరాడుతామని అన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా ఫ్లోర్ లీడర్ చల్లా నారాయణ రెడ్డి, ముత్తారం జెడ్పీటీసీ సదానందం, సర్పంచ్ కోట రాజబాపు, మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి తిరుపతి, కేదారి గీత, కామిడి శ్రీనివాస్ రెడ్డి, విలాస్ రావు, హైదర్, షకిల్, రాజాబాపు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్టేషన్ల సమీపంలో సోలార్ బస్ షెల్టర్లు

నగర రవాణా సమన్వయ కమిటీ వెల్లడి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మెట్రో రైల్ స్టేషన్‌ల సమీపంలో సోలార్ బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని బస్, రైల్ రవాణాను అనుసంధానం చేయబోతున్నారు. దీని కోసం మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు పాస్ జారీ చేసేందుకు అధికారులు సిద్దమయ్యారు. నగరం లో మెట్రో రైలు పరుగెత్తే నాటికి ఈ సదుపాయాలన్ని అందు బాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటు న్నారు. నగరంలో మెట్రో రైల్, బస్ రవాణా అనుసంధానం అంశం పైన ఆర్టీసీ, హెచ్ఎంఆర్, హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసీ అధికారులతో ఏర్పాటైన సమన్వయ కమిటీ బుధవారం సాయంత్రం ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ అధ్యక్షతన బస్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో నగర ప్రజా రవాణాపైన సుదీర్ఘ చర్చ జరిగింది. శాఖల వారిగా తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ, హెచ్ఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్. రెడ్డి, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు, జిహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శంకరయ్య, దక్షిణ మధ్య రైల్వే డిఆర్ఎం సుమీత్ శర్మ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుంగా రవాణా సేవలు అందించేం దుకు నాలుగు శాఖల అధికారులు సమన్వ యంతో పని చేయాలని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునిల్ శర్మ సూచించారు. మెట్రో రైల్ కార్యనిర్వహణకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిచనున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ వెల్లడించారు. మెట్రో రైలుకు అనుసంధానంగా బస్సు సౌకర్యం కలిగించేం దుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి. రమణారావు వివరించారు.

తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు

న్యాయమూర్తి చల్లా కోదండరాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ :తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులని హైకోర్టు న్యాయమూర్తి చల్లా కోదండరాం పేర్కొన్నారు. గిడుగు రామ మూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి బిక్కి కృష్ణ అధ్యక్షన జరిగిన గిడుగు జయంతోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాష సామాన్య ప్రజల జీవితాల్లో ఎప్పటికీ బతికి ఉంటుందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు గిరిజనులకోసం సవర భాషను కనిపెట్టారని చల్లా కోదండరాం పేర్కొన్నారు. సభాధ్యక్షులు బిక్కి కృష్ణ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగు భాషకోసం ఉద్యమం చేయడం వల్లనే నేడు కవులు రచయితలు అచ్చమైన తెలుగు భాషలో రచనలు చేయగలుగుతున్నారని తెలిపారు. గిడుగు జన్మదిన సందర్భంగా సమాజ హితం కోసం కృషిచేస్తున్న కవులు రచయితలు, సమాజ సేవకులకు పురస్కారాలు అందజేయడం సముచితంగా ఉందని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. గిడుగు రామమూర్తి భాషోద్యమ ఫలితంగా దళిత బహు జనులు తమదైన భాషలో రచనలు చేయ గలుగుతున్నారని ప్రముఖ విమర్శకులు జి.లక్ష్మీనర్సయ్య తెలిపారు. రెండు రాష్ట్రాల కవులు రచయితలు గిడుగు అడుగుజాడల్లో నడవాలని తెలంగాణా రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం పిలుపునిచ్చారు. యువ రచయితలను కవులను పురస్కా రాలతో ప్రోత్సహిస్తున్న బిక్కి కృష్ణకాంతి కృష్ణల కృషి అభినందనీయమని నేటి నిజం ఎడిటర్ బైసా దేవదాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ నవలా కారులు, ప్రభాకర్ జైనికి నవ్య నవలా చక్రవర్తి బిరుదుతో పాటు, జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. జి.లక్ష్మీనర్సయ్యకు గిడుగు సాహితీ పుర స్కారం, ప్రముఖ సామాజిక సేవకులు గంగిరెడ్డికి గిడుగు సామాజిక సేవా పురస్కారం, పి.శ్రీరాములుకు విద్యారంగ సేవా పురస్కారం, జియో లక్ష్మణ్, పసునూరి రవీంద్ర, యం.బి.డి శ్యామల, సి.హెచ్ ఉషారాణి, తదితరులకు సాహితీ పురస్కారాలు అంద జేశారు.

కుకరీలో ఎన్టీఆర్ ట్రస్టు శిక్షణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎన్‌టిఆర్ ట్రస్టు, ఫ్రీడం రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌తో కలిసి ఫ్రీడం స్వయం ఉపాధి కుకరీ శిక్షణా శిబిరాన్ని నిర్వహించింది. ఈ శిక్షణా శిబిరంలో 20 మందికిపైగా అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు వినోదంతో పాటు ఉత్సాహాన్ని అంది ంచే రీతిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హైదరా బాద్‌లో ప్రారంభమైన ఫ్రీడం స్వయం ఉపాధి కుకరీ శిక్షణా శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో నిర్వహించడానికి ప్రణాళికసిద్ధంచేశారు. ఈ శిబిరం ఆరు వారాల పాటు ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సదుపాయంలో నిర్వహించనున్నారు. ఈ సదుపాయంలో అత్యాధునిక కిచెన్, మైక్రోవేవ్ ఓపెన్, రిఫ్రిజిరేటర్, చిమ్నీతో పాటుగా కుకింగ్ శ్రేణి ఉంటాయి. ఈ కార్యక్రమంలో స్వీట్ల తయారీ, చైనీస్ ఉత్పత్తులు, బ్రేక్ ఫాస్ట్ బేకరీ ఉత్పత్తుల తయారిలో శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణా తరగతులలో నూతన ఎఫ్అండ్‌బి వెంచర్‌ను ఏర్పాటు చేయడంతో పాటుగా దాని మార్కెటింగ్ ఏ విధంగా చేయాల నేది సుప్రసిద్ధ చెఫ్‌లు ఎఫ్ అండ్ బీ ఔట్లెట్ యజమానులు, అంతర్జాతీయ శిక్షణ పొందిన నిపుణులు తెలుపనున్నారు. కుకరీ శిక్షణా శిబిరంలో పాల్గొన్న అభ్యర్థులకు ఈ శిక్షణను పూర్తి ఉచితంగా అందించడంతో పాటుగా వారు తమ సొంత వెంచర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన సహకారాన్ని కూడా అందించనున్నారు. ప్రస్తుత బ్యాచ్‌లోని 20 మంది సభ్యులలో 40శాతం మంది తాము స్వయంగా తమ సొంత సంస్థ ఏర్పాటు చేసుకో వాలని, అదీ ఫుడ్ బేకరీ లేదంటే క్విక్ సర్వీస్ టిఫిన్ సెంటర్ తరహాలో టేక్ ఏవే పాయింట్లుగా వాటిని ఏర్పాటు చేయాలనే ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ టి.విష్ణువర్దన్ మాట్లాడుతూ, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు స్వయం ఉపాధి సాధించుకోవడంతో పాటు మరికొంత మందికి ఉపాధిని అందించేరీతిలో ఉండేందుకు తగిన సహాయం అందిస్తామన్నారు.

ఏపీ ఎన్జీవో భవన్‌కు తాళం వేయొద్దు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీ ఎన్జీవో భవన్ లోని నాలుగు గదు లు, సమావేశ మందిరం తాళా లను తమకు అప్పగించ లేదని పేర్కొం టూ ఏపీఎన్జీవో సంఘం దాఖలు చేసిన కోర్టు ధిక్కారణ కేసుపై హైకోర్టు విచారణ ముగించింది. అలాగే ఏపీ ఎన్జీవో సంఘంలో చేరిన 660 మంది సభ్యత్వ రుసుము కింద రూ.2,31, 000 డిమాండ్ డ్రాఫ్టును, గదులకు వేసిన తాళం చెవులను భాగ్యనగర్ టీఎన్జీవో సంఘం తరపు న్యాయ వాది హైకోర్టుకు సమర్పిం చారు. దీంతో భవనంలోని గదులకు తాళం వేయరాదని హైకోర్టు ఏపీ ఎన్జీవోల సంఘానికి సూచించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ , జస్టిస్ జె. ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు . గన్ ఫౌండ్రీ లో ఉన్న ఏపీ ఎన్జీవో భవన్ లోని నాలుగు గదులు, ఒక సమావే మందిరానికి వేసిన తాళాలను భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవో సంఘం తమకు అప్పగించలేదని పేర్కొంటూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ బాబు కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

రేపో మాపో విస్తరణ!

• అన్నా డీఎంకే బ్రేకులు • ఐదుగురికి పదోన్నతులు • రైల్వేశాఖపై జేడీ(యూ)కన్ను • సామాజిక సమీకరణాల కంటే సమర్థతకే పెద్దపీట



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు అన్నా డీఎంకే పార్టీ నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆ పార్టీలో రెండు చీలిక వర్గాలను ఏకం చేసినప్పటికీ, రాజకీయ సంక్షోభం ఇంకా ఒక కొలిక్కి రాకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. పళనిస్వామి, పన్నీరుసెల్వం వర్గాలు విలీనమైనప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు. పార్టీలో కొందరు ఇప్పటికీ శశికళ వర్గం నేత టీటీవీ దినకరన్‌కు మద్దతు తెలపడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. సుమారు 23 మంది ఎమ్మెల్యేలు దినకరన్‌కు బహిరంగంగానే మద్దతు ప్రకటిస్తూ, ముఖ్యమంత్రిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేయగా, ఇంకా చాలామంది 'స్లీపర్ సెల్స్'గా ఉన్నారంటూ దినకరణ్ బాంబు పేల్చాడు. ముఖ్యమంత్రిపై అవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ బలపరీక్ష నిర్వహించాల్సిందిగా దినకరన్ వర్గం గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావును కోరినప్పటికీ, ఆయన నిరాకరించి తాత్కాలికంగా సమస్యను గట్టెక్కించారు. అయితే ఇప్పుడు దినకరన్ వర్గానికి తోడు డీఎంకే పార్టీ కూడా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ద్వారా బలపరీక్షకు సిద్ధమవడం అన్నా డీఎంకే వర్గాన్ని కలవరపెడుతోంది. మొత్తం పార్టీలో నెలకొన్న ఈ అంతర్గత సమస్యలతో కేంద్ర కేబినెట్ విస్తరణకు జాప్యం జరుగుతోంది. నిజానికి సోమ, మంగళవారాల్లోనే కేంద్ర కేబినెట్ విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు గతంలోనే వెల్లడించాయి. అయితే అన్నా డీఎంకేలో నెలకొన్న సంక్షోభమే ఈ కాస్త జాప్యానికి కారణమవుతుందని, అయినా సరే సెప్టెంబర్ 1 లేదా 2 తేదీల్లో కేంద్ర కేబినెట్ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ ఉంటాయని ప్రభుత్వంలో సీనియర్ నేతలు చెబుతున్నారు. ఈసారి విస్తరణలో అన్నా డీఎంకేతో పాటు జేడీ(యూ) కూడా చేరనున్న విషయం తెలిసిందే. ఈ రెండు పార్టీలతో పాటు ఎన్సీపీ సైతం చేరుతుందన్న కథనాలు వినిపిస్తున్నాయి.

అన్నా డీఎంకేతో బహుళ ప్రయోజనాలు

అయితే పార్లమెంటు ఉభయ సభల్లో 50 మంది సభ్యుల బలం ఉన్న అన్నా డీఎంకేని చేర్చుకోవడం ద్వారా ఎన్డీయేకు బహుళ ప్రయోజనాలున్నాయని నేతలు విశ్లేషిస్తున్నారు. రాజ్యసభలో పూర్తిస్థాయిలో బలం లేని ఎన్డీయేకు, అన్నా డీఎంకే ద్వారా ఏకంగా 12 మంది సభ్యుల బలం పెరుగుతుంది. ప్రభుత్వం తీసుకొచ్చే అనేక బిల్లులకు బ్రేకులు వేస్తున్న రాజ్యసభలో బలం పెంచుకోవడంపై దృష్టి పెట్టిన బీజేపీకి అన్నా డీఎంకే పార్టీ ఒక పెద్ద అవకాశంగా నిలుస్తోంది. ఇదిలా ఉంటే తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లో బీజేపీకి బలం పెంచుకోడానికి అన్నా డీఎంకేతో పొత్తు లాభిస్తుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. తమిళనాడులో బీజేపీకి క్యాడర్ లేకపోయినా ప్రధాని మోడీ పట్ల జనంలో అభిమానం ఉందని వారంటున్నారు. ఈ అభిమానాన్ని ఓట్లుగా మలచుకోవాలంటే పార్టీని రాష్ట్రంలో నలుమూలలకూ విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అయితే, ద్రవిడ పార్టీల ప్రాబల్యం ముందు జాతీయ పార్టీలకు ఏమాత్రం స్థానం లేని తమిళ రాజకీయాల్లో బీజేపీని విస్తరించడం ఏమంత సాధారణ విషయమేమీ కాదు. అందుకే అన్నా డీఎంకే వంటి ద్రవిడ పార్టీతో కలిసి పార్టీ విస్తరణపై బీజేపీ కన్నేసింది. అందులో భాగంగానే కేంద్ర కేబినెట్‌లో అన్నా డీఎంకేకు చోటు కల్పించాలని నిర్ణయించింది.

రైల్వే శాఖపై జేడీ(యూ) కన్ను

కేంద్ర కేబినెట్‌లో ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి బెర్తులు ఖరారు చేసుకున్న జేడీ(యూ) పార్టీ ఏకంగా రైల్వేశాఖపైనే కన్నేసినట్టు తెలుస్తోంది. వరుస రైలు ప్రమాదాలతో మనస్తాపం చెంది రాజీనామా సిద్ధపడిన సురేశ్ ప్రభు వ్యవహారంతో ఈ శాఖ మార్పిడి ఖాయమని తెలుస్తోంది. అయితే రైల్వేశాఖపై బిహారీలకు ఉన్న ఆసక్తి చాలా ఎక్కువ. గతంలో లాలూ ప్రసాద్ ప్రసాద్ యాదవ్ కూడా యూపీఏ హయాంలో రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. జేడీ(యూ) కూడా ఆనవాయితీ కొనసాగిస్తూ రైల్వే మంత్రి పదవి కోసం పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. జేడీ(యూ) నుంచి కేంద్ర మంత్రి పదవుల కోసం ఇద్దరి పేర్లను ఖరారు చేసింది. ఆ పార్టీ రాజ్యసభ నేత రామచంద్ర ప్రసాద్ సింగ్‌తో పాటు పూర్ణియా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైన సంతోష్ కుమార్ కష్వాహా పేర్లను ఆ పార్టీ ప్రతిపాదించగా, ఇద్దరికీ పాలనా అనుభవం లేకపోవడం వల్ల కీలకమైన రైల్వే శాఖను ఇవ్వకపోవచ్చని తెలుస్తోంది. కేబినెట్ పదవి కాకపోయినా కనీసం సహాయ మంత్రి పదవైనా ఇవ్వాలని పట్టుబడుతున్నట్టు సమాచారం.

సమర్థతకే పెద్దపీట


మంత్రి పదవుల పంపకంలో సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను బేరీజు వేసుకోవడం సర్వసాధారణం. అయితే ఈసారి మంత్రి పదవుల పంపకం పూర్తిగా సమర్థతకే ప్రాధాన్యతనిస్తారని తెలుస్తోంది. మరోవైపు సరైన పనితీరు కనబర్చని కేంద్ర మంత్రులకు ఉద్వాసన పలికి పార్టీ బాధ్యతలు లేదా మరే ఇతర బాధ్యతలైనా అప్పగించే అవకాశముంది. ఈ క్రమంలో 75 ఏళ్లు పైబడిన కారణంగా కల్‌రాజ్ మిశ్రా, పార్టీ బాధ్యతలు అప్పగించాలన్న ఉద్దేశంలో భాగంగా రాజీవ్ ప్రతాప్ రూఢీ, నిర్మలా సీతారామన్, జేపీ నడ్డా, సరైన పనితీరు లేనందున సంజీవ్ కుమార్ బల్యాన్, కృష్ణరాజ్‌లకు ఉద్వాసన పలికే సూచనలు కనిపిస్తున్నాయి. అలాగే సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన 13 మంది సహాయ మంత్రులకు పదోన్నతులు లేదా మరింత కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రదాన్, రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్, ప్రకాశ్ జవడేకర్, జితేంద్ర సింగ్‌లకు ప్రమోషన్ ఇవ్వాలని ప్రధాని మోడీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో ప్రకాశ్ జవడకేర్ గత కేబినెట్ విస్తరణలోనే సహాయ మంత్రి నుంచి కేబినెట్ మంత్రిగా పదోన్నతి పొందగా, ఈ సారి మరింత కీలకమైన శాఖను అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తాతయ్యకు ఆ ముద్దు సీన్లు పంపండి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అర్జున్‌రెడ్డి సినిమాపై వివాదస్పద దర్శకుడు వర్మ మరో సారి స్పందించాడు. ఈ మేరకు తన ఫేస్‌బుక్ అకౌంట్‌లో పోస్ట్ చేశాడు. సినిమాపై కాంగ్రెస్ నేత వీహెచ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి విదితమే. ఆ పోస్టులో వర్మ సమస్య పరిష్కార కోసమంటూ చిత్ర యూనిట్‌కి ఒక సలహా ఇచ్చారు. అదేంటో ఆయన మాటల్లోనే. . అర్జున్‌రెడ్డి సినిమాలోని ముద్దు సీన్లన్నీ బ్యాక్ టు బ్యాక్ కట్ చేసి ఓ పెన్ డ్రైవ్‌లో వీహెచ్ తాతయ్యకు ఇచ్చేయండి. ఆయన వాటిని ఇంట్లో తన రూమ్‌లో ఒక్కరే చూసుకుని తప్పకుండా చిల్ అవుతారని అన్నారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం టెన్షన్ స్కీంగా మారింది



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) టెన్షన్ స్కీంగా మారిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్ రెడ్డి ఆరోపించారు. వారికి పదవ పీఆర్‌సీ ప్రకారం పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. బుధవారం శాసనసభ మీడియా హాలులో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.సీపీఎస్ స్కీం ద్వారా మీసాల భూమయ్య అనే రిటైర్డ్ ఉద్యోగికి కేవలం 650 రూపాయల పెన్షన్ మాత్రమే వస్తోందని ఆయన కుటుంబం అంత చిన్న మొత్తంతో బతుకుతుందని ప్రశ్నించారు. సీపీఎస్ విధానం రద్దుకై సెప్టెంబర్ 1 న ఉద్యోగులు సాముహిక సెలవులు తీసుకుంటున్నారని, అదే జరిగితే ప్రభుత్వం స్తంభిస్తుందని వంశీచంద్ రెడ్డి హెచ్చరించారు.

ఎగ్జిబిషన్ సొసైటీ లీజు రద్దు దుర్మార్గం- విహెచ్

ఎగ్జిబిషన్ సొసైటీ స్థలం లీజు రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా పీసీసీ మాజీ అధ్యక్షుడు వి హనుమంతరావు అన్నారు. సొసైటీ స్థలం రద్దుతో వేలాదిమంది విద్యార్థులు, ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.ఈ భూమి జోలికి వస్తే సహించే ప్రసక్తిలేదని, వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని విహెచ్ డిమాండ్ చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా రాదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: భూరికార్డులను సరిచేస్తామంటే కాంగ్రెస్ నాయకులు ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావడం లేదని, కాంగ్రెస్ నేతలు దిక్కుమాలిన మైండ్‌గేమ్‌లు ఆపి వెనక తిరిగే పదిమందైనా మిగులుతారో లేదో చూసుకోవాలని మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. బుధవారం దీనికి సంబంధించి ఆయన ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులు భ్రమల్లో బతుకుతూ ప్రజలను భ్రమపెట్టాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చైతన్యవంతమైన తెలంగాణ ప్రజల ముందు కాంగ్రెస్ కపట నాటకాలు పనిచేయవన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇవే మటలను 2014 ఎన్నికలకు ముందు కూడా చెప్పారని, ఫలితం చూశారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షహోదా కూడా దక్కదన్నారు. కాంగ్రెస్ ప్రతి పనిని కోర్టుకు పోయి అడ్డుకుంటున్నదని, తాము చెప్పిన మాటలు అక్షర సత్యాలని రుజువైందన్నారు. తాము స్వచ్ఛందంగా రైతుసంఘాలను, రైతు సమన్వయసమితులను ఏర్పాటుచేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పాటుచేయబోతున్న వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నించడం.. కోర్టుకెళ్తామని చెప్పడం వీరి నైరాశ్యానికి నిదర్శనమన్నారు. రైతులకు మేలు జరుగుతుంటే కాంగ్రెస్ నాయకులకు ఎందుకింత కండ్లమంటో అర్థం కావడం లేదన్నారు. రైతుకు కావాల్సిన కరెంట్ ఇస్తామంటే ఓర్వరు.. ఎకరాకు రూ.8వేల పెట్టుబడి ఇస్తామంటే ఓర్వరు.. ప్రాజెక్టులు కడతామంటే అడ్డుకోవాలని చూస్తరు.. చెరువులు పునరుద్దరిస్తామంటే గుండెలు బాదుకుంటరు.. ఇదెక్కడి అన్యాయం అని ఆయన అన్నారు. రైతులు టిఆర్ఎస్ వైపు ఉంటే రాజకీయ ఇబ్బంది అన్న ఏకైక కారణంతో రైతుకు నష్టం చేసే పనిచేస్తరా అని హరీష్‌రావు ప్రశ్నించారు. తమ ప్రభుత్వం రైతుల బాధలు తెలిసిన ప్రభుత్వమని, ముఖ్యమంత్రిగా కెసిఆర్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రైతుల కోసమే ఆలోచిస్తున్నారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కంకణం కట్టుకుని ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. నిరాశనిస్పృహలు తారాస్థాయికి చేరడంతో మరింత దిగజారి టిఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని కాంగ్రెస్ నాయకులు అబద్దపు ప్రచారం చేస్తున్నారని మంత్రి హరీష్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు పగటికలలు కంటున్నారన్నారు.

అభివృద్ధి చెందిన దేశాన్ని కలాం కోరుకునేవారు



అబ్దుల్ కలాం 2వ స్మారకోపన్యాసంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఏపీజే అబ్దుల్ కలాం వినూత్నమైన అభివృద్ధి విధానాల మార్గంలో ప్రయాణించిన అసమాన వ్యక్తి అని ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు కొనియాడారు. ఢిల్లీలో ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన 2వ అబ్దుల్ కలాం స్మారకోపన్యాసంలో ఆయన ప్రసంగించారు. అత్యంత సామాన్యమైన కుటుంబం నుంచి వచ్చిన డా. కలాం చిన్నతనంలో కుటుంబ పోషణకు సహాయపడేందుకు ఇంటింటికీ దినపత్రికలను పంచేవారని వెంకయ్య నాయుడు అన్నారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితులలో అత్యున్నతమైన విద్యనభ్యసించారని, ఒక అత్యున్నతమైన మిసైల్ శాస్త్రవేత్తగా ఎదిగారని ఉపరాష్ట్రపతి గుర్తు చేసారు. తదుపరి భారత రాష్ట్రపతిగా పనిచేసారని అన్నారు. ఒక సామాన్యమైన వ్యక్తిని దేశానికి రాష్ట్రపతిని చెయ్యడం మన దేశంలోని అత్యుత్తమమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనమని అన్నారు.

కలాం ఎంతటి ఉన్నతమైన పదవిని అధిష్టించినా, అత్యంత సామాన్యమైన జీవనాన్ని గడిపారని, ఉన్నతమైన అధికారి అయినా లేదా అత్యంత సామాన్యమైన ఉద్యోగి అయినా ఒకే రకమైన ప్రేమాభిమానాలను చూపేవారని అన్నారు. డా. కలాం భారత్‌ను 2020 నాటికి ఒక మార్పు చెందిన దేశంగా, పూర్తిగా అభివృద్ధి చెంది ఇతర అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలపాలని అనేవారు. దీనినే ఆయన విజన్ 2020 అని పిలిచేవారని ఉపరాష్ట్రపతి చెప్పారు. 90 వ దశకంలో ఆయన టెక్నాలజీ ఇన్ఫర్మేషన్, ఫోర్‌క్యాస్టింగ్ అండ్ అసెస్మెంట్ కౌన్సిల్ చైర్మన్‌గా ఉన్నపుడు టెక్నాలజీ విజన్ ఫర్ ఇండియా అప్ టు 2020 అనే కీలకమైన పత్రం రూపకల్పనలో ఆయన ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు.

డా. కలాం విజన్ 2020 దేశంలోని పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య దూరాన్ని బాగా తగ్గించేందుకు ఉద్దేశించినది భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. విద్యుత్తు, నాణ్యమైన తాగునీరును సమానంగా మరియు సరిపడునంతగా పంచాలని, అలాగే వ్యవసాయం, పరిశ్రమలు మరియు సేవల రంగం సమానంగా విస్తరింపచెయ్యాలని కలాం పేర్కొన్నట్టు వెంకయ్య వెల్లడించారు. దీంతో పాటు సామాజిక లేదా ఆర్థిక వివక్ష లేకుండా అందరికీ విలువలతో కూడిన విద్యాభ్యాసం జరగాలని, నైపుణ్యంగల స్కాలర్లు, సైంటిస్టులు మరియు పెట్టుబడిదారులకు సమానమైన అవకాశాలు కల్పించాలని కూడా పొందుపరిచినట్టు ఆయన వెల్లడించారు. అలాగే అందరికీ అత్యుత్తమమైన ఆరోగ్యసేవలు అందాలని, స్పందించే, పారదర్శకమైన మరియు అవినీతి రహిత ప్రభుత్వం ఉండాలని ఆయన కోరుకున్నట్టు వెంకయ్య నాయుడు తెలిపారు. పేదరికాన్ని పూర్తిగా రూపుమాపాలని, నిరక్షరాస్యతను పారద్రోలాలని, స్త్రీలు మరియు పిల్లలపై నేరాలు జరగకూడదని మరియు సమాజంలో ఏ ఒక్కరూ ఒంటరిననే భావన కలగ కూడదని కలాం కోరుకునేవారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ఒక అభివృద్ధి చెందిన, ఆరోగ్యవంతమైన మరియు ఉగ్రవాదానికి దూరంగా ఉండే దేశాన్ని ఆయన కోరుకున్నారని వెంకయ్య అన్నారు.

రహదారులతోపాటే చెక్ డ్యాంలు



(మొదటిపేజీ తరువాయి)

జాతీయ రహదారుల విస్తరణకు మార్గం సుగమమైంది. దీంతో రాష్ట్రంలో జాతీయ రహదారుల సఫుటు 4.62 కిలోమీటర్లకు చేరనుంది. తద్వారా జాతీయ సఫుటులో దేశంలో ఐదో స్థానానికి చేరనుంది.

రాష్ట్రంలో రహదారుల వ్యవస్థ పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా అద్భుతంగా ఆధునికతను సంతరించుకుంటున్నాయి. రాష్ట్ర రహదారుల నిర్మాణంలో భాగంగా మండల కేంద్రాలనుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాలనుంచి రాష్ట్ర రాజధానికి, ఇతర ముఖ్య పట్టణాలకు అనుసంధానంగా నిర్మిస్తున్నారు. నాలుగు వరుసల విస్తరణలో భాగంగా చేపట్టే పనులకు రూ. 15వేల కోట్లను ఖర్చు చేయనుంది. ఈ బృహత్తర కార్యక్రమంలో 532 వంతెనలను పునర్నిర్మించే అవకాశం ఉంది. ఈ వంతెనలకుగానూ ఇప్పటికే ప్రభుత్వం రూ. 2782 కోట్లను కేటాయించింది. ఈ వంతెన నిర్మాణాల్లో ఆర్ అండ్ బీ శాఖ విశిష్టతలను చూపుతోంది. వంతెనలతో అనుసంధానంగా చెక్‌డ్యాంలను కూడా నిర్మించాలని నిర్ణయించారు. చెక్‌డ్యాంల ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం డిజైన్‌ల రూపకల్పన, నిర్మాణ ప్రక్రియలో మెళకువలను అధ్యయనం చేసేందుకు మహారాష్ట్రకు ఉన్నతస్థాయి బృందాన్ని పంపింది. ఈ బృందం సిఫార్సుల మేరకు 174 ప్రాంతాల్లో చెక్ డ్యాంల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటికి రూ. 520.6కోట్ల వ్యయం కానుందని అంచనా.

చెక్‌డ్యాంలతో వినూత్న ప్రయోగం...

నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో చెక్ డ్యాంలను వర్షపు నీటి సంరక్షణకు ఆనకట్టల వలె ఉపయోగిస్తారు. అయితే వంతెనల నిర్మాణంలో చెక్ డ్యాంలను ఏర్పాటు చేయడం వినూత్నమే. సీఎం స్వీయ ఆదేశాలతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వంతెనల నిర్మాణ క్రమంలో 12నుంచి 15 శాతం అదనపు ఖర్చుతో అదనపు వనరుల అవసరం లేకుండానే వీటిని నిర్మించవచ్చని గుర్తించారు. వీటి నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుదలకు నమోదయినట్లు గుర్తించారు. పశుపక్ష్యాదులకు తాగునీటి కొరత తీరే అవకాశం కూడా మెండుగానే ఉంది. పచ్చదనం మెరుగకు ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పర్యావరణానికి ఎంతె మేలు కల్గుతుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

బాబుతో నేడు టీడీపీ తెలంగాణ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో గురువారం అమరావతిలో టీటీడీపీ నేతలు ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టత, తెలంగాణలో తెరాస ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు, రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, తెదేపా రాష్ట్ర కమిటీ కూర్పుపై చర్చించనున్నారని సమాచారం. అలాగే ప్రతిష్టాత్మకమైన నంద్యాల ఉపఎన్నికల్లో పార్టీ విజయం సాధించిందుకు చంద్రబాబును ఈ సందర్భంగా టీటీడీపీ నేతలు అభినందనలు తెలుపనున్నారు.


మొబైల్ లాటరీ పేరిట కుచ్చుటోపి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మొబైల్ లాటరీ పేరిట ఆన్‌లైన్ మోసానికి పాల్పడ్డ ఖతర్‌లో నివసిస్తూ కేరళకు చెందిన హమ్జా ఒతుకమ్ అనే నిందితుడ్ని సీఐడీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐడీ పోలీసుల కథనం ప్రకారం బాధితుడికి మే 19,2014 బాధితుడికి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. బాధితుడికి వచ్చిన ఫోన్ కాల్ నెంబర్ 00923074934393. బాధితుడికి కాల్ చేసిన వ్యక్తి 25 లక్షల లాటరీ ఆఫర్ చేశాడు. అందుకు గాను రూ.25,000 డిపాజిట్ చేయాలని కోరాడు. ఇది లాటరీ పొందేదుకు ఉపయోపడుతుందని బాధితుడికి నమ్మబలికాడు. అతడి మాటలు విశ్వసించిన బాధితుడు అతడిచ్చిన బ్యాంకు ఖాతాలో ఆ మొత్తాన్ని డిపాజిట్ చేశాడు. మూడు నెలల తర్వాత బాధితుడిని రూ.11 లక్షలు డిపాజిట్ చేయాలని లాటరీ మొత్తం 25 లక్షల నుంచి కోటి రూపాయలు వచ్చేలా చేస్తానని తెలిపాడు.

దీంతో సదరు బాధితుడు 11 లక్షల రూపాయలను నిందితుడి అందజేసిన వివిధ బాంకు అకౌంట్లలో జమ చేశాడు. తర్వాత ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ కేసు సైబర్ క్రైమ్స్ సీఐడీ విభాగానికి బదిలీ అయింది. ఆ కేసులో దర్యాప్తు ప్రారంభించిన సీఐడీ పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు గతంలో కూడా అరెస్టయినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. ఇటువంటి మోసాల పట్ల జాగరూకత పాటించాలని సీఐడీ ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు.

నేడే నింగిలోకి పీఎస్ఎల్వీ సీ -39

నెల్లూర్లు, ఆగస్టు 30, కెఎన్ఎన్‌బ్యూరో : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి భారత అంతరిక్షపరిశోధనా సంస్థ(ఇస్రో) పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ) సీ-39 ప్రయోగానికి సర్వం సిద్ధం చేసింది. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోని శ్రీహరికోటలోని 2వ ప్రయోగ వేదిక నుంచి గురువారం సాయంత్రం 6.59 నిమిషాలకు పీఎస్ఎల్వీ రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకుపోనుంది. ఈ ప్రయోగానికి సంబంధించి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కౌంట్‌డౌన్ కూడా ఇస్రో శాస్త్రవేత్తలు ప్రారంభించారు. పీఎస్ఎల్వీ ప్రయోగరంగంలో భాగంగా 41వ సారి మరో భారీ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ నౌక అంతరిక్షంలోకి మోసు కుపోనుంది. ఈ రాకెట్ ద్వారా ఇప్పటివరకు చేపట్టిన ప్రయోగాల్లో ఒకటి మినహా మిగిలిన ప్రయోగాలన్నీ సూపర్ సక్సెస్ అయ్యాయి. దీంతో కీలకమైన సమాచార వ్యవస్థకి చెందిన ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ప్రక్రియలో భాగంగా ఆరంభంలో పంపినన ఐఆర్ఎస్ఎస్ఎన్-1 ఉపగ్రహంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో ఆ స్థానంలో ఐఆర్ఎస్ఎస్ఎన్-1 హెచ్ ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ సీ-39 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. 1400 కేజీల బరువు ఉన్న సమాచార ఉపగ్రహాన్ని భారతనౌక 18 నిమిషాల్లో నిర్ణీత కక్ష్యలోకి తీసుకువెళ్ళనుంది. అనంతరం మరో 2.19 నిమిషాల్లో శాస్త్రవేత్తలు ఉపగ్రహాన్ని ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టనున్నారు.



ప్రయోగం ఇలా...

షార్‌లోని 2వ ప్రయోగ వేదిక నుంచి 44.4 మీటర్ల ఎత్తు, 320 టన్నుల బరువుతో తన యాత్రను ప్రారంభించనున్న భారతనౌక మొత్తం 4 దశలను అధిగమించి నిర్ణీత కక్ష్యలోకి చేరుకోనుంది. మొదటి దశలో 138 టన్నుల ఘన ఇంధనంతోను, 7.6 టన్నుల ఘన ఇంధనంతో పాటు 42 టన్నుల ద్రవ ఇంధనం, 2.8 సామర్థ్యం ఉన్న మోటార్ల సాయంతో 2వ దశను అధిగమిస్తుంది. తరువాత 12.5 టన్నుల ఘన ఇంధనంతో పాటు 6 స్ట్రాఫాన్ బుస్టర్ల సాయంతో కీలకదశను అధిగమిస్తుంది. ఆ తరువాత చివరిదైన 4వ దశలో రాకెట్‌లో అమర్చిన మోటార్లసహాయంతో ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెడుతారు.

ఏపీ ఒలింపిక్ ఎన్నికల రికార్డులను సమర్పించండి

హైదరాబాద్,ఆంధ్రప్రభ : గత ఎన్నికలకు సంబంధించిన రికార్డులను కోర్టుకు సమర్పించాలని పార్లమెంట్ సభ్యుడు గల్లా జయదేవ్ నాయకత్వం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. 2015 ఏప్రిల్ 4న జరిగిన ఎన్నికల్లో ఎంత మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారు ఏ రిజిస్టర్ సొసైటీకి చెందిన వారు, తదితర వివరాలు సమర్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ)అధ్యక్షుడు రామచంద్రన్ కుమారుడు జయదేవ్ జయదేవ్ కంపెనీలో డైరెక్టర్ గా పనిచేస్తున్న కారణంగా ఏపీ ఒలింపిక్ సంఘాన్ని అసలైన సంఘంగా గుర్తింపు ఇచ్చారని పిటిషనర్ ఆరోపించారు. అదే నిజమైతే ఐఓఏ అధ్యక్షుడి అధికార పరిధిని తీసేసి తాము పరిశీలిస్తామని హైకోర్టు పేర్కొంది. ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌ను సొసైటీ రిజిస్ట్రేషన్ చట్ట ప్రకారం 2016 లో రిజిస్ట్రేషన్ చేస్తే 2015 ఏప్రిల్ 4న సంఘానికి ఎలా ఎన్నికలు నిర్వహించారని హైకోర్టు ప్రశ్నించింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ..రాష్ట్ర విభజన నేపథ్యంలో అప్పటి వరకు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్‌ను రెండుగా విభజించి తెలంగాణకు, ఏపీకి వేర్వేరుగా ఎన్నికలు నిర్వహించాలని పరిశీలకుడిని ఐఓఏ ఆదేశిస్తే కేవలం ఏపీకి మాత్రమే ఎన్నికలు ఎందుకు నిర్వహించారని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

నేరెళ్ల ఘటనపై ప్రమాణ పత్రం దాఖలు


హైదరాబాద్,ఆంధ్రప్రభ : కరీంనగర్ జిల్లా, నేరెళ్ల గ్రామంలో దళితులపై జరిగిన పోలీసుల దాడి ఘటనపై తెలంగాణ సర్కారు సంబంధిత పత్రాలతో పాటు పూర్తి సమాచారాన్ని ప్రమాణ పత్రం రూపంలో హైకోర్టుకు సమర్పించింది. మరో ప్రజాహిత వ్యాజ్యంలో ప్రమాణ పత్రం దాఖలు చేయాలని హైకోర్టు తెలంగాణ హోంశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. ఈ ఘటనలో ఎస్.ఐ ని సస్పెండ్ చేసిన కారణాలను తెలంగాణ హోంశాఖ ముఖ్యకార్యదర్శి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారా, లేదా అని హైకోర్టు తెలంగాణ అడ్వకేట్ జనరల్ ను ప్రశ్నించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవి లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాలపై తదుపరి విచారణ వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి నేరెళ్ల ఘటనకు దారితీసిన పరిస్థితులు, కారణాలను ప్రమాణ పత్రం రూపంలో వివరిస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి సిద్ధం చేసిన నివేదికను, సంబంధిత పత్రాలతో పాటు ధర్మాసనానికి సమర్పించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వి.రఘునాథ్‌కు కూడా దీని ప్రతిని అందజేస్తామని టీఏజీ తెలిపారు. నేరెళ్ల ఘటనలో గాయపడిన వారికి రూ.10 లక్షలు పరిహారంగా చెల్లించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థిస్తూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ రాసిన లేఖను కూడా హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించి, విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే.

హైదరాబాద్‌పై స్వైన్‌ఫ్లూ పంజా

హైదరాబాద్, కెఎన్ఎన్ : స్వైన్ ఫ్లూ మహమ్మారి వాతావరణాలకు అనుగుణంగా తన శక్తిని పెంచుకుంటూ ఎండా, వాన అనే తేడా లేకుండా ప్రజలపై పంజా విసురుతుంది. తాజాగా సికింద్రాబాద్ నామాలగుండు ప్రాంతానికి చెందిన గణేశ్(65) తీవ్ర అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. ఎంతకీ వ్యాధి నయం కాకపోవడంతో కుటుంబ సభ్యులు ఈనెల 28వ తేదీన గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అన్ని పరీక్షలు జరిపిన వైద్యులు స్వైన్ ఫ్లూ వైరస్ సోకిందని నిర్ధారించి, తగిన చికిత్స అందించారు. స్వైన్ ఫ్లూతో పాటు ఇతర అనారోగ్యాల కారణంగా గణేశ్ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడని స్వైన్ ఫ్లూ విభాగం వైద్యాధికారి డాక్టర్ నరేందర్ తెలిపారు. స్వైన్ ఫ్లూ వైరస్ ప్రభావం ఉన్న వారు ఏడుగురు చికిత్స పొందుతుండగా ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, అతనిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్సలు అందిస్తున్నట్లు వారు తెలిపారు. మిగిలిన వారికి మెరుగైన వైద్య అందజేస్తున్నట్లు గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రవణ్ తెలిపారు. వ్యాధి లక్షణాలు కనపడగానే వెంటనే గాంధీ ఆసుపత్రికి లేదా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందాలని సూచించారు. చేతుల శుభ్రతతోపాటు జనసంచారం ఎక్కువగా ఉన్న చోట ముక్కుకు మాస్క్ ధరించడం ఉత్తమమని వైద్యులు సూచించారు.

ఎగ్జిబిషన్ సొసైటీ భూముల లీజు రద్దు అవాస్తవం

ఆర్థిక మంత్రి ఈటల వెల్లడి



హైదరాబాద్, ఆంధ్ర ప్రభ: హైదరాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ భూముల లీజును రద్దు చేయలేద ని ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు, ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. భూముల లీజు గడువు 1986లోనే ముగిసిందన్నారు. లీజును పొడిగించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. కొంత మంది గిట్టని వారు ఎగ్జిబిషన్ సొసైటీ భూముల లీజును తెలంగాణ ప్రభుత్వం రద్దు చేసిందనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి వాటిని నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఎగ్జిబిషన్ సొసైటీ భూముల లీజును పొడిగించే పనిలో ప్రభుత్వ శాఖలు ఉన్నాయని ఒక ప్రకటనలో ఈటల రాజేందర్ వివరించారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ 76 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతి ఏటా నిర్వహించే పారిశ్రామిక ప్రదర్శనకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని తెలిపారు.

పోలవరానికి రూ. 980 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.980 కోట్ల రూపాయలను విడుదల చేసింది. ఈ ప్రాజెక్టుకయ్యే మొత్తం వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నివేదికలు పంపిస్తే అందుకనుగుణంగా నిధులను విడుదల చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడు పోలవరం ప్రాజెక్టుకు ఖర్చు పెడుతున్న నిధులను సత్వరం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరిన సంగతి విదితమే. రాష్ట్రానికి చెందిన కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయమంత్రి వై.సత్యనారాయణ చౌదరి మంత్రి అరుణ్‌జైట్లీతో సంప్రదింపులు జరిపి నిధుల విడుదలకు ఒత్తిడి తెచ్చారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు రాష్ట్రప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేసిందని ఆయన మంత్రితో జరిగిన చర్చల సందర్భంగా చెప్పారు. కేంద్ర జలవనరుల సంఘానికి అందిన నివేదిక ఆధారంగా బుధవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల నిమిత్తం ఖర్చు చేసిన మొత్తంలో రూ.980 కోట్లను విడుదల చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఐదు విడతల్లో పోలవరానికి కేంద్రం ఖర్చుచేసిన వ్యయంలో కొంత మొత్తాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేపట్టే ఆందోళనకు తమ పార్టీ మద్దతు ప్రకటిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్రిపుర, బెంగాల్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానమే అమలవుతోందన్నారు.

'డ్రగ్స్'పై రెండో జాబితా సిద్ధం

- వచ్చే నెలలో విడుదలకు సన్నాహాలు
- లిస్ట్‌లో సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు
- మూలాలపై ఎక్సైజ్‌శాఖ అన్వేషణ
- డ్రగ్స్ అడ్డాలపై పటిష్ట నిఘా



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇటీవల డ్రగ్స్ వ్యవహారం రాష్ట్రంలో పెను కలకలం రేపింది. రాజధాని లోనే కాదు డ్రగ్స్ సరఫరా పలు జిల్లాల్లో కొనసాగుతున్నట్లు వార్తలొచ్చాయి. దీంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో ఎక్సైజ్ శాఖ త్రిముఖ వ్యూహం అనుసరిస్తోంది. ఓ వైపు డ్రగ్స్ మూలాలపై అన్వేషణ సాగిస్తూ.. మరోవైపు డ్రగ్స్ వాడకం, సరఫరాదారుల గుర్తింపు పనిలో పడింది. ఇంకోవైపు అవగాహన కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోంది. డ్రగ్స్ కేసులో కీలక నిందితులు కాల్విన్, మైక్ కమింగా, గాబ్రియేల్, విజయవాడకు చెందిన లేడీ డాన్ సంగీత నుంచి కీలకమైన సమాచారాన్ని ఎక్సైజ్ సిట్ రాబట్టింది. వారి ఫోన్ కాల్స్ డేటాను నిశితంగా విశ్లేషించారు. కాల్విన్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా డ్రగ్స్ కేసులో ప్రమేయముందని భావించి టాలీవుడ్‌కు చెందిన 12 మంది సినీ స్టార్స్‌ను ఎక్సైజ్ కమిషనర్ చంద్రవదన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ నేతృత్వంలో ఏర్పాటైన ఎక్సైజ్ సిట్ ప్రశ్నించింది. వచ్చే నెలలో డ్రగ్స్ కేసులో చర్యలు ఉండబోతున్నట్లు ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ ప్రకటించారు. అదే క్రమంలో టాలీవుడ్‌కు చెందిన మరో 15 మంది ప్రముఖులతో పాటు ఇతర రంగాల(పారిశ్రామికవేత్తలతో సహా)కు చెందిన వ్యక్తులతో కూడిన రెండో జాబితా కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. డ్రగ్స్ మాఫియాలు నగ రంలో పలు కళాశాలల, పాఠశాలల విద్యార్థులను సైతం డ్రగ్స్‌కు బానిసలుగా చేశా రు. 8,9 తరగతి చదివే పాఠశాలల విద్యార్థులు రూ.1250 మందికి పైగా డ్రగ్స్‌కు బానిసలైనట్లుగా ఎక్సైజ్ శాఖ గుర్తించింది. మరోవైపు 18-35 సంవత్సరాల యువ తను టార్గెట్ చేస్తూ వారికి డ్రగ్స్ రుచి చూపించినట్లు ఎక్సైజ్ శాఖ భావిస్తోంది. ఖరీ దైన డ్రగ్స్‌ను తొలుత ఉచితంగా అందజేసి మరీ కళాశాలలు, పాఠశాలల విద్యా ర్థులను ఈ డ్రగ్స్ మాఫియా డ్రగ్స్‌కు అలవాటు చేసేలా చేసిందని చెబుతున్నారు. చిట్టచివరకు స్పా, మసాజ్ సెంటర్ల మాటున సైతం డ్రగ్స్ దందా కొనసాగడం గమ నార్హం. ఇక్కడ ఒకసారి డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతే డ్రగ్స్ సరఫరాదారులుగా మారుతున్నట్లు ఎక్సైజ్ శాఖ గుర్తించింది. ఈ విధంగా డ్రగ్స్‌కు బానిసలైన కళాశాలలకు చెందిన యువతీ, యువకులకు కౌన్సిలింగ్ నిర్వహించింది. మరోవైపు డ్రగ్స్‌కు బానిసలైన 8,9 తరగతి విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ విచారణకు పిలిచేది లేదని ఎక్సైజ్ కమిషనర్ చంద్రవదన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్‌లు స్పష్టం చేశారు. నైజీరియన్లతో కలిసి డ్రగ్స్ మాఫియాలు చెలరేగిపోయి రాష్ట్రమంతటా యువతను టార్గెట్ చేస్తూ డ్రగ్స్ దందాను కొన సాగించినట్లుగా ఎక్సైజ్ సిట్ విచారణలో వెలుగుచూసినట్లు సమాచారం. డార్క్ వెబ్‌సైట్ ద్వారా డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గోవా, తదితర ప్రాంతా లనుంచి సైతం డ్రగ్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పట్టుబడ్డ డ్రగ్స్ మాఫియా ముఠాలకు అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాలతో సంబంధాలపై ఎక్సైజ్ శాఖ ఆరా తీస్తోంది. విదేశాల నుంచి డ్రగ్స్‌ని రాకుండా అడ్డుకోవడమెలా? అన్న దానిపై ఎక్సైజ్ పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు. ఇంతగా ఎక్సైజ్ శాఖ డ్రగ్స్ కట్టడికీ ఇతోధిక చర్యలు చేపడుతున్నా నగరంలో ఇంకా పబ్‌లు, స్పా,మసాజ్ సెంటర్లలో డ్రగ్స్ వినియోగం రహస్యంగా జరుగుతున్నట్లు వార్తలొస్తున్నాయి. స్పా, మసాజ్ సెంటర్లలోనయితే గుట్టు చప్పుడు కాకుండా కొనసాగిన డ్రగ్స్ దందా కూడా బట్టబయలైంది. బాధిత యువతి ఇచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు కొనసాగించి స్పా, మసాజ్ ముసుగులో కొనసాగిస్తున్న హైటెక్ వ్యభిచారం, డ్రగ్స్ దందా గుట్టు రట్టు చేశారు. కాగా, పోలీసుల కళ్లుగప్పి ఇంకా నగరంలో డ్రగ్స్ లభ్య మవుతూనే ఉందని సమాచారం. సంపన్నుల పిల్లలను టార్గెట్ చేస్తూ డ్రగ్స్ మాఫియాలు చెలరేగిపోయిన సంగతి విదితమే. పబ్‌కల్చర్ ద్వారానే డ్రగ్స్‌సంస్కృతి వికటాట్టహాసం చేసిందని ఎక్సైజ్ సిట్ నిర్ధారించింది.

పబ్‌లు, హోటళ్లపై నిఘా

దీంతో డ్రగ్స్ అడ్డాలుగా మారిన పబ్‌లు తదితరాలపై ఎక్సైజ్ సిట్, పోలీసులు ఉక్కుపాదం మోపారు. పబ్‌లు, హోటళ్లు తదితరాల సమయ పాలనపై ఆంక్షలను కట్టుదిట్టం చేశాయి. గతంలో మాదిరిగా వాటిని నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్న హెచ్చరికలను జారీ చేశాయి. భావిభారత పౌరులైన విద్యార్థులను సైతం డ్రగ్స్ మాఫియాలు తమ ఆర్థిక వనరుగా మార్చుకుని వారిని డ్రగ్స్ బానిసలను చేయడం గర్హనీయం. మరోవైపు పట్టుబడ్డ నిందితుల నుంచి కీలక సమాచారాన్ని ఎప్పటి కప్పుడు పోలీసులు రాబడుతున్నారు. డ్రగ్స్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌ను మార్చేం దుకు తద్వారా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజి పరిరక్షణ దిశగా ఎక్సైజ్ పోలీసులు, పోలీసులు ఇతరత్రా దర్యాప్తు సంస్థలు కృషి చేస్తున్నాయి. ప్రభుత్వం కూడా డ్రగ్స్ కేసులో ఎంతటివారున్నా ఉపేక్షించవొద్దని కఠిన చర్యలు తీసుకోండని ఆయా దర్యాప్తు సంస్థలకు ఆదేశాలనిచ్చిన సంగతి విదితమే.

వరంగల్ నీట్‌లో డ్రగ్స్ కలకలం



ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు

వరంగల్ అర్బన్ క్రైం, కెఎన్ఎన్ : హైదరాబాద్ లో మాదక ద్రవ్యాల వ్యవహారం ఇంకా సమసిపోక ముందే వరంగల్ నిట్ కళాశాల సమీపంలో విద్యార్థులు డ్రగ్స్‌తో పట్టుపడటం నగరంలో సంచలనం సృష్టించింది. ఈ సంఘటనపై ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సురేష్ రాథోడ్ తన కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించి నిందితుల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అందిచిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ విభాగం నేతృత్వంలో స్థానిక కాజీపేట ఎక్సైజ్ సీఐ ప్రవీన్ ఆధ్వర్యంలో గత 10 రోజుల నుండి నిట్ వద్ద నిఘా పెట్టామన్నారు. బుధవారం నిట్ సమీప ప్రాంతంలో ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకొని తనీఖీ చేయగా వారి వద్ద ఎల్ఎస్‌డీ అనే మాదక ద్రవ్యాల కలిగిన 5 స్లీప్స్ గుర్తించామని వాటి విలువ సుమారు 12 వేలు ఉంటుందని తెలిపా రు.పట్టుపడ్డ ఇంజనీరింగ్ విద్యార్థులలో వై.రమేష్ కంప్యూట ర్ సైన్స్ మూడో సంవత్సరం చదువుతుండగా జి. దివిజ్ మెకానికల్ నాల్గవ సంవత్సరం విద్యార్థి అని ఆయన తెలిపా రు. కాగా వీరు హైదరాబాద్ నగరానికి చెందిన వారని గుర్తిం చారు. వీరు నిట్‌లోని వన్ - కే మోగా హస్టల్‌లో ఉంటున్నా రని, వీరిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నామని సురేశ్ రాథోడ్ వివరించారు.

భట్టివి వట్టి మాటలు.. పగటి కలలు

తెరాస ఎమ్మెల్సీ భాను ప్రసాద్ ధ్వజం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: మంత్రులు, ఎమ్మెల్యేలు కాదు.. కనీసం రాష్ట్రంలోని ఒక్క వార్డుసభ్యుడు కూడా టిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ దిక్కు చూసే పరిస్థితి లేదని, వట్టిమా టలు మాట్లాడే భట్టి విక్రమార్క పగటికలలు కంటున్నాడని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ భానుప్రసా ద్ ధ్వజమెత్తారు. బుధ వారం టిఆర్ఎస్ ఎల్పీ కార్యాల యంలో జరిగిన విలేఖరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ పలువు రు మంత్రులు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో టచ్‌లో ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వహయాంలో మంత్రులంతా అవినీతిలో మునిగితేలిన వ్యవహారం బాగా తెలిసిన భట్టి ఈ ప్రభుత్వంలో మంత్రులు అలా ఎందుకు లేరన్న భావనతో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అవినీతి రహితంగా పనిచేస్తున్నట్లు ఆయన వ్యాఖ్యల ద్వారా ఒప్పుకున్నట్లయిం దన్నారు. కాంగ్రెస్ నేతలు కొందరిని కోవర్ట్ ఆపరేషన్ కోసమే టిఆర్ఎస్‌లోకి పంపామని, భట్టి చేసిన వ్యాఖ్యలను భానుప్రసాద్ ఖండించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని, ప్రస్తుత నాయకత్వంలో ముందుకు పోతే ఇపుడున్న సీట్లు కూడా రావని అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బహిరంగంగా చెబుతున్న విషయాన్ని భట్టి గుర్తు పెట్టుకోవాలన్నారు. గతంలో గ్రామాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్దిపొందడం కాంగ్రెస్‌కు అలవాటైన విద్య అని, కానీ ప్రజలను ప్రధానంగా రైతాంగాన్ని సమన్వయం చేసి రైతుసమాఖ్యలు ఏర్పాటుచేస్తుంటే అక్కసు వెళ్ళగక్కుతున్నార న్నారు. భట్టి విక్రమార్క కాంగ్రెస్ పార్టీలో తగ్గుతున్న పరపతిని కాపాడుకునేందు కు ఈ కొత్త డ్రామాకు తెరతీశాడన్నారు. భూసర్వే కార్యక్రమాన్ని వ్యవసాయ, రెవెన్యూ శాఖలు నిర్వహిస్తాయని.. ఇందులో టిఆర్ఎస్ ప్రమేయం ఉండదన్నారు.

రైతు సమితులు వద్దు

- 39 జీవోపై ధర్నా
- జీవో ప్రతుల చించివేత: టీటీడీపీ నిరసన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పటేల్-పట్వారీ వ్యవస్థను తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ రద్దు చేసి తెలంగాణ ప్రజలకు మరో స్వాతంత్రాన్ని ప్రసాదిస్తే, కేసీఆర్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రయత్నాలను మొదలుపెట్టడం పట్ల ఆ పార్టీ తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేసింది. రైతు సమన్వయ సమితిల పేరిట పునరుద్ధరించే ప్రక్రియను తెరాస ప్రభుత్వం చేస్తోందని మండిపడింది. ఈ ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని హెచ్చరించింది. పటేల్, పట్వారీ వ్యవస్థను దొడ్డిదారిన తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెదేపా అల్టిమేటం జారీ చేసింది. ఈ జీవోపై నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద నున్న అంబేదర్క్ విగ్రహం వద్ద తెదేపా రాష్ట్ర పార్టీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు జీవో ప్రతులను చించివేశారు. అనంతరం పార్టీ నేతలు అమర్‌నాథ్‌బాబు, సామారంగారెడ్డి, కూన వెంకటేశ్‌గౌడ్, బిఎన్. రెడ్డి తదితరులు మాట్లాడుతూ, తెరాస ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. రైతుల హక్కులను, మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా, రాజకీయ పక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా, శాసనసభలో చర్చ చేయకుండా జీవో నెంబర్ 39ను సిఎం కేసీఆర్ తీసుకరావడం రాజ్యాంగ విరుద్దమని వారు వ్యాఖ్యానించారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులను పక్కనపెట్టి, నామినేషన్ ప్రక్రియ ద్వారా రైతు సమన్వయ సమితులను తీసుకరావడం కేసీఆర్ తన ఫ్యూడల్ పరిపాలనను సాక్షాత్కారింపచేస్తున్నాడని వారు దుయ్యబట్టారు.

మార్క్సిజానికి ప్రత్యామ్నాయం లేదు

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : సమకాలీన ప్రపంచంలో అనేక మార్పులు చోటు చేసుకున్నప్పటికి మార్క్సిజానికి మరో ప్రత్యామ్నా యం లేదని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కారల్‌మార్క్స్ పెట్టుబడి గ్రంథం 150వ వార్షికోత్సవ సభలో సురవరం మాట్లాడారు. అంతకు ముందు జరిగిన సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాల్లో రెండు తీర్మాణాలు ఆమోదించారు. భూ సమగ్ర సర్వేను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని, నూతన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని ఉపసంహరించుకుని 2004కు ముందున్న పెన్షన్ విధాన్ని అమలు చేయాలని కోరుతూ రెండు తీర్మానాలు చేశారు. ఈసందర్భంగా సురవరం మాట్లాడుతూ మానవాళి విముక్తికి పెట్టుబడి గ్రంథం దిక్సూచి అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

పర్యాటకాభివృద్ధితో ఉపాధికి ఊతం


స్పీకర్ మధుసూదనాచారి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారతీయ చారిత్రక వారసత్వ సంపదను ప్రపంచ దేశాలకు పరిచయంచేసి మన సంస్కృతిని చాటిచెప్పాలని రాష్ట్ర శాసనసభ సభాపతి ఎస్.మధుసూదనాచారి సూచించారు. భారత్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఆ చారిత్రకస్థలాలను వెలుగులోకి తెచ్చి విదేశీ పర్యాటకులను రప్పించాలని ఆయన కోరారు. నగర శివారులోని హెచ్‌ఐసిసిలో జరుగుతున్న కన్వెన్షన్స్ ఇండియా కాన్‌క్లేవ్ 10వ సదస్సులో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ, దేశంలో సుందర ప్రాంతాలు, లోయలు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు ఉన్నాయన్నారు. వీటి ప్రాశస్త్యాన్ని విదేశీయులకు తెలియజేయాలని, భారతీయ సాంస్కృతిక చరిత్రను విస్తరింపజేసి విదేశీ పర్యాటకులను ఆకర్షించాలని సూచించారు. భారత్‌లో పర్యాటక రంగానికి ఎంతో అనువైన అవకాశం ఉందని, దీనికి ప్రచారం కల్పించి పర్యాటకులను ఆకర్షిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, తద్వారా సంపద సృష్టించవచ్చునని ఆయన అన్నారు.భూపాలపల్లి జిల్లాలోని మేడారం సమ్మక్క - సారక్క జాతర ప్రపంచంలోనే అరుదైనదని ఆయన అన్నారు. మూడు రోజులపాటు సాగే ఈ జాతరకు కోటి మంది యాత్రీకులు వచ్చి ఒకేచోట గడుపుతారని, ఈ ప్రత్యేకతను ప్రపంచానికి తెలపాల్సిన అవసరం ఉందని మధుసూదనాచారి అన్నారు. దేశంలో ఉన్న అద్భుత వనరులను పర్యాటక రంగానికి అనుకూలంగా మార్చుకుని జీవనోపాధి కల్పించి తద్వారా దేశ సంపదను పెంచుకునేందుకు అవకాశంగా మలుచుకోవాలని ఆయన సూచించారు.పర్యాటక రంగంలో విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచిందని, జిడిపిలో 10శాతం, దేశీయ ఉపాధిలో 11శాతం ఈ రంగం నుంచే వస్తుందని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ సుమన్ బిల్లా చెప్పారు. ఈ రంగం విస్తరణకు ఎంతో అవకాశం ఉందని, భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేసే సామర్థ్యం ఉందన్నారు. పర్యాటకులకు రక్షణ, అనువైన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడం ప్రధానమని ఆయన అన్నారు. భారత్‌లో రోజుకు 24 కిలోమీటర్ల పొడవైన జాతీయ రహదారులు నిర్మిస్తున్నారని, ప్రతిష్టాత్మకమైన సాగరమాల నిర్మాణంతో దేశ ముఖచిత్రమే మారిపోనుందన్నారు. పర్యాటక కేంద్రాలన్నింటిని కలుపుతూ రవాణా సదుపా యాలు మెరుగుపరుస్తున్నామని, ఇప్పటికే రూ.6వేల కోట్ల ప్రాజెక్టులు మంజూర య్యాయ ని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటి 30 లక్షల మంది విదేశీ పర్యటనలు చేస్తున్నారని, ఇందులో 14శాతం మంది మాత్రమే వ్యాపార, వాణిజ్యాల నిమిత్తం వెళుతున్నారని గైనింగ్ డాట్‌కామ్ సీవోవో రోద్ కమ్మలేశ్వరన్ చెప్పారు. సింగపూర్, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్ దేశాలు పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. పర్యాటక రంగం విస్తరిస్తే ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనం చేకూరుతుందని, దీనికి ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రాజెక్టులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అయితే మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని కమలేశ్వరన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం కూడా పాల్గొన్నారు. ఈ సదస్సులో దేశంలోని కన్వెన్షన్ సెంటర్ల ప్రతినిధులు దాదాపు వందమందికిపైగా పాల్గొన్నారు.

1 నుంచి తెలంగాణ విమోచన యాత్ర

- 7న పాలమూరులో ముగింపు
- 17న భారీ బహిరంగ సభ
- రాష్ట్ర బీజేపీ సన్నాహాలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణ విమోచన యాత్రకు రాష్ట్ర బీజేపీ సిద్ధమవుతుంది. నిజాం ప్రభుత్వం ఏలుబడిలో రాజాకార్ల ఆరాచకాలను ప్రజలకు వివరించేందుకు వారం రోజుల కార్యక్రమానికి కమలం దళం శ్రీకారం చుట్టింది. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చేపట్టే ' తెలంగాణ విమోచన యాత్ర'కు రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ నేతలు సమాయత్తం అవుతున్నారు. యాత్ర నిర్వహించే జిల్లాలకు సంబంధించి బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను విడుదల చేసింది. ముగింపు సభ మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహిస్తారు. ఆ తర్వాత సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ యాత్రను తెలంగాణ విమోచన కమిటి ఛైర్మన్ శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి టి. ఆచారిలతో పాటు పార్టీ ముఖ్యనేతలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. కాగా రాష్ట్ర ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేయనున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సయమంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని సీఎం చంద్రశేఖర్‌రావు అప్పటి ప్రభుత్వాలను డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేయనున్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటుతున్న ఎందుకు నిర్వహించడంలేదని ప్రజలకు వివరించనున్నారు. ఇదిలా ఉంటే తెలంగాణ విమోచన యాత్ర సెప్టెంబర్ 1న ఉదయం 9 గంటలకు బషిర్‌బాగ్‌లోని కనకదుర్గమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి, 11 గంటలకు ఆర్టీసీ కళ్యాణమండపంలో సదస్సు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అసెంబ్లీ ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించాక ఉప్పల్ మీదుగా రాత్రి 7:30 గంటల వరకు భువనగిరికి చేరుకుని అక్కడనే బస చేస్తారు. 2న ఉదయం 8:30 గంటలకు భువనగిరి నుంచి యాత్ర మొదలై స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్, పరకాలకు చేరుకుని సభను నిర్వహిస్తారు. అక్కడి నుంచి తొర్రూర్, తిరుమలగిరిలో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ, బహిరంగసభనిర్వహించిరాత్రి 8 గంటలకు సూర్యాపేటకు చేరుకొని అక్కడనే బస చేస్తారు. 3న సూర్యాపేట నుంచి 8:30 గంటలకు బయలుదేరి ఎర్రుపాలెంలో మధ్యాహ్నం బహిరంగసభనిర్వహించిరాత్రి జనగామ జిల్లా కేంద్రానికి విమోచన యాత్ర చేరుకుంటుంది. నాలుగున జనగామ నుంచి ప్రారంభమై ఉదయం 11 గంటలకు రాజాకార్ల అకృత్యాలకు నిలయమైన బైరాన్‌పల్లిలో సభను నిర్వహించాక మంత్రి హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేటకు మధ్యాహ్నం 3 గంటలకు భారీ ర్యాలీతో చేరుకుంటారు. అక్కడి నుంచి మంత్రి తారకరామారావు నియోజకవర్గమైన సిరిసిల్ల - రాజన్న జిల్లా కేంద్రానికి చేరుకుని భారీ బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించారు. సభ ముగిసిన తర్వాత రాత్రి వెములవాడలో రాత్రి బస చేస్తారు. 5న వెములవాడ నుంచి బయలుదేరి ఉదయం 10:30 గంటలకు జిల్లా జైలు సందర్శన చేపట్టాక కామారెడ్డి క్రాస్ రోడ్ మీదుగా రాత్రి కి మేడ్చల్‌కు చేరుకుని బస చేస్తారు. 6న ఉదయం 9 గంటలకు మెడ్చల్ నుంచి ర్యాలీగా వెళ్లి గౌరెల్లి మీదు గా మహేశ్వరం చేరుకుం టారు. మహేశ్వ రంలో 11:30 గంటల కు బహిరంగ సభ, సాయంత్రం 4 గంటలకు షాద్‌నగర్‌లో మరో బహిరంగ సభను నిర్వహి స్తారు. సభ ముగిసిన తర్వా త షాద్‌నగర్ నుంచి జడ్చర్ల మీదుగా మహబూబ్‌నగర్ చేరుకుని అక్కడనే రాత్రి బస చేస్తారు. ఇక ముగింపు రోజైన 7న ఉదయం మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరి దేవెరకద్ర వరకు ర్యాలీ అప్పంపల్లిలో అమరుల స్తూపానికి ఉదయం 11 గంటలకు నివాళులు అర్పించి అక్కడనే మగింపు సభను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు.

తుగ్లక్‌ను మించిన కేసీఆర్ పాలన

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి



ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు పరిపాలన తుగ్లక్‌పాలనను మించిపోయిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. మాయ మాటలతో మూడేళ్లుగా రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. మూడేళ్లుగా సచివాలయానికి రాకుండా పాలించే ఏకైక సీఎం కేసీఆరేనని ఆయన మండిపడ్డారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అధికారులను నియమించలేదని ఆయన పేర్కొన్నారు. 15 రోజుల్లో భూ సర్వేను పూర్తి చేయడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రార్ల సర్వర్లన్ని పని చేయడం లేదని, జిల్లాలలో రిజిస్ట్రార్స్ కూడా లేరని ఆయన వ్యాఖ్యానించారు. భూములపై అవగాహన లేమితో సీఎం కేసీఆర్ పుటకోమాట మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నారని ఇంద్రసేనారెడ్డి అన్నారు. చట్ట వ్యతిరేకంగా జీఓ 39ని ప్రభుత్వం తెరపైకి తెచ్చిందన్నారు. ప్రతిపక్షాల ఇచ్చే సూచనలను సీఎం కేసీఆర్ పరిగణలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలు శత్రువులు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలొద్దు



- 'తెలంగాణ విమోచన' జాతి పోరాటానికి ప్రతీక
- ఇది నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకం
- మైనారిటీలకు కాదు
- తెరాస ప్రభుత్వంపై కేంద్రమంత్రి దత్తాత్రేయ ఫైర్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడంపై కేంద్ర కార్మికశాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విమోచన దినం తెలంగాణ జాతి చరిత్ర అని, దీన్ని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని వ్యాఖ్యానించారు. అయితే దురదృష్టావశాత్తూ దీన్నొక ఓటు బ్యాంకు అంశంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి విమోచన దినం ఏ మతానికీ వ్యతిరేకం కాదని, ఇది కేవలం నిజాం నిరంకుశ పాలనకు మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. అయితే టీఆర్ఎస్ పార్టీ విమోచన అంటే ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకం అన్న భావనలో ఉందని అన్నారు. ఏ మతంతోనూ ముడిపెట్టకుండా దీన్ని తెలంగాణ జాతి చరిత్రగా పరిగణించాలని దత్తాత్రేయ సూచించారు. 400 సంవత్సరాల చరిత్రలో నిజాం అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ పోరాట యోధులను, అమరవీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గతంలో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ విమోచన దినాన్ని అధికారింగా నిర్వహించాలని డిమాండ్ చేసిన విషయం గుర్తు చేస్తూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీఆర్ఎస్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్వహించకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతి పోరాట చరిత్రను గర్వంతో నిర్వహించుకోవాలని, ఓటు బ్యాంకు రాజకీయాలతో జాతికే అన్యాయం చేయవద్దని హితవు పలికారు.ఈ దిశగా తాము ఈ ఏడాది మరింత భారీ ఎత్తున తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నామని దత్తాత్రేయ వెల్లడించారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 17న నిజామాబాద్‌లో భారీ స్థాయిలో కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అలాగే సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్టు ఆయన వివరించారు. తాను సెప్టెంబర్ 2న పరకాలలో తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నాన్ని సందర్శిస్తానని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులందరి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. తాము చేపట్టే ఈ కార్యక్రమాల్లో పార్టీ జాతీయ నాయకులు సైతం పాల్గొంటారని దత్తాత్రేయ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కార్యాలయాల వద్ద ప్రదర్శన కార్యక్రమాలు కూడా చేపడతామని తెలిపారు.

ఆంధ్రప్రభ

ప్రధాని ఊసెత్తలేదు

హర్యానా హైకోర్టు బెంచ్ వెల్లడి



చండీగఢ్: సచ్చా డేరా అధినేత గుర్మీత్ రామ్ రహీం సింగ్‌ను దోషిగా తేల్చిన తీర్పులో ప్రధానమంత్రి మోడీ గురించి ఏమీ ఉటంకించలేదని పంజాబ్, హర్యానా హైకోర్టు వివరణ ఇచ్చింది. ఆ వ్యాఖ్యలు విచారణ సందర్భంగా చేసిన వ్యాఖ్యలే తప్ప తీర్పులో అది భాగం కాదని పేర్కొంది. మీడియా దాన్ని తప్పుగా అన్వయిం చిందని వెల్లడించింది. జాతీయ సమగ్రత, శాంతిభద్రతలు అన్నింటికీ అతీతమై నవని ఆరోజు హైకోర్టు జడ్జీలు వ్యాఖ్యానించారు. మనదంతా ఒకే జాతి. ఒకే పార్టీకి చెందిన జాతి కాదు. జాతి ఒక్కటేనని రాజకీయ నాయకులు అర్థం చేసుకోవాలి. ప్రధానమంత్రి అంటే దేశానికి ప్రధాని అని అర్థం. అంతేగాని బీజేపీకి ప్రధాని అని కాదు. అలాగే ముఖ్యమంత్రి ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి. అంతే తప్ప బీజేపీకి కాదు...అని జడ్జీలు పేర్కొన్నారు. ఇదంతా పరిశీలనాత్మక వ్యాఖ్యలు తప్ప తీర్పులో భాగం కాదన్నది హైకోర్టు అభిప్రాయం. అయితే ఆ నాటి విచారణలో పాల్గొన్న సీనియర్ లాయర్ అనుపమ్ గుప్తా మాత్రం..జడ్జీలు చాలా జాగ్రత్తగా ఆచితూచి ఈ వ్యాఖ్యలు చేశారని, ప్రధానమంత్రి అనే పదాన్ని ఒకసారి కన్నా ఎక్కువసార్లే ప్రస్తావించారని తెలిపారు. తమ వ్యాఖ్యల్ని తప్పుగా ప్రచురించొద్దని, ఉత్తర్వులో ఇచ్చిన అంశాన్నే రిపోర్టు చేయాలని..మిగతా తాము ఏమి మాట్లాడినా అదంతా తమ అబ్జర్వేషన్‌గానే భావించాలని జడ్జీలు తెలిపారు.భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్ సత్యపాల్ జైన్ ఆ విచారణలో కేంద్రం తరపున వాదించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ..ప్రధానమంత్రికి వ్యతిరేకంగా తామొక్క మాట కూడా మాట్లాడలేదని బెంచ్ తమకు తెలిపినట్టు చెప్పారు. తమ మాటల్ని వక్రీకరించారని కూడా బెంచ్ వెల్లడించిందన్నారు. అది విచారణ సందర్భంగా జరిగిన చర్చ. అయినా అందులో కూడా ప్రధానమంత్రి పేరు ఎక్కడా ప్రస్తావించలేదు అని బెంచ్ సభ్యులు తెలిపినట్టు జైన్ వివరించారు.

డీకే శివకుమార్ ఇంట్లో సోదాలు

పది చోట్ల దాడులు... రూ. 15 కోట్లు జప్తు

బెంగళూరు-న్యూ ఢిల్లీ: కాంగ్రెస్ పాలిత కర్నాటక రాష్ట్ర మంత్రి డీకే శివకుమార్ ఇంట్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు రెండు రోజుల నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. మంత్రికి సంబంధించిన పది చోట్ల (శివకుమార్ ఇండ్లు, బంధువుల ఇండ్లు, అనుచరుల ఆఫీసులు, ఇండ్లు)లో ఐటీ శాఖ ఏకకాలంలో దాడులు నిర్వహించింది. బెంగళూరు, చెన్నై, న్యూ ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ఐటీ చేపట్టిన దాడుల్లో సుమారు రూ. 15 కోట్ల నగదు, బంగారం జప్తు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సోదాల్లో దొరికిన డబ్బు, బంగారానికి శివకుమార్ లెక్క చూపించడంలో విఫలమయ్యారని అధికారులు చెప్పారు. అందుచేత, నగదు, బంగారాన్ని జప్తు చేసినట్లు పేర్కొన్నారు. తమ సోదాలు ఇంకా కొనసాగుతున్నట్లు వివరించారు. అయితే, ఈ దాడులకు సంబంధించి ఐటీ అధికారులు అధికారికంగా ప్రకటన చేయాల్సి ఉంది.

ఖండాంతర క్షిపణిని పరీక్షించిన అమెరికా

వాషింగ్టన్: ఉత్తర కొరియాకు దీటుగా అమెరికా బుధవారం ఖండాంతర క్షిపణిని ప్రయోగించింది. హవాయి తీరంలో అమెరికా వైమానిక దళం,క్షిపణి భద్రతా ఏజెన్సీలు సంయుక్తంగా యూఎస్ఎస్ జాన్‌పాల్ నౌక నుంచి ఈ క్షిపణిని ప్రయోగించాయి.ఉత్తరకొరియా ఇటీవల జపాన్ మీదుగా ఖండాంతర క్షిపణిని ఇటీవల ప్రయోగించింది.అందుకు ప్రతిగా అమెరికా ఈ క్షిపణిని ప్రయోగించింది. ఫసిఫిక్ తీరంలోని గువామ్ ద్వీపాన్ని లేకుండా చేస్తామంటూ ఉత్తరకొరియా హెచ్చరించడంపై అమెరికా తీవ్రంగా స్పందించింది.అటువంటి ఉన్మాద చర్యలకు పాల్పడితే ప్రపంచ పటంలో ఉత్తరకొరియా లేకుండా చేస్తామని అమెరికా హెచ్చరించింది.

దినకరన్‌కు ఝలక్

- బలపరీక్షకు నో చెప్పిన విద్యాసాగర్ రావు
- దినకరన్, ప్రతిపక్షాలకు షాక్
- తమిళనాడు ప్రభుత్వానికి ఉపశమనం
- గవర్నర్ నిర్ణయంపై డీఎంకే అసహనం



చెన్నై: తమిళనాడు అధికారపార్టీ అన్నాడీఎంకేలో చెలరేగిన వర్గపోరు ప్రకంపణలు రేపుతూనే ఉంది. ముఖ్యమంత్రి పళనిసామిని సీఎం పీఠం నుంచి దించేందుకు అన్నాడీఎంకేలోని శశికళవర్గం, ప్రతిపక్షాలు ఏకమవడంతో రాజకీయం మరింత రక్తికట్టింది. అయితే అమ్మపార్టీలోని అసమ్మతి ఎమ్మెల్యేల ఆశలపై తమిళనాడు గవర్నర్ విద్యాసాగర్ రావు నీళ్లు జల్లారు. ప్రభుత్వంపై బలపరీక్షకు అనుమతించాలని ప్రతిపక్షాలు గవర్నర్‌కు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు.సీఎంతో విబేధించిన 20 మంది ఎమ్మెల్యేలు ఇంకా అన్నాడీఎంకేలోనే ఉన్నందున ప్రభుత్వంపై బలపరీక్షకు అనుమతించబోనని తెగేసి చెప్పేశారు. గవర్నర్ తాజా నిర్ణయంతో ఇటు దినకరన్ వర్గం అటు ప్రతిపక్ష డీఎంకే,కాంగ్రెస్ వర్గాలకు ఝలక్ ఇచ్చినట్లైంది. ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించినట్లుగా దినకరన్ రోజుకో ముఖ్యనేతను అన్నాడీఎంకే జిల్లా కార్యదర్శి పదవుల నుంచి తొలగించిన తర్వాత గవర్నర్ తీసుకున్న ఈ నిర్ణయం పళనిసామికి కలిసొచ్చింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ పళని ప్రభుత్వానికి సహాయసహకారాలు అందిస్తున్న నేపథ్యంలో గవర్నర్ నిర్ణయంలోనూ కేంద్రం పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గవర్నర్ పక్షపాతం సరికాదు:స్టాలిన్

ప్రజలు పళని ప్రభుత్వంపై నమ్మకంకోల్పోయారని గవర్నర్‌ను కలిస్తే ఆయన ఏకపక్షంగా వ్యవరిస్తున్నారని డీఎంకే నాయకుడు స్టాలిన్ ఆరోపించారు. అన్నాడీఎంకేలోని 20 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై బలపరీక్షకు డిమాండ్ చేస్తున్నప్పటికీ గవర్నర్ విద్యాసాగర్ రావు సరైన రీతిలో స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. బంతిమీ కోర్టులో ఉన్నందున సీఎం మెజారిటీ నిరూపించుకోవాలని గవర్నర్‌ను కోరినా...ఆయన స్పందించకలేదని డీఎంకేనేతలు ఆరోపించారు. బంతి ఇంకా తనకోర్టుకు రాలేదని...అన్నాడీఎంకే పార్టీ నేతల్లో వచ్చిన విభేదాలు సమిసిపోయేలా ఉన్నాయని వ్యాఖ్యానించారని చెప్పారు.

గవర్నర్ తీరుతో కేంద్రంలోని బీజేపీ వ్యూహం అర్థమైపోయిందని మండిపడ్డారు. గవర్నర్ కూడా ఏకపక్ష రాజకీయాలకు పాల్పడటం సరైంది కాదని స్టాలిన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లే గవర్నర్‌వ్యవహరిస్తున్నారని అన్నారు.మరోవైపు తమిళనాడులో ప్రభుత్వంపై బలపరీక్షకు అనుమతించేలా గవర్నర్‌ను ఆదేశించాలని గురువారం రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌ను కలుస్తామని వామపక్షాలు,ముస్లింలీగ్ నేతలు తెలిపారు.

పళని దిగరాకుంటే..సత్తాచూపిస్తా:దినకరన్

తమిళనాడు ముఖ్యమంత్రి వెనక్కితగ్గకుంటే తమ సత్తా చూపిస్తామని అన్నాడీఎంకే డిప్యూటీ జనరల్ సెక్రటరీ దినకరన్ పళనిస్వామిని హెచ్చరించారు.అన్నాడీఎంకేలో తమ స్లీపర్ సెల్స్ ఉన్నారన్న దినకరన్ ...రోజురోజుకు పళనిపై అసమ్మతి పెరిగేలా చూస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పళనిని 21 మంది ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తూ తమతో చేయి కలిపారన్నారు.

పంజాబ్... హర్యానాలో తగ్గిన అల్లర్లు

- గుర్మీత్ అరెస్ట్ తర్వాత అంతా ప్రశాంతం
- తెరుచుకున్న దుకాణాలు,విద్యా సంస్థలు
- బాబా వారసుడు చరణ్‌ప్రీత్ అంటూ ఊహాగానాలు



చండీగఢ్-న్యూ ఢిల్లీ: అత్యాచారం కేసులో డేరా సచ్చా సౌదా అధినేత బాబా రామ్‌రహీమ్ గుర్మీత్ జైలు పాలవడంతో చెలరేగిన అల్లర్లు తగ్గుముఖం పట్టాయి. రెండు రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాల్లో బుధవారం శాంతియుత వాతావరణం నెలకొంది. ఈ విషయాన్ని స్థానిక పోలీసు అధికారులు వెల్లడించారు. దుకాణాలు, విద్యా సంస్థలు కార్యకలాపాలను ప్రారంభించాయి. రవాణా వాహనాలు రాకపోకలు కూడా మొదలయ్యాయి. సున్నితమైన ప్రాంతాల్లో బందోబస్తు కొనసాగిస్తున్నట్లు వివరించారు. బాబా అరెస్టు సమయంలో అల్లర్లు చెలరేగకుండా అంబాలా, కురుక్షేత్ర, ఖతల్, జింద్, హిస్సార్, సిర్సా తదితర ప్రాంతాల్లో నిలిపి వేసిన అంతర్జాల సేవలను కూడా ప్రారంభించినట్లు ప్రకటించారు. గుర్మీత్‌కు సీబీఐ న్యాయస్థానం ఖరారు చేసిన తర్వాత ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోలేదన్నారు.

ఆశ్రమ వారసుడిపై జోరుగా ఊహాగానాలు

డేరా సచ్చా సౌదా గుర్మీత్ బాబా రేప్ కేసులో దోషిగా తేలడంతో బాబా వారసుడెవ్వరన్న చర్చ ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. డేరా అధిపతి ఎవరన్నదానిపై ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. గుర్మీత్ తనయుడు జస్మీత్, ఆయన దత్త కుమార్తె అయిన హనీప్రీత్, డేరా ఛైర్‌పర్సన్‌గా ఉన్నటువంటి విపాసనా ఇన్సాన్‌ల పేర్లు ప్రధానంగా తెరపైకి వస్తున్నాయి. దీంతో, ఈ అంశం సిర్సాతో పాటు గుర్మీత్ వ్యాపార ప్రభావిత ప్రాంతాల్లో కూడా ఆసక్తి రేకెత్తిస్తున్నది. ఆశ్రమ వారసుడిగా గుర్మీత్ కుటుంబ సభ్యులే కావాలన్న ప్రత్యేక నిబంధన ఏమి లేదని మరికొందరు చెబుతున్నారు. ఆయన రక్త సంబంధీకులు కానీ వారు కూడా డేరా సంస్థలకు ప్రాతినిధ్యం వహించవచ్చని చెప్పుకొస్తున్నారు.

ప్రతిపక్షాల ఆరోపణలతో రాజీనామా చేయను: మనోహర్‌లాల్ ఖట్టర్

సిర్సాలో చెలరేగిన అల్లర్లకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్న ప్రతిపక్షాల వ్యాఖ్యలపై హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఘాటుగా స్పందించారు. సరైన సమయంలో తమ ప్రభుత్వం స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిందని సమర్థించుకున్నారు. న్యాయస్థానం ఆదేశాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రతిపక్షాల ఆరోపణలకు బుధవారం ఆయన సమాధానమిచ్చారు. ఖట్టర్ రాజీనామాపై భారతీయ జనతా పార్టీ అధిష్టానం కూడా స్పందించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా మాట్లాడారు. తాజాగా నెలకొన్న అల్లర్లకు బాధ్యతగా ఖట్టర్ రాజీనామా చేయాల్సిన అవసరం లేదని వెనకేసుకొచ్చారు. ఘటన జరిగిన తర్వాత హర్యానా ప్రభుత్వ చర్యలు ఆమోదనీయంగా ఉన్నాయన్నారు.

డాక్టర్ల ఫైటింగ్‌తో పసిప్రాణం బలి



జోధాపూర్: ఆపరేషన్ థియేటర్‌లో డాక్టర్ల ఫైటింగ్ కారణంగా ఓ పసిప్రాణం బలైంది. ఈ బాధాకర సంఘటన రాజస్థాన్‌లోని జోధాపూర్‌లో గత కొద్ది రోజుల క్రితం చోటు చేసుకుంది. ప్రస్తుతం ఆ డాక్టర్ల ఫైటింగ్‌కు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుండటంతో విషయం తీవ్రంగా చర్చనీయాంశమైంది. ఘటనపై సోషల్ మీడియాలో విమర్శలు పెద్ద ఎత్తున రావడంతో ప్రభుత్వం స్పందించింది. రాజస్థాన్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆ వైద్యులను విధుల నుంచి తప్పించారు. ఘటనను విచారణకు ఆదేశించారు. రాష్ట్ర హైకోర్టుకు కూడా సంఘటనను ప్రత్యేకంగా గుర్తించి విచారణకు ఆదేశించింది. విచారణ కమిటీలో ఒకసిట్టింగ్ జడ్జి ఉండాలని పేర్కొంది. వారంలోగా రిపోర్టు అందజేయాలని కమిటీని కోరింది. అయితే, సస్పెండ్ అయిన డాక్టర్లు మాట్లాడుతూ పాప ముందుగానే బలహీనంగా ఉందని చెబుతున్నారు.

భారత్, చైనా సహకారానికి ఎన్నో అవకాశాలు: వాంగ్




బీజింగ్ : డోక్లామ్ సమస్య పరిష్కారం కాగానే చైనా మాట మార్చింది.రూటు మార్చింది. భారత్‌తో సహకారాన్ని పెంపొందించుకోవడానికి తమ దేశం ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తోందంటూ చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం.ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వచ్చే నెల ఆరంభంలో బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశాలకు హాజరు కానున్న సందర్భంగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. భారత్‌తో తమ దేశం ఎప్పుడూ మైత్రినే కోరుకుంటున్నదని ఆయన అన్నారు. డోక్లామ్ వంటి సమస్యలు అప్పుడప్పుడు తలెత్తడం సహజమేననీ, అరమరికలు లేని చర్చల ద్వారా ఇటువంటి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన అన్నారు.ఇరుదేశాల మధ్య సహకారం,మైత్రి పెంపొందడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. అదే సందర్భంలో డోక్లామ్‌లో ఉద్రిక్తతకు భారత్‌దే బాధ్యత అన్నట్టు ఆయన వ్యాఖ్యానించారు.ఇలాంటి పరిస్థితులు తిరిగి తలెత్తకుండా చూసుకోవాలని ఆయన అన్నారు.ఇరుగుపొరుగు దేశాల మధ్య సహకారం ఉంటే ఎంతటి జటిలమైన సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చని ఆయన అన్నారు. సరిహద్దులు ప్రశాంతంగా ఉంటేనే ఇరుదేశాలు అభివృద్ధిని సాధిస్తాయని ఆయన అన్నారు.



మలేగావ్ పేలుళ్ల కేసులో బెయిల్ పొందిన తర్వాత ఆర్మీ విధుల్లో చేరిన కల్నల్ ఎస్‌కె పురోహిత్

అమెరికాలో హరికేన్ బీభత్సం.. భారత విద్యార్థి మృతి



అమెరికాలోనిటెక్సాస్ రాష్ట్రంలో హరికేన్ హార్వే వరద బీభత్సం సృష్టించింది. కుండపోతగా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. భారీ వరదల్లో చిక్కుకున్న భారతీయ విద్యార్థి నిఖిల్ బాటిలా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్నేహితురాలు షాలినీతో కలిసి స్విమ్మింగ్ కు వెళ్లిన నిఖిల్ ప్రమాదవశాత్తు వరదల్లో చిక్కుకున్నారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న షాలినీ పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రాజస్థాన్ లోనిజైపూర్‌కు చెందిన నిఖిల్ బాటియా ఎంఅండ్ ఎం యూనివర్సిటీలో పీజీ చదువుతున్నాడు.

వరద (వాణిజ్య) రాజధాని



- భారీ వర్షంతో ముంబై కకావికలం
- నగరం జలదిగ్బంధనం
- వీధుల్లోనే నిలిచిన నీరు
- ముమ్మరంగా సహాయక చర్యలు
- రంగంలోకి నేవీ
- కమ్యూనిటీ కిచెన్లతో ఆహార పంపిణీ
- పరిస్థితి అదుపులోనే ఉంది:బీఎంసీ



ముంబై: భారీ వర్షాలతో ముంబై నగరం అతలాకుతమైంది. రోడ్లన్నీ జలమయమై...వీధులు చెరువులను తలపిస్తుండటంతో నగరమంతా జలదిగ్బంధనమైంది.. భారీ వర్షాల కారణంగా వాణిజ్య కేంద్రాలకు అప్రటిత సెలవు ప్రకటించడంతో వాణిజ్య రాజధాని కాస్త వరద రాజధానిగా మారిపోయింది.

ఐదుగురు మృతి, వందలాదిమంది నిరాశ్రయులు

ముంబైలో ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ వర్షం కారణంగా ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. వందలాది మంది ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైనట్లు గ్రేటర్ ముంబై విపత్తు నిర్వహణ సెల్ ప్రకటించింది.ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ముంబైలోని జనకళ్యాణ్ నగర్‌లో గోడకూలి రెండేళ్ల చిన్నారికళ్యాణి ప్రాణాలు కోల్పోయింది. ఈఘటనలో పాప తల్లిదండ్రులు గోపాల్,ఛాయ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విక్రోలీ సూర్యానగర్ లోఓ ఇల్లు కూలడంతో ఇద్దరు మృతిచెందారు. రాజావాడీ ఆస్పత్రిలో చేరిన 18 నెలల నికిల్ సత్యేంధ్ర, 40 ఏళ్ల సురేష్ మౌర్య చికిత్స పొందుతూ కన్నుమూశారు.

గడ్కోపర్‌లోని అంబేద్కర్ నగర్ లో ఇల్లు కూలి రామేశ్వర్ తివారి(45) మృతి చెందగా అతని భార్య మంజూ వారిద్దరి పిల్లలు కృష్ణ రోనక్ గాయపడ్డారు. వర్షాల్లో చిక్కుకుని చాలామంది తప్పిపోయినట్లు మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. చాలామంది తమ కుటుంబ సభ్యులు కనిపించడం లేదని సోషల్ మీడియాలో వారి ఫోటోలు కూడా పోస్ట్ చేశారు. రానున్న 48 గంటల్లో మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారతవాతావరణ శాఖ తెలిపింది. మహారాష్ట్రలోని పలు ప్రాంతాలతో పాటు గోవా, గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖతెలిపింది.

కమ్యూనిటీ కిచెన్లు, ఆహార పంపిణీ కేంద్రాలు ప్రారంభించిన నేవీ

ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో నిరాశ్రయులైన ముంబై ప్రజలకు నావీకాదళం చేయూత నిస్తోంది. ఎక్కువగా వర్షాలు కురిగిన ప్రాంతాల్లో కమ్యూనిటీ కిచెన్లు, ఆహార పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రజలను ఆకలిబాధనుంచి విముక్తి చేసేందుకు నేవీ సిబ్బంది ఆహారాన్ని పంపిణీ చేస్తున్నారు. చర్జిగేట్, బైకుల్లా, పారెల్, సీఎస్టీ,వోర్లీ, టార్డెవో, ముంబై సెంట్రల్, దాదర్, మన్కు ర్డ్, చెంబుర్, మలాడ్, ఘట్కోపర్ ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం అందిస్తున్నట్లు నేవీ అధికారులు పేర్కొన్నారు. ఇండియన్ నేవీ మీ కోసమే..ఎక్కడైనా..ఎల్లప్పుడు అనే నినాదంతో తాము ముందుకెళ్తున్నట్లు నేవీ అధికార ప్రతినిధి తెలిపారు. వర్షాల కారణంగా నిరాశ్రయులైన వారికి ఉత్తర నేవీ కమాండ్ సౌకర్యాలు ఏర్పాటు చేసింది. సాగర్ ఇన్‌స్టిట్యూట్ కొలాబా,ఐఎన్ఎస్ త్రాటా వోర్లా, ఐఎన్ఎస్ హమ్లా మార్వే, ఘట్రోపార్ మెటీరియల్ సంస్థ ప్రాంగణాల్లో వరదబాధితు లకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వరదనీటిలో చిక్కుకున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు హెలికాప్టర్లు వినియోగిస్తున్నట్లు వివరిం చారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెస్క్యూ టీం పనిచేస్తోందని వెల్లడించారు.



బీఎంసీకి శివసేన కితాబు

భారీ వర్షం ముంబై నగరం మునిగిపోయిన సమయం శివసేన చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించింది. పరిస్థితి చేయిదాటిపోకుండా బీఎంసీ చేపడుతున్న చర్యలు బాగున్నాయనిపేర్కొంది. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బీఎంసీ చాక చక్యంగా వ్యవహరిస్తోం దని కితాబిచ్చింది. ఇంత భారీ వర్షం కురిసినప్పటికీ ఎలాంటి దురదుష్టకరమైన సంఘటనలు చోటుచేకోకుండా బీఎంసీ చర్యలు చేపట్టిందని సేన అధికార పత్రిక సామ్నాలో వ్యాఖ్యానించింది.

నిలిచిన డబ్బావాలా సర్వీసులు

ముంబై నగర వాసులకు అన్నదాతలుగా గుర్తొచ్చే డబ్బావాలా భారీ వర్షం కారణంగా తన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. మంగళవారం ఉద్యోగులకు అందించిన లంచ్ బాక్స్ లు తిరిగి సేకరించకపోవడంతో బుధవారం తమ సర్వీసులను కొనసాగించలేకపోయామని డబ్బావాలా ప్రతినిధులు తెలిపారు. లోకల్ రైలు సర్వీసులు పునరుద్దరించినప్పటికీ డబ్బాలు అందుబాటులో లేని కారణంగానే లంచ్ బాక్స్ లు అందజేయలేకపోయామని తెలిపారు. రైళ్ల ద్వారా ఉద్యోగులకు లంచ్ బాక్స్ అందజేసే డబ్బావాలాకు ముంబైలో మంచిపేరుంది. తక్కువ ధరలకు లంచ్ బాక్స్ ప్రిపేర్ చేసి సమయానికి అందజేసే డబ్బావాలాపై ఉద్యోగులకు ఎంతో నమ్మకం.



12 రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు: ఐఎండీ

రానున్న 72 గంటల్లో దేశంలోని 12 రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర,గుజరాత్, గోవా,కర్నాటక, రాజస్థాన్,చత్తీస్ గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, డామన్ డయ్యూ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఇప్పటికే అస్సాం, బీహార్ రాష్ట్రాల్లో వరదలు బీభత్సం సృష్టిస్తుండగా..తాజాగా ముంబైలో కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. సోమవారం నుంచి మహారాష్ట్ర,కర్నాటక, మధ్యప్రదేశ్,గుజరాత్ రాష్ట్రాల్లో భారీవర్షాలు కురుస్తుండగా...రానున్న రెండు,మూడు రోజుల్లో మరిన్నివర్షాలు కురివొచ్చని ఐఎండీ తెలిపింది. భారీ వర్షాలతో దాదాపు 14 నదుల్లో నీటిమట్టం కూడా పెరిగిందని పేర్కొంది.వర్షాల నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించింది.

పరిస్థితి అదుపులోనే ఉంది: బీఎంసీ

మంగళవారం కురిసిన భారీ వర్షంతో ముంబై నగరంలోని పలు ప్రాంతాలు జలమయమైనప్పటికీ పరిస్థితి అదుపులోనే ఉందని బ్రిహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. భారీ వర్షంతో వేలాదిమంది రైల్వే స్టేషన్లు, ఆఫీసుల్లోనే నిలిచిపోయినప్పటికీ వారందరూ సురక్షితంగా ఇళ్లకు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని పేర్కొంది. 30 సెంటిమీటర్ల వర్షం కురిసినప్ప టికీ... మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి విషాద ఘటనలు చోటుచేసుకోలేదని బీఎంసీ కమిషనర్ అజోయ్ మెహతా తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 30వేల మంది ఉద్యోగులు వీధుల్లో నిలిచిన నీటిని తొలగించి.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ ఐదారేళ్లలో ఎన్నడూ కురవనంత వర్షం పడినప్పటికీ కార్పొరేషన్ అప్రమత్తత వల్ల ప్రాణనష్టం ఎక్కువగా జరగలేదన్నారు. భారీ వర్షాలతో నిరాశ్రయులైన వారికి సహాయసహకారాలందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించామని చెప్పారు.

ప్రాణాలను కాపాడుకునేందుకు గేదెలపై వెళ్లారు: నేవీ అధికారి

ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలు గత చేదు జ్ఞాపకాలను గుర్తుకుతెస్తున్నాయి. 2005 జులై 26న ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం మిగిల్చిన విషాదాన్ని ఓ నేవీ అధికారి గుర్తు చేసుకున్నారు. 2005లో కురిసిన భారీ వర్షాలతో దాదాపు 500 వంది ప్రాణాలు కోల్పోగా...వేలాది వంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. ఒక్కరోజే 94 సెంటీమీటర్ల వర్షం కురవడంతో ముంబై నగరం నదిని తలపించిందని గుర్తు చేశారు. తాను విధులు నిర్వహించే ప్రాంతం నుంచి ఇంటికి వెళ్లేందుకు మూడు రోజులు పట్టిందని చెప్పారు. చెరువులను తలపించే రోడ్లపై నడుస్తూ వెళ్తుంటే..మనసును కలచివేసే ఎన్నో దృశ్యాలు ఇప్పటికే తనకళ్లముందే కదలాడుతున్నారన్నారు. తాను వెళ్తున్న దారిలో నీటిపైతేలుతున్న మృతదేహాలు ఓవైపు...ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గేదెలపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న వారొకవైపు కనిపించారని తెలిపారు. ఒక్కరోజు వర్షంతోనే ముంబై నగరం అతలాకుతలైమైందని వెల్లడించారు. 2005 జులై 26న ఉదయం నవీ ముంబయి నుంచి అధికారిక పనుల కోసం థానే వెళ్లి మధ్యాహ్నం వరకు పని ముగించుకుని ఇంటికి వెళ్దామని సిద్ధమవగా కురిసిన భారీ వర్షం...రెండున్నర గంటల ప్రయాణాన్ని రెండున్నర రోజులు చేసిందని చెప్పారు. ఇంటికి ఫోన్ చేద్దామన్న ఫోన్ పనిచేయకపోవడంతో రాత్రుల్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలపైనే తలదాచుకోవాల్సి వచ్చిందని తెలిపారు.



రైలులోనే 12 గంటలు గడిపిన గర్భిణి

గర్భిణి స్త్రీలు ఎక్కువ సేపు ప్రయాణాలు చేయరాదని వైద్యులు సూచిస్తుంటారు. చాలామంది వైద్యుల సూచనల ప్రకారం లాంగ్ జర్నీలకు దూరంగా ఉంటారు. కానీ ముంబైకి చెందిన ఓ జర్నలిస్ట్ ఏడు నెలల గర్భిణి గా ఉన్నప్పుడు 12 గంటలపాటు రైలులోనే గడిపారట. 2005 జులై 26న కురిగిన భారీ వర్షం ఆమెను 12 గంటలు రైల్లోనే ఉంచేలా చేసింది. తన గమ్యస్థానానికి గంటలోపే చేకుంటానని ముంబైలోని సబర్బన్ రైలు ఎక్కిన ఆమెకు ట్రైన్‌లోనే సగంరోజు గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందట. 12 ఏళ్ల క్రితం...12 గంటలపాటు రైళ్లలో గడిపిన పరిస్థితిని ఊర్మిల ట్విట్టర్ ద్వారా గుర్తుచేసుకుంది. అదృష్టవశాత్తు తనకు దివ్యాంగుల బెర్తు దొరకడంతో ఎక్కువ ఇబ్బందిపడకుండా రెస్ట్ తీసుకోగలిగానని పేర్కొంది. తన చుట్టూ ఉన్న 20 మంది దివ్యాంగులు ఎంతో ఆప్యాయతతో పలకరించారనిచెప్పుకొచ్చింది.

ఇరుగు పొరుగుకి డ్రాగన్‌తో ఇక్కట్లే!



- సరిహద్దు దేశాలు 13 • అందరితోనూ వివాదాలే
- 22,177 కి.మీ. ఉమ్మడి సరిహద్దులో తరచూ గొడవలే
- సముద్రాల్లోనూ ఆధిపత్యం కోసం బీజింగ్ కుట్రలు
- చిన్న చిన్న దీవులను కబళించే యత్నం
- ఆర్థిక, సైనిక శక్తితో చిన్నదేశాలను లొంగదీసుకునే వ్యూహం



ఆసియాలో అత్యంత శక్తివంతమైన దేశం చైనా. ఆర్థికశక్తిగా, సైనిక శక్తిగా డ్రాగన్ తనకుతానే సాటి. అలాంటి చైనా ఇప్పుడు సామ్రాజ్యవాద కాంక్షతో పెట్రేగిపోతున్నది. తనకు చుట్టూ ఉన్న పొరుగు దేశాలతో సఖ్యత కంటే వివాదాలే ఎక్కువ. దాదాపు 22, 117 కిలోమీటర్ల మేరన భూ సరిహద్దు కలిగివుంది. భారత్ సహా మొత్తం 13 దేశాలు పొరుగున ఉన్నాయి. ఈ దేశాలన్నీ చైనాతో సరిహద్దు భాగస్వాములే. డ్రాగన్ దూకుడును, దురాక్రమణను బాహాటంగానే వ్యతిరేకిస్తున్నప్పటికీ, కొన్నదేశాలు మెతకవైఖరిని అవలంబిస్తున్నాయి. ఇందుకు కారణం ఈ ప్రాంతాల్లో బీజింగ్ పెట్టుబడులు అంతకంతకూ పెరుగుతుండటమే. దీంతో స్వప్రయోజనాల వ్యూహాత్మక దౌత్యంలో ఆయా దేశాలు బీజింగ్ వింతపోకడలను ఖండించలేకున్నాయి. అయితే, బీజింగ్ సైనిక కుట్రలను, వ్యూహాలను ధైర్యంగా ఎదుర్కొంటున్న, తిప్పికొడుతున్న దేశాలు ఐదున్నాయి. భారత్‌తోపాటు, మంగోలియా,వియత్నాం, జపాన్, తైవాన్‌లు చైనా బెదిరింపులకు ఎదురొడ్డి నిలిచివున్నాయి. ఇటీవల జరిగిన ఆసియాన్ సదస్సులో దురాక్రమణ వ్యతిరేక ఒప్పంద ప్రతిపాదన తెరపైకి తీసుకురావడం ద్వారా బీజింగ్‌కు పొరుగు దేశాలు సున్నితమైన హెచ్చరిక చేసినట్లయింది.

ఇటీవల చోటుచేసుకున్న డొక్లామ్ సంఘటన బీజింగ్ కుట్రలకు నిదర్శనం. భారత్‌కు చెక్ పెట్టడమే లక్ష్యంగా, పొరుగు దేశాలతో కీలక వాణిజ్య ఒప్పందాలు, ఆర్థిక సహాయం పేరుతో ఆయాదేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించే వ్యూహాలను మిగతా ఆసియాదేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. చైనా వ్యవహారశైలిని జపాన్ తీవ్రంగానే వ్యతిరేకిస్తున్నది. డొక్లామ్ వివాదం నేపథ్యంలో ఆ దేశం భారత్‌కు మద్దతుగా నిలిచింది. ఆసియా దేశాలతో మెగా డీల్స్ ద్వారా బీజింగ్ పన్నుతున్న వ్యూహాలు, పొరుగు దేశాలతో దౌత్యసంబంధాలపై సంక్షిప్త విశ్లేషణ.

రష్యా (సంక్లిష్టం)

తన హయాంలో మాస్కో-బీజింగ్ మధ్య సంబంధాలు చరిత్రలోనే సువర్ణాధ్యాయంగా జిన్‌పింగ్ పేర్కొన్నారు. అయితే, రష్యాకు బయట దేశాల్లో నానాటికీ పెరుగుతున్న చైనా ప్రాబల్యం, పెట్టుబడుల విస్తరణ మాస్కోకు గట్టిపోటీగా పరిణమించింది. మాస్కోతో సుమారు 3,645 కి.మీ. ఉమ్మడి సరిహద్దును చైనా కలిగివుంది.

కజకిస్తాన్ (మిత్రదేశం)

1783 కిలోమీటర్ల ఉమ్మడి సరిహద్దు కలిగివుంది. సరిహద్దు వివాదాల్లేని పొరుగుదేశమిదే. గతంలో కుదుర్చుకున్న ఒడంబడికలపై ఇరు దేశాలు సంతృప్తిగా ఉన్నాయి. రష్యాకు అత్యంత మిత్రదేశమైన కజకిస్తాన్, ప్రపంచంలోని చమురు నిల్వల్లో మూడో వంతు వాటా కలిగివుంది. చైనా చేపట్టిన ఒన్ బెల్ట్-ఒన్ రోడ్డు ప్రాజెక్టులో కీలకంగా ఉంది.

ఒప్పందాలు: సరిహద్దులో స్వేచ్ఛా వాణిజ్యం కొనసాగింపు. తమ పోర్టుల నుంచి చైనా కార్గోలకు గేట్‌వేను అనుమతించింది.

కిర్గిస్తాన్ (తటస్థం)

చైనా జిన్‌జియాంగ్ ప్రావిన్స్‌కు చేరువలో ఉన్న దేశమిది. ఈ రెండింటి మధ్య 858 కిలోమీటర్ల ఉమ్మడి సరిహద్దు ఉంది. బిష్కెక్ (కిర్గిస్తాన్ రాజధాని)తో బీజింగ్ స్నేహం అంతంతమాత్రమే. కాస్తంత వివరంగా చెప్పాలంటే ఈ దేశంతో చైనా మైత్రి సంక్లిష్టమే. కిర్గిస్తాన్ లోని చాలా ప్రాంతాలు అమెరికా, రష్యాలకు సైనికస్థావరాలుగా ఉన్నాయన్నది బీజింగ్ ప్రాథమిక ఆరోపణ. కిర్గీస్ చైనాలో గుర్తింపు పొందిన 56 జాతుల్లో ఒకరు. కిర్గిస్తాన్ వలసల పట్ల చైనా ఒకింత ఆందోళన చెందుతుంటుంది. వీరు మారణాయుధాలను జిన్‌జియాంగ్‌కు స్మగ్లింగ్ చేస్తుంటారన్న ఆరోపణలే ఇందుకు కారణం.

ఒప్పందాలు: కీలక వాణిజ్య ఒప్పందాలు. గతంలో రష్యా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉండేది. దీనిని చైనా అధిగమించింది.

తజకిస్తాన్ (తటస్థం)

ఉమ్మడి సరిహద్దు విస్తీర్ణం 414 కిలోమీటర్లు. పామిర్ పర్వత ప్రాంతాల్లో చైనా భూభాగం వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అయితే ఇది పూర్తిగా బీజింగ్ చేతుల్లోకి వెళ్లిందా? లేదా? అన్నదానిపై స్పష్టతలేదు. 130 ఏళ్ల కిందటి వివాదాన్ని ప్రస్తావిస్తూ 5 శాతం భూభాగాన్ని ఆక్రమించేసింది. ప్రస్తుతం సరిహద్దులోని 28వేల చ.కి.మీ. భూభాగం తమదేనంటూ చైనా వివాదం రేపింది.

ఒప్పందం: ఇంధన, మౌళిక రంగాలలో ఇక్కడ చైనాయే అతిపెద్ద పెట్టుబడిదారు.

ఆఫ్ఘనిస్తాన్

ఈ దేశంతో 76 కిలోమీటర్ల సరిహద్దును కలిగివుంది. 1963 నాటి సరిహద్దు ఒప్పందం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకుంది. బడఖ్షాన్ ప్రావిన్స్‌లోని కొంత భూభాగాన్ని చైనా ఆక్రమించుకున్నదని, ఇది బీజింగ్ వ్యూహాత్మక చర్యేనని విశ్లేషకుల వాదన.

ఒప్పందాలు: తీవ్రవాద నిరోధక నెట్‌వర్క్‌ను పెంపొందించుకోవడం ద్వారా ఈ ఇస్లామిక్ దేశంతో మరింత సన్నిహిత సంబంధాన్ని ఏర్పరచుకోవాలన్నది బీజింగ్ వ్యూహం. అదేవిధంగా పాక్‌లో నిర్మిస్తున్న ఆర్థిక నడవను కాబూల్‌కు విస్తరించాలన్నది చైనా ఆలోచన. అయితే ఇందుకు ఆఫ్ఘన్ సుముఖంగా లేదు. డ్రాగన్‌ను విశ్వసించజాలమన్నది అష్రఫ్ ఘని ఉద్దేశం.


పాకిస్తాన్ (మిత్రదేశం)

పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని గిల్జిత్-బాల్టిస్తాన్ ప్రాంతంలో ఆర్థిక నడవను చేపట్టడం ద్వారా పాక్‌తో సంబంధాలను పటిష్టంచేసుకుంది. అయితే, ఆఫ్ఘన్-పాక్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు, ఉగ్రవాద చొరబాట్లు తన సీపీఈసీ ప్రాజెక్టు కొంప ముంచే ప్రమాదం ఉందేమోనని ఇప్పుడు భయపడుతోంది.

ఒప్పందాలు : చైనా-పాకిస్తాన్ ఆర్థిక నడవ ప్రాజెక్టు నిర్మాణం. ఇందులో చైనా 55 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టింది.

ద. కొరియా (వ్యతిరేకి)

రెండు దేశాల మధ్య తూర్పు చైనా సముద్ర జలాల వివాదం ఉంది. మరోకవైపు అమెరికాకు తొత్తుగా వ్యవహిస్తూ, ఉత్తర కొరియాపై దూకుడు ప్రదర్శించడాన్ని బీజింగ్ ఆక్షేపిస్తున్నది. థాడ్ క్షిపణి నిరోధక వ్యవస్థ ఏర్పాటుపై ఆగ్రహంతో ఉంది.




వియత్నాం (వ్యతిరేకి)

ఆసియాలోని చైనా పొరుగు దేశాల్లో తెగువ కలిగిన దేశమిది. బీజింగ్ చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టడంలో ఏమాత్రం వెనుకాడదు. అటు సరిహద్దు, ఇటు సముద్ర జలాల వివాదంలో చైనాతో ఢీ అంటే ఢీ అంటోంది. స్పెయిన్ సహకారంతో వంగ్వార్డ్ సముద్ర తీరంలో చమురు నిల్వలను వెలికితీసి, ఆర్థిక వనరులను సమకూర్చుకుంటోంది. అయితే ఈ చమురు క్షేత్రం మాదేనంటూ చైనా గొడవకు దిగింది. ఇటీవల వియత్నాం ప్రభుత్వం ఓఎన్‌జీసీతో ఒప్పందం కుదుర్చుకోవడాన్ని బీజింగ్ పాలకులు వ్యతిరేకించారు.

మరో వైపు బ్రూనీ చైనాకు వ్యతిరేకిగా వ్యవహరిస్తుండగా, మలేసియా తటస్థంగా ఉంది. కొలంబియా మాత్రం బీజింగ్‌తో మిత్రత్వాన్ని కొనసాగిస్తున్నది. దీర్ఘకాలంగా చైనాతో భాగస్వామిగా ఉంది.





మంగోలియా (వ్యతిరేకి)

చైనాతో 4,677 కిలోమీటర్ల సుదీర్ఘ ఉమ్మడి సరిహద్దు. కొత్త అధ్యక్షుడు బట్టుల్గా అధికారం చేపట్టిన తర్వాత బీజింగ్‌తో వ్యూహాన్ని మార్చారు. డ్రాగన్‌పై అతిగా ఆధారపడే విధానాలకు క్రమంగా స్వస్తిపలుకుతున్నారు. 90 శాతం ఎగుమతులు, 30 శాతం దిగుమతులకు ఇప్పటి వరకు బీజింగ్‌తోనే జరుగుతున్నాయి. ఇకమీదట ఢిల్లీతో స్నేహం పొంపొందించుకోవాలని మంగోలియా పాలకులు భావిస్తున్నారు.

ఒప్పందాలు: గోబి ఎడారి నుంచి రష్యాకు రోడ్డు నిర్మాణానికి చైనా ప్లాన్ చేసింది. ఈ రోడ్డు మంగోలియా మీదుగా వెళ్తుంది. ఇందుకు సుమారు 30 బిలియన్ డాలర్లను వచ్చే కొద్ది సంవత్సరాల్లో పెట్టుబడులు పెట్టనుంది.

నేపాల్ (తటస్థం)

ఇండో-చైనా యుద్ధం తర్వాత 1236కి.మీ సరిహద్దుపై 1963లో ఇరుదేశాల మధ్య ఒడంబడిక కుదిరింది. అయినా నేపాల్‌లో ప్రవహిస్తున్న లిపు సరస్సుపై ఇప్పటికీ వివాదం నడుస్తూనే ఉంది.

ఒప్పందాలు: వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకుంది. ఇది భారత ప్రయోజనాలకు విఘాతం కలిగించే చర్య. మొదటి నుంచీ నేపాల్‌కు దౌత్యపరంగానూ, వాణిజ్య అంశంలోనూ భారత్ పెద్ద దిక్కుగా ఉంది. ఈ స్థానాన్ని చైనా కబళించే ప్రయత్నం చేస్తున్నది. హైస్పీడ్ రైల్వే వ్యవస్థపై నేపాల్‌కు ఇండియా హామీ ఇచ్చింది.

భూటాన్ (తటస్థం)

మొత్తం 760కి.మీ ఉమ్మడి సరిహద్దు. కాగా, తూర్పు, పశ్చిమ ప్రాంతంలోని 270 చ. కి.మీ. భూభాగంపై సరిహద్దు వివాదం ఉంది. తనకు సంబంధించిన డొక్లామ్ వివాదం నేపథ్యంలోనూ థింపూ ప్రభుత్వం సమతూకంగా వ్యవహరించింది.

లావోస్ (మిత్రదేశం)

యువాన్ రజవంశంతో బీజింగ్ కు సత్సంబంధాలు ఉన్నాయి. మొదటి నుంచీ ఈ పేద దేశం ఎక్కువగా చైనాపైనే ఆధారపడుతూ వచ్చింది. ఒకప్పుడు మిలియన్ ఎలిఫెంట్స్ నేషన్‌గా లావోస్ ప్రసిద్ధి గాంచింది.

ఒప్పందాలు: మౌళిక రంగంతోపాటు అనేక కీలక రంగాల్లో చైనా పెట్టుబడులు ఉన్నాయి. నిరుపేద దేశమైన లావోస్ నుంచి జుంబోలను తరచూ కొనుగోలు చేస్తుంటుంది.

మయన్మార్ (మిత్రదేశం)

ఆంగ్‌సాంగ్ సూకీ హయాంలో చైనాతో వాణిజ్య సంబంధాలు వృద్ధి చెందాయి. చైనాతో మైత్రికి ఆమె ఆసక్తి చూపారు. ప్రస్తుతం మయన్మార్‌లో చైనాయే కీలక భాగస్వామిగా ఉంది. ఓడరేవులు, రహదారులు, విద్యుత్ రంగాల్లో చైనా పెట్టుబడులు పెట్టింది. ఈదేశంతో బీజింగ్‌కు 2,185 కి.మీ సరిహద్దు ఉంది.

జపాన్ (వ్యతిరేకి)

భౌగోళిక, ఆర్థిక అంశాల్లో ఈ రెండు దేశాలు పరస్పర బద్ధ శత్రువులుగా ఉన్నాయి. ప్రధానంగా సెంకాకు దీవులపై వివాదం ఇరువురి మధ్య వైరాన్ని పెంచుతోంది. దీనికి పరిష్కారంపై చైనా మొండిగా వ్యవహరించడాన్ని జపాన్ తీవ్రంగా ఆక్షేపిస్తున్నది.

ఉ. కొరియా (మిత్రదేశం)

ఉమ్మడి సరిహద్దు విస్తీర్ణం రమారమి 1420 కి.మీ. బీకూ,జియాందో పర్వత ప్రాంతాలు మావేనంటూ చైనా ఆరోపిస్తున్నది. అయితే, ఆహారం నుంచి మిగతా విషయాలన్నింటిలోనూ ఉ.కొరియా ఎక్కువగా చైనాపైనే ఆధారపడివుంది. అయితే, నియంతలా వ్యవహరిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ తీరుపై జిన్‌పింగ్‌కు ఓవైపు ఆందోళనగానే ఉంది. అమెరికా - ఉ.కొరియా ఉద్రిక్తలకు బీజింగ్ బాధ్యత వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

తైవాన్ (వ్యతిరేకి)

అమెరికాతో తైపీ స్నేహంగా మెలగలడాన్ని బీజింగ్ జీర్ణించుకోలేకపోతున్నది. చైనా కరెన్సీ అమలు చేస్తున్న ఈ దేశానికి అగ్రరాజ్యం సైనిక సహాయాన్ని అందించడాన్ని చైనా వ్యతిరేకిస్తున్నది. 193 దేశాల ఐక్యరాజ్యసమితిలో 19దేశాల మద్దతుతో చైనా నుంచి విడిపోయి తైవాన్ ప్రత్యేక దేశంగా ఏర్పాటైంది.

ఫిలిప్పీన్స్ (మిత్రదేశం)

స్కార్బోరోషోల్ వివాదంలో చైనాను గట్టిగా వ్యతిరేకించింది. బీజింగ్‌కు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి ట్రిబ్యునల్‌లో కేసు కూడా వేసింది. అంతిమ తీర్పు ఫిలిప్పీన్స్‌కు అనుకూలంగా వచ్చింది. చైనాతో స్నేహంగా ఉంటున్నప్పటికీ, తమ దేశ ప్రయోజనాల విషయంలో మాత్రం రాజీ పడకుండా వ్యవహరిస్తోంది. ఇటీవల బీజింగ్ నోటి దురుసుపై అధ్యక్షుడు డుర్టటే ఘాటుగా సమాధానం చెప్పారు కూడా.

దక్షిణ చైనా సముద్రంలో దీవుల వివాదం

ఎక్కడ?

ద.చైనా సముద్రంలోని చిన్న చిన్న దీవులు, వీటిల్లో ఉన్న సుమారు 750 ఇసుక రీచ్‌పై నాలుగు దేశాలు హక్కుల కోసం పోరాడుకుంటున్నాయి. ఈ దీవులు చైనా తీరానికి 800 కి.మీ. దూరంలో ఉన్నాయి.

ఏమిటి?

ద.చైనా సముద్రాన్ని చైనా సైనిక స్థావరాలుగా మార్చేసిం ది. తొమ్మిది దీవుల్లో సైనికసామగ్రిని, హార్డ్‌వేర్‌ను డంప్ చేసింది. మొత్తం 3200 ఎకరాల దీవులను ఏడు విభాగాలుగా చేసింది. పొరుగు దేశాలపై ఆధిపత్యానికి, యుద్ధ సమయాల్లో ఈ దీవులు చాలా వ్యూహాత్మకం. అందువల్ల చైనా ఆధిపత్యాన్ని మిగతా దేశాలు ఎంతమాత్రం సహించడం లేదు.

ఎందుకు?

కొత్తగా ఏర్పాటు చేసిన సైనిక స్థావరాల నుంచి చైనా ప్రతి ఏరియాను కవర్ చేయడానికి వీలవుతుంది. త్రిభుజా కారంలోని దీవుల నుంచి శత్రుదేశాలను లక్ష్యంగా చేసుకోడం బీజింగ్‌కు సులువైన చర్య. ఈశాన్యంలోని స్కాబోరొ షోల్ మాత్రమే ఈ లక్ష్య పరిధిలోకి రాదు. ప్రధాన భూభాగానికి 650 కి.మీ. దూరం లో ఉన్న ఓ దీవికోసం ఫిలిప్పీన్స్‌తో చైనా గొడవకు దిగింది. చైనా వాదనను ఫిలిప్పీ న్స్ ఎంతమాత్రం అంగీకరించడం లేదు.





దక్షిణ చైనా సముద్రంలోని కీలక దీవి

ఆంధ్రప్రభ క్రీడాప్రభ

ఇది ధోనీ ప్రత్యేకం

- '300' ముంగిట మహి
- అందరి కళ్లూ అతనిపైనే
- నేడు లంకతో నాలుగో వన్డే



మహేంద్ర సింగ్ ధోని.. 299 వన్డేలు.. 90 టెస్టులు... 77 టీ20లు. 50 ఓవర్ల గేమ్‌లో అత్యుత్తమ ఫినిషర్‌గా తిరుగులేని రికార్డు. రెప్పపాటు కాలంలో కళ్లు చెదిరే స్టంపింగ్స్.. కీపింగ్‌లో ప్రపంచ రికార్డు. కెప్టెన్‌గానూ చరిత్రాత్మక విజయాలు. రెండు ప్రపంచ కప్‌లు. 36 ఏళ్ల వయసులోనూ యువకులతో పోటీపడి పరిమిత ఓవర్ల క్రికెట్లో మెరుపు ఇన్నింగ్స్. లంకపై చివరి రెండు వన్డేల్లోనూ అజేయంగా నిలిచి తనలో చేవ తగ్గలేదని చాటిన మిస్టర్ కూల్.. మరో మైలురాయి ముంగిట నిలిచాడు. అది.. వన్డేల్లో '300' క్లబ్. ఇప ్పటివరకు ఐదుగురు భారత ఆటగాళ్లకే సాధ్యమైన ఫీట్. గురువారం కొలంబోలో లంకతో జరిగే నాలుగో డేనైట్ వన్డేతో ఆ ఐదుగురు దిగ్గజాల సరసన చేరబోతున్నాడు. ఈ వన్డే ధోనీ ప్రత్యేకం. ఇపుడు అందరి కళ్లూ మహిపైనే. మరో మరపురాని ప్రదర్శనతో 300వ వన్డేను చిరస్మరణీయం చేసుకుంటాడా! టీమ్ఇండియా ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో ఘనంగా గెలిచి మాజీ సారథికి జోహార్ అర్పిస్తారా! చూడాలి.

కొలంబో: కోహ్లి సేన మరో పంచ్‌కు సిద్ధమైంది. మాజీ సారథి మహికి అపురూపమైన వన్డేలో... ఇప్పటికే చప్పగా చతికిలపడ్డ శ్రీలంకపై మరో బలమైన పంజా విసిరేందుకు సమాయత్తమైంది. గత రెండు మ్యాచ్‌లలోనూ ఛేజింగ్‌లో జట్టు కష్టకాలంలో ఉన్నపుడు మిస్టర్ కూల్.. కూల్‌గా ఆడి అజేయంగా నిలిచి వరుస విజయాలను సాధించిపెట్టాడు. రెండో వన్డేలో 45, మూడో వన్డేలో 67 పరుగులు సాధించాడు. ఆ క్రమంలో 2019 ప్రపంచకప్‌పై కన్నేశాడు.

ప్రపంచంలోనే అత్యుత్తమ ఫినిషర్ అయిన ధోని.. రెండో వన్డేలో భువనేశ్వర్‌కు, మూడో వన్డేలో రోహిత్‌కు తోడ్పాటునందించాడు. ఒకవైపు టాప్‌ఆర్డర్‌ను కకావికలు చేసిన దనంజయ సైతం ధోనీపై ఒత్తిడి పెంచలేకపోయాడు. వన్డేల్లో తొలి అర్ధశతకం సాధించేలా భువీని మహి ప్రోత్సహించాడు.

బెంచ్ కదిలేనా: టీమ్ఇండియా ఇప్పటికే సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న నేపథ్యంలో రిజర్వు బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లకు చివరి రెండు వన్డేల్లోనైనా ఆడే అవకాశం వస్తుందా!. బెంచ్‌పై ఉన్న ఆటగాళ్లు కుల్‌దీప్ యాదవ్, మనీష్ పాండే, అజింక్య రహానే, శార్దూల్ ఠాకుర్‌లకు అవకాశమివ్వాలని కెప్టెన్ విరాట్ భావిస్తున్నాడు. కోహ్లి కూడా గత రెండు మ్యాచ్‌లలో పెద్దగా స్కోర్లు చేయలేదు. రాహుల్‌తో పాటు తను క ్రూడా ఫామ్‌ను అందుకోవాలని, పరుగుల వరద పారించాలని కృతనిశ్చయంతో ఉన్నాడు. నాలుగో నంబర్ బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగుతున్న రాహుల్ ఆ స్థానంలో కుదురుకున్నట్లు కనిపించడం లేదు. వరుసగా డకౌట్లు అవుతున్న కేదార్ జాదవ్‌పైనా ఒత్తిడి ఉంది. దనంజయ బౌలింగ్‌ను చదవడంలో అతను మరీ ఘోరంగా విఫలమయ్యాడు. ఆ నేపథ్యంలో జాదవ్‌కు బదులు మనీష్ పాండేకు అవకాశం ఇస్తారా అన్నది ఆసక్తికరం. ఐతే జీవం లేని పిచ్‌లే జాదవ్ స్థానాన్ని కాపాడాలి. జాదవ్ తుది జట్టులో ఉంటే కోహ్లికి మరో బౌలింగ్ అవకాశం ఉంటుంది. సిరీస్‌లో ఇంతవరకు జాదవ్ మూడు వికెట్లు తీశాడు.

300 క్లబ్‌లో..

సచిన్ టెండూల్కర్	463
రాహుల్ ద్రవిడ్	344
అజహరుద్దీన్	334
సౌరభ్ గంగూలీ	311
యువరాజ్ సింగ్	304

ఠాకుర్ నిరీక్షణేనా!: నెట్స్‌లో పదునైన బంతులు వేస్తున్న ముంబయి పేసర్ శార్దూల్ ఠాకుర్‌కు నిరీక్షణ తప్పేట్టు లేదు. భువనేశ్వర్, బుమ్రా కేవలం మూడు మ్యాచ్‌లే ఆడడంతో వారిని తప్పించి ఠాకుర్‌ను తీసుకునే అవకాశాలు లేవనే చెప్పాలి. ఐతే యువకులకు రొటేషన్ విధానంలో అవకాశమిస్తామని టీమ్ మేనేజ్‌మెంట్ అంటున్న నేపథ్యంలో స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను కోహ్లి పరీక్షించి చూడవచ్చు. చచల్ లేదా అక్షర్‌లలో ఒకరు కుల్‌దీప్‌కు దారివ్వాల్సివుంటుంది.

మరిన్ని కష్టాల్లో లంక: ఓ వైపు భారత్‌కు సంతోషకరమైన సమస్యలుంటే.. ఆతిథ్య జట్టు మాత్రం జయసూర్య నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ రాజీనామా చేయడంతో కష్టాల్లో పీకల్లోతు కూరుకుపోయింది. అసలు లంక జట్టు యాజమాన్యం సమర్ధమైన తుది పదకొండు మందిని బరిలోకి దించలేకపోతోంది. శ్రీలంక క్రికెట్ బోర్డు ఆయన రాజీనామాను ఆమోదించింది. సిరీస్ ముగిసేవరకు కమిటీ పదవుల్లో ఉంటుంది. ఐతే కమిటీ ఎంపికలపై ఇక తీక్షణ చూపులుంటాయి. జయసూర్య సారథ్యంలోని కమిటీ ఎంపికలో నిలకడ లోపించడమే సమస్యకు అసలు కారణం. గత ఏడాదిగా వారు 40 మంది ఆటగాళ్లను ఎంపిక చేసింది.

పిచ్: ప్రేమదాస మైదానంలోని వికెట్ భారీ స్కోర్లు సాధ్యం కాకపోవచ్చు. గత రెండు మ్యాచ్‌లలో అత్యధిక స్కోరు 288 పరుగులు. మరో 3 మ్యాచ్‌లలో 230 కంటే తక్కువ స్కోర్లు నమోదయ్యాయి.

వాతావరణం: ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. దీనివల్ల ఓవర్లు కోతకు గురి కావచ్చు.

నాలుగో వన్డేకు కూడా ఇదే విధానం అమలు కావచ్చు.

చండిమాల్, కపుగెదెర దూరం : కుడి బొటన వేలు గాయంతో దినేష్ చండిమాల్, వెన్ను గాయంతో తాత్కాలిక కెప్టెన్ కపుగెదెర తక్కిన సిరీస్‌కు దూరమయ్యారు. నాలుగో వన్డేలో లసిత్ మలింగ జట్టు పగ్గాలు చేపడతాడు. నిషేధానికి గురైన కెప్టెన్ ఉపుల్ తరంగ ఐదో వన్డేకల్లా (సెప్టెంబరు 3) జట్టులోకి వస్తాడు. 6న టీ20 మ్యాచ్ జరుగుతుంది. కపుగెదెర, చండిమాల్‌ల స్థానంలో ధనంజయ డిసిల్వ, దిల్షాన్ మునవీరలను ఎంపిక చేశారు. బెంచ్‌పై థిసారా పెరీర, వనిందు హసరంగ ఉండనే ఉన్నారు.

తుది జట్లు (అంచనా): భారత్: ధావన్, రోహిత్, విరాట్ (కెప్టెన్), రాహుల్, మనీష్, ధోని , పాండ్య, అక్షర్, శార్దూల్, కుల్‌దీప్, బుమ్రా.

శ్రీలంక: దిల్షాన్ మునవీర, డిక్వెల (కీపర్), కుశాల్, తిరిమానె, మాథ్యూస్, సిరివర్ధన, వనిందు హసరంగ, చమీర, దనంజయ, ఫెర్నాండో, మలింగ.



బంగ్లా సంచలనం

- ఆసీస్‌పై చరిత్రాత్మక విజయం
- ఒంటిచేత్తో గెలిపించిన షకిబుల్

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 109-2 స్కోరుతో ఆడుతోంది. విజయానికి మరో 156 పరుగులు చేయాలి. ఇంకా 8 వికెట్లు చేతిలో ఉన్నాయి. కానీ అంతర్జాతీయ క్రికెట్లో 14 గంటల్లోనే మరో సంచలనం. మొదటిది లీడ్స్‌లో వెస్టిండీస్‌దయితే.. రెండో సంచలనం.. టెస్టు క్రికెట్‌లో అందరూ ఇంకా పసికూనగానే భావించే బంగ్లాదేశ్‌ది. టెస్టు క్రికెట్‌లో మేరునగధీర ఆస్ట్రేలియాకే ఈ పసికూన షాకిచ్చింది. బుధవారం ఆసీస్‌పై చరిత్రాత్మక తొలి విజయాన్ని దక్కించుకుంది. బంగ్లాదేశ్‌తో సిరీస్ కోసం ఎన్నో కసరత్తులు చేసి వచ్చిన స్మిత్ సేనకు తొలి టెస్టులో భంగపాటు తప్పలేదు. ఆల్‌రౌండర్ షకిబుల్ హసన్ (10-153) బంగ్లా చిరస్మరణీయ విజయానికి కర్త, కర్మ, క్రియ అయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లోనూ ఐదేసి వికెట్ల ప్రదర్శనతో బంగ్లాకు అపూర్వ విజయాన్ని కట్టబెట్టాడు. వ్యక్తిగతంగా అరుదైన రికార్డునూ దక్కించుకున్నాడు. అతని విజృంభణలో తొలి టెస్టులో ఆసీస్‌పై బంగ్లా 20 పరుగుల తేడాతో గెలిచింది. 265 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ బుధవారం నాలుగో రోజు 244 పరుగులకు ఆలౌటైంది. షకిబుల్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. ఈ గెలుపుతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో బంగ్లా 1-0 ఆధిక్యం సాధించింది.

మిర్పూర్: ఆసీస్ విజయానికి 265 పరుగులు కావాలి. మంగళవారం ఆట ఆఖరుకు రెండు వికెట్లు కోల్పోయినా 109 పరుగులు సాధించి విజయం వైపు పయనిస్తున్నట్లనిపించింది. కానీ బుధవారం ఉదయం అనేక నాటకీయ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఓపెనర్ డేవిడ్ వార్నర్ 75 పరుగులతో కెప్టెన్ స్మిత్ 25 పరుగులతో క్రీజులోకి వచ్చారు. వార్నర్ (112, 135 బంతుల్లో, 16 ఫోర్లు, 1 సిక్స్) టెస్టుల్లో 19వ సెంచరీ సాధించి జోరుమీదున్నాడు. స్మిత్ (37, 99 బంతుల్లో, 3 ఫోర్లు) క్రీజులో పాతుకుపోయి వార్నర్‌కు తోడ్పాటునంది స్తున్నాడు. వీరిద్దరు కలిసి మూడో వికెట్‌కు 130 పరుగులు జత చేశారు. ఆసియాలో నాలుగో ఇన్నింగ్స్‌లో ఆసీస్‌కిదే అత్యుత్తమ భాగస్వామ్యం. బండి నిదానంగా గెలుపు వైపు అడుగులు వేస్తున్నట్లే కనిపించింది. 158-2తో గెలుపు దిశగా ఆసీస్ దూసుకుపోతున్నట్లే కనిపించింది. సరిగ్గా అదే దశలో ఆసీస్‌ను తొలి దెబ్బ తీశాడు. అదీ ఆసీస్ కోలుకోలేని దెబ్బ. వార్నర్‌ను ఎల్బీగా వెనక్కి పంపాడు. వార్నర్ ఔట్‌తో ఆసీస్ పతనానికి నాంది పడింది. పతనం ఎంత వేగంగా సాగిందంటే.. 86 పరుగులకే తక్కిన 7 వికెట్లు కోల్పోయింది. వాటిలో మూడు షకిబుల్‌వే. పిచ్ విపరీతంగా టర్న్ కావడం, బౌన్స్‌లో భిన్నంగా ఉండడంతో ఆసీస్ బ్యాట్స్‌మెన్‌కు బ్యాటింగ్ అసాధ్యమైంది. చివర్లో పాట్ కమిన్స్ (33 నాటౌట్) పోరాడినా ఆసీస్ విజయానికి అది చాలలేదు.

ఇది మూడో విజయం: ఏడాది కాలంలో మేటి జట్లపై బంగ్లాకిది మూడో విజయం. ఇంతకుముందు ఇంగ్లాండ్, శ్రీలంకలపై గెలిచింది. ఈ టెస్టు ఇటు తమిమ్ ఇక్బాల్‌కు, అటు షకిబుల్‌కు కూడా 50వది. తమిమ్ 71, 78 స్కోర్లు సాధించగా, షకిబుల్ తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు సాధించి, 5 వికెట్లు దక్కించుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు తీసి చిరస్మరణీయ విజయాన్ని లిఖించాడు.

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 260, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 217, **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** 221, **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** వార్నర్ (ఎల్బీ) (బి) షకిబుల్ 112, రెన్‌షా (ఎల్బీ) (బి) హసన్ మిరాజ్ 5, ఖవాజా (సి) తైజుల్ (బి) షకిబుల్ 1, స్మిత్ (సి) రహిం (బి) షకిబుల్ 37, హ్యాండ్స్‌కాంబ్ (సి) సౌమ్య శేఖర్ (బి) తైజుల్ 15, మాక్స్‌వెల్ (బి) షకిబుల్ 14, వేడ్ (ఎల్బీ) (బి) షకిబుల్ 4, అగర్ (సి అండ్ బి) తైజుల్ 2, కమిన్స్ నాటౌట్ 33, లియోన్ (సి) సౌమ్య (బి) తైజుల్ 12, హాజల్‌వుడ్ (ఎల్బీ)(బి) తైజుల్ 0, ఎక్స్‌ట్రాలు 9, మొత్తం (70.5 ఓవర్లలో ఆలౌట్) 244, వికెట్ల పతనం: 1-27, 2-28, 3-158, 4-171, 5-187, 6-192, 7-195, 8-199, 9-228, 10-244, **బౌలింగ్:** మిరాజ్ 19-3-80-2, నాజిర్ 3-2-2-0, షకిబుల్ 28-7-85-5, తైజుల్ ఇస్లామ్ 19.5-2-60-3, రహమాన్ 1-0-8-0

ధోనీతో సెల్ఫీ కోసమని..

కొలంబో: ధోనీ బుధవారం ఇక్కడి మైదానంలో బ్యాటింగ్ ప్రాక్టీసు చేస్తుండగా ఓ లంక అభిమాని ఆ ప్రాంతానికి వచ్చాడు. దాంతో ధోని ప్రాక్టీసుకు అంతరాయం ఏర్పడింది. ధోనిని సెల్ఫీ కోసం కోరాడు. మైదానం సిబ్బంది అయిన ఆ అభిమానితో ధోని ఏమీ అనుకుండా ప్రశాంతంగా సెల్ఫీ దిగాడు. ఇక చాలు వెళ్లిపొమ్మని చెప్పాడు. కానీ భద్రతా సిబ్బంది కన్ను గప్పి వచ్చిన ఆ అభిమాని కరచాలనం ఇస్తున్న ఫోజులో మరో సెల్ఫీ కోరాడు. ఇంతలో భారత జట్టు సిబ్బంది అక్కడికి హుటాహుటిన వచ్చి అతణ్ని అక్కడి నుంచి పంపేశారు.

భద్రత కట్టుదిట్టం: గురువారం నాటి వన్డే కోసం కొలంబో మైదానంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మూడో వన్డేలో తమ జట్టు ఓటమి అంచుల్లో ఉండగా లంక అభిమానులు అల్లరికి దిగిన నేపథ్యంలో నాలుగో వన్డే ుకు కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా ఏర్పాట్లు చేశారు. అదనంగా 1000 మంది పోలీసు సిబ్బందిని తరలించారు.



పీవీ సింధుకు సీఎం కేసీఆర్ సత్కారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించిన ప్రముఖ క్రీడాకారిణి పివి సింధూ, కోచ్ గోపీచంద్‌లను తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సత్కరించారు. వీరిద్దరినీ బుధవారం మధ్యాహ్నం ప్రగతి భవన్‌కు పిలిపించి అభినందించారు. శాలువాలతో సత్కరించి ప్రశంసించారు. ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ ఫైనల్ పోటీలో కొద్దిపాటి తేడాతో ఓడిపోయినా, మంచి ప్రతిభ కనబరిచారని సింధూ క్రీడా ప్రతిభను కొనియాడారు. 'బెటర్ లక్ నెక్ట్స్' 'ఆల్ ది బెస్ట్' అని భుజంతట్టి ప్రోత్సహించారు. ప్రత్యేకంగా నేసిన పోచంపల్లి చేనేత చీరను పీవీ సింధుకు బహూకరించారు. ఇటీవల ప్రభుత్వం బహుమతిగా ఇచ్చిన ఇంటి స్థలానికి సంబంధించిన ధృవపత్రాలను అందజేశారు.

హ్యాడ్లీ తర్వాత షకిబే



షకిబుల్ హసన్.. పదేళ్లుగా బంగ్లాదేశ్ క్రికెట్‌కు ముఖచిత్రంగా ఉన్నాడు. బంగ్లా సాధించిన అనేక విజయాల్లో అతని పాత్ర అమేయం... అద్వితీయం. ఒకరకంగా చెప్పాలంటే.. బంగ్లా చిరు జట్టుకు అతను వన్‌మ్యాన్ ఆర్మీ. అంతగా విజయాలు సాధిస్తున్నాడు కాబట్టే.. షకిబ్ ఐసీసీ ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రపీఠంపై కూర్చున్నాడు. 50 టెస్టుల్లో 186 వికెట్లు, 177 వన్డేల్లో 224 వికెట్లు. ఇంత నిలకడగా ఆడే మేటి ఆల్‌రౌండర్ మనకూ ఉంటేనా అని ప్రతి జట్టు కోరుకునే ఆటగాడు షకిబుల్. ఆసీస్‌పై విజయంతో షకిబుల్ ఖాతాలో మరెన్నో రికార్డులు వచ్చి చేరాయి. వాటిలో ప్రముఖమైంది.. ఒకే టెస్టులో అర్ధసెంచరీ... పది వికెట్ల ప్రదర్శన ఒకటి కంటే ఎక్కువ సార్లు సాధించిన ఘనతను న్యూజిలాండ్ దిగ్గజం రిచర్డ్ హ్యాడ్లీ, షకిబుల్ మాత్రమే సొంతం చేసుకున్నారు. హ్యాడ్లీ మూడు సార్లు ఈ ఫీట్ చేశాడు.

నా భార్యకు కృతజ్ఞతలు

''ఆసీస్‌పై గెలుస్తామని నిన్న రాత్రి అనుకోలేదు. 'నీవు రేపు బంగ్లాను గెలిపిస్తావు' అని నా భార్య నాతో అంది. నాపై నమ్మకం ఉంచిన నా భార్యకు కృతజ్ఞతలు. జట్టు విజయంలో పాలు పంచుకున్నందుకు సంతోషంగా ఉంది. అభిమానులు మాకు మద్దతివ్వడానికి వస్తున్నారు. మనం గెలుస్తామన్న విశ్వాసంతోనే వారు మైదానంలోకి వస్తున్నారని సహచరులకు చెప్పాను. వారి నమ్మకాన్ని నిజం చేద్దామన్నాను'' **- షకిబుల్**

ఇవీ రికార్డులు

4: టెస్టులు ఆడే అన్ని దేశాలపైనా ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన నాలుగో బౌలర్ షకిబ్. గతంలో స్టెయిన్, మురళీ, హెరాత్ ఈ ఘనత సాధించారు.

5: 50వ టెస్టులో 5 వికెట్ల ప్రదర్శన చేసిన బౌలర్ షకిబ్. ఇతనికంటే ముందు బెయిలీ, హ్యాడ్లీ, మురళి, హర్భజన్ ఉన్నారు.

10: బంగ్లాదేశ్‌కు 101 టెస్టుల్లో 10వ విజయం. ఆ ప్రత్యర్థి జట్లలో ఆసీస్ ఐదవది.


హర్యానాపై ముంబా గెలుపు



ముంబయి: కెప్టెన్ అనూప్‌కుమార్ (8), రైడర్ శ్రీకాంత్ జాదవ్ కలిసి 14 పాయింట్లు గెలవడంతో యు ముంబా 38-32 తేడాతో హర్యానా స్టీలర్స్‌పై విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఉదాసీనంగా ఆడిన హర్యానా మూల్యం చెల్లించుకుంది. పాయింట్లు సాధించడంలో డిఫెన్స్ కూడా తంటాలు పడింది. హర్యానా తరఫున వికాస్ కండోల 9 పాయింట్లు సాధించాడు. ముంబా 10 మ్యాచ్‌లలో 24 పాయింట్లతో ఏ జోన్‌లో మూడో స్థానంలో నిలిచింది. హర్యానా 7 మ్యాచ్‌లలో 23 పాయింట్లు సాధించి నాలుగో స్థానంలో ఉంది.

ఓటమి అంచుల్లోంచి..

- ఫెదరర్ గెలుపు
- నాదల్ అలవోకగా ముందంజ
- యుఎస్ ఓపెన్



న్యూయార్క్: ప్రపంచ నెంబర్ మూడు రోజర్ ఫెదరర్.. ఓటమి అంచుల్లోకి వెళ్లివచ్చాడు. యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఫెదరర్.. అమెరికా టీనేజర్ టియాఫోతో తీవ్రంగా పోరాడి గెలిచి ఊపిరి తీసుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ ఐదు సెట్ల పోరులో ఫెదరర్ 4-6, 6-2, 6-1, 1-6, 6-4తో చమటోడ్చి గెలిచాడు. తొలి సెట్‌నే కోల్పోయిన ఫెదరర్ తర్వాత పుంజుకొని వరుసగా రెండు సెట్లు సొంతం చేసుకున్నాడు. కానీ నాలుగో సెట్లో ఫెదరర్ మరీ పేలవంగా ఆడాడు. దీంతో పోరు నిర్ణాయక ఐదో సెట్‌కు దారితీసింది. ఆ సెట్లో పుంజుకొని సెట్‌ను, మ్యాచ్‌ను ఫెడ్డీ గెలుచుకున్నాడు. వీరిద్దరి పోరు 2గంటల 35 నిమిషాల పాటు నువ్వానేనా అన్నట్లు సాగింది. ''బాగా పోరాడాం. చాలా ఉత్కంఠగా ఉంది. అందుకే నేను ఇక్కడికి వస్తాను. టియాఫోకి మంచి కెరీర్ ఉంటుంది'' అని ఫెదరర్ అన్నాడు. ''అతను గొప్ప ఆటగాడు. బాగా పోరాడాడు. మంచి భవిష్యత్తు ఉంది'' అని కితాబిచ్చాడు.

కాగా మరో తొలి రౌండ్ పోరులో సునాయాసంగా గెలిచి స్పెయిన్ బుల్, ప్రపంచ నెంబర్ వన్ రఫేల్ నాదల్... ఫెదరర్ వైపు మొదటి అడుగు వేశాడు. ఈ రౌండ్లో నాదల్ 7-6 (6), 6-2, 6-2 తేడాతో డుసాన్ లజొవిక్‌పై సునాయాసంగా గెలిచాడు. ''ఈ రోజు గెలిచాను. అదే నాకు ప్రాధాన్యం'' అని విలేకర్లతో నాదల్ అన్నాడు.

ఎలీనా స్వితోలీనా ముందంజ: మహిళల సింగిల్స్ తొలి రౌండ్ పోరులో ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్వితోలినా చెమటోడ్చి గెలిచింది. తొలి గ్రాండ్ స్లామ్ కోసం తహతహలాడుతున్న ఈ నాలుగో సీడ్ 6-0, 6-7 (5-7), 6-3తో కష్టపడి 42వ ర్యాంకర్ కతెరినా సినియాకోవా (చెక్)పై గెలిచింది.



ఎలీనా

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.